


సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:141 | హైదరాబాద్ 22 డిసెంబర్ 2025, సోమవారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-141 | Hyderabad 22 December 2025, Monday | Pages: 8, Rs. 5/-




## కేసీఆర్ అసెంబ్లీకి రా!
# తేల్చుకుందాం...



జనవరి 2 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటన

**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్) :**

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ కి రావాలని అక్కడే అన్ని విషయాలు తేల్చుకుందామని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు . మాజీ సీఎం కేసీఆర్ ప్రెస్‌మీట్ పెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , చాలా కాలం తర్వాత బయటకు వచ్చిన కేసీఆర్ మారుతారని ఆశించానని, కానీ ఆయన తీరులో ఎలాంటి మార్పు రాలేదని, మళ్లీ అవే పాత అబద్ధాలు చెబుతున్నారని ఆయన మండిపడ్డారు. తనకు రాజకీయ భిక్ష పెట్టిన ప్రాంతమైన పాలమూరు గురించి కేసీఆర్ పచ్చి అసత్యాలు మాట్లాడటం శోచనీయమన్నారు. "కలుగు లోంచి ఎలుక బయటకు వచ్చినట్లు" కేసీఆర్ ఇప్పుడు బయటకు వచ్చారని ఎద్దేవా చేశారు . కేసీఆర్ తెలంగాణకు చేసిన మేలు కంటే అన్యాయమే ఎక్కువని విమర్శించారు. కేసీఆర్‌ను ఒక "ఆర్థిక ఉగ్రవాది"గా సీఎం కేసీఆర్ అభివర్ణించారు . పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు. కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా, దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇందుకోసం జనవరి 2వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని, ఆ సభలో తెలంగాణకు ఎవరేం చేశారో లెక్కలతో సహా చర్చిద్దామని కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

- తెలంగాణ రాజకీయ క్షేత్రంలోకి కేసీఆర్ పునరాగమనం
- రాష్ట్రానికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోనంటూ హెచ్చరిక
- జనవరి నుంచి భారీ బహిరంగ సభలకు శ్రీకారం
- ఏపీ సీఎంపై కేసీఆర్ సెటైర్లు
- కృష్ణా జలాల జలదోపిడీపై న్యాయపోరాటం చేస్తామని ప్రకటన
- రైతులకు యూరియా ఇవ్వలేని చేతకాని ప్రభుత్వమని ఎద్దేవా

# నేను వస్తా...
## అందరి లెక్కలు తేలుస్తా



ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్


తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే ఇకపై చూస్తూ ఊరుకోనని, ప్రజా సమస్యలపై పోరాటం చేయడానికి వస్తున్నానని మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సుదీర్ఘ విరామం తర్వాత బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంచలన వ్యాఖ్యలతో రాజకీయ క్షేత్రంలోకి పునరాగమనం చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన గంటన్నర పాటు సుదీర్ఘ ప్రసంగం చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగితే చూస్తూ ఊరుకోనని, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యుద్ధం ప్రకటిస్తానని హెచ్చరించారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కుమ్మక్కై తెలంగాణకు ద్రోహం చేస్తున్నాయని కేసీఆర్ మండిపడ్డారు. "ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైన పాలమూరును పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సస్యశ్యామలం చేశాం. కానీ నేడు చంద్రబాబు మాట విని కేంద్రం డీపీఆర్‌ను వెనక్కి పంపితే, రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడం దారుణం" అని ధ్వజమెత్తారు.

...::: తరువాయి 5వ పేజీలో..



# వందేళ్ల... ఆర్‌ఎస్‌ఎస్
## భారత పునర్నిర్మాణ మహాయజ్ఞం

యువ భారతం గుండె చప్పుడుగా మారిన
## వందేళ్ళ యువ సంస్థ



### ఒక లోతైన సామాజిక విశ్లేషణ...

సాధారణంగా ఏ సంస్థకైనా వందేళ్లు నిండాయంటే, అది వృద్ధాప్యంలోకి వచ్చినట్లు. దాని ఆలోచనలు పాతబడిపోతాయి, యువత దానికి దూరమవుతుంది. కానీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) విషయంలో ఇది పూర్తిగా తలకిందులైంది. సంఘ్ వయసు 100 ఏళ్లు కావచ్చు, కానీ దాని హృదయం మాత్రం "నిత్య యవ్వనం" (Ever Young). గత దశాబ్ద కాలంగా (2014–2024) ఒక ఆశ్చర్యకరమైన గణాంకం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. సంఘ్ వెబ్‌సైట్‌లో "జాయిన్ ఆర్‌ఎస్‌ఎస్" (Join RSS) అని క్లిక్ చేస్తున్న వారిలో 70% మంది 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న యువకులే. అందులోనూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు, ఐఐటీ/ఐఐఎం విద్యార్థులు, సివిల్స్ ఆశావహులు అత్యధికంగా ఉన్నారు. ఒకప్పుడు "సంఘ్ అంటే వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు పార్కుల్లో కర్రలు పట్టుకుని చేసే కవాతు" అనే అపోహ ఉండేది. కానీ నేడు సంఘ్ అంటే "ల్యాప్‌టాప్ పట్టుకున్న దేశభక్తులు", "స్టార్టప్స్ నడిపే స్వయంసేవకులు" అనే కొత్త చిత్రం ఆవిష్కృతమైంది. పాశ్చాత్య దేశాల్లో యువత "వోకిజం" (Wokeism), "సెల్ఫ్‌లోథింగ్" (సొంత సంస్కృతిని ద్వేషించడం) వైపు వెళుతుంటే, భారతీయ యువత మాత్రం "డీకాలనైజేషన్" (వలసవాద విముక్తి) వైపు, "గర్వ్ సే కహో హమ్ హిందూ హై" అనే నినాదం వైపు ఎందుకు మళ్లుతోంది? ఏ శక్తి వారిని కాషాయ ధ్వజం కిందకు లాగుతోంది?

...::: తరువాయి 2వ పేజీలో..

# మీ ప్రేమే నా బలం...



**తాడేపల్లి (ఏడీఎన్‌ఎన్) :**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ,ఆదివారం 53వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు, పార్టీ శ్రేణులు రాజకీయ ప్రముఖులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. "వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు నాపై చూపిస్తున్న ప్రేమాభిమానాలు చూసి ఉప్పొంగిపోయాను. మీ అందరి మద్దతే నాకు కొండంత బలం" అని ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా ఉద్వేగభరిత పోస్ట్ చేశారు. జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని సోషల్ మీడియా వేదికలు హోరెత్తిపోతున్నాయి.

...::: తరువాయి 4వ పేజీలో..



## ఓటు బ్యాంకు రాజకీయాలకు
# కేరాఫ్ కాంగ్రెస్

**న్యూఢిల్లీ (ఏడీఎన్‌ఎన్) :**

కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతి వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని, బంగ్లాదేశ్ నుండి వచ్చే అక్రమ వలసదారులు అస్సాంలో స్థిరపడేలా ఆ పార్టీ సహకరిస్తోందని ప్రధానమంత్రి మోదీ ఆరోపించారు.అస్సాంలోని దిబ్రుగఢ్‌లో రూ.10,601 కోట్లతో నిర్మించిన ఎరువుల కర్మాగారాన్ని ప్రారంభించిన తర్వాత జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం అధికారం కోసమే ఓటర్ల జాబితా సవరణను కాంగ్రెస్ అడ్డుకుంటోందని, అస్సాం ప్రజల గుర్తింపు మరియు ఆత్మగౌరవం ఆ పార్టీకి ఏమాత్రం పట్టింపు లేదని మండిపడ్డారు. ప్రధాని చేసే ప్రతి మంచి పనికి కాంగ్రెస్ మోకాలడ్డుతోందని ఆయన విమర్శించారు . అస్సాం ఉనికిని కాపాడేందుకు బీజేపీ ఒక రక్షణ కవచంలా నిలుస్తుందని ప్రధాని భరోసా ఇచ్చారు.

## అబద్ధాలు చెప్పడంలో
# కేసీఆర్ దిట్ట

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్




**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్) :**

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ చేసిన ఆరోపణలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సచివాలయంలో మీడియాతో ఆదివారం మాట్లాడిన ఆయన, కేసీఆర్ వ్యాఖ్యలు 90 శాతం అబద్ధాలని, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా సర్వనాశనం చేశారని ఆయన మండిపడ్డారు. 'తెలంగాణ గుండెకాయ' అని చెప్పుకుంటూ లక్షల కోట్లు పోసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కుప్పకూలిపోయిందని, అది బూడిదలో పోసిన పన్నీరుగా మారిందని మంత్రి ఉత్తమ్ విమర్శించారు.

కేవలం కమీషన్ల కోసమే భారీ ప్రాజెక్టులు కట్టారని, దీనివల్ల ఒక్క రైతుకు కూడా లాభం కలగలేదని ధ్వజమెత్తారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పాలమూరు, దిండి, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదని మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రజలు కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు.

...::: తరువాయి 5వ పేజీలో..



## బిగ్‌బాస్ విజేతగా
# సామాన్యుడు

**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్) :**

బిగ్‌బాస్ తెలుగు సీజన్9 విజేతగా సామాన్యుడి కోటాలో అడుగుపెట్టిన కల్యాణ్ పడాల నిలిచారు. ఉత్కంఠభరితంగా ఆదివారం సాగిన గ్రాండ్ ఫినాలేలో హోస్ట్ నాగార్జున ఆయనను విజేతగా ప్రకటించి, బిగ్‌బాస్ ట్రోఫీతో పాటు రూ.35 లక్షల ప్రైజ్ మనీని అందజేశారు. ఒక సీఆర్పీఎఫ్ జవాన్ అయిన కల్యాణ్, సినిమాలపై ఉన్న మక్కువతో బిగ్ బాస్ నిర్వాహకులు నిర్వహించిన 'అగ్ని పరీక్ష'లో నెగ్గి హౌస్‌లోకి ప్రవేశించారు. ఫినాలే రేసులో భాగంగా బిగ్‌బాస్ ఆఫర్ చేసిన రూ.20 లక్షల గోల్డెన్ బ్రీఫ్‌కేస్‌ను కూడా ధైర్యంగా వదులుకొని, ప్రేక్షకుల తీర్పుపై నమ్మకంతో నిలబడి అంతిమంగా విజయాన్ని అందుకున్నారు. షో ప్రారంభంలో కొంత నెమ్మదిగా సాగినప్పటికీ, చివరి కెప్టెన్‌గా, మొదటి ఫైనలిస్ట్ గా నిలిచి తన సత్తా చాటారు. తనూజ, ఇమ్మాన్యుయేల్ వంటి బలమైన కంటెస్టెంట్ల నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ, తనదైన నిజాయితీతో కూడిన ఆటతీరుతో ప్రేక్షకుల మనసు గెలుచుకుని బిగ్‌బాస్ చరిత్రలో ఒక కామన్‌మ్యాన్ విజేతగా నిలిచి రికార్డు సృష్టించారు.



## వీజీ జీ రామ్‌జీ బిల్లుకు
# రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ (ఏడీఎన్‌ఎన్) :**

మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ.. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన వీబీ గ్రామ్ బిల్లు 2025కు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. నరేంద్ర మోదీ సర్కార్ సంకల్పించిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (గ్రామిన్) బిల్లుపై ఆదివారం ముర్ము సంతకం చేశారు. దీంతో దాదాపు ఇరవై ఏళ్లుగా కరువు పనిగా కొనసాగుతున్న మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టం (MGNAREGA)కనుమరుగవ్వనుంది. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా పలు సంస్కరణలకు రూపమిస్తున్న మోడీ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొత్త పేరుతో కొనసాగించనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 100 రోజులు ఉపాధి కల్పిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది.

...::: తరువాయి 2వ పేజీలో..

## దక్షిణాఫ్రికాలో కాల్పులు..
# 9 మంది మృతి



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్) :**

దక్షిణాఫ్రికాలో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఓ సాయుధుడు జరిపిన కాల్పుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం జోహన్నెస్‌బర్గ్ శివారులోని బెకర్స్ డాల్ టౌన్‌షిప్‌లో ఈ దారుణం జరిగింది. కాల్పుల చప్పుడుతో భయాందోళనకు గురైన ప్రజలు పరుగులు తీశారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు. కాల్పులకు కచ్చితమైన కారణం తెలియరాలేదన్నారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తాజా కాల్పుల నేపథ్యంలో ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. ఈ నెల 6న ప్రిటోరియా సమీంలో కూడా కాల్పులు చోటు చేసుకొన్నాయి. ఈ ఘటనలో మూడేళ్ల చిన్నారితో సహా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు.

# నేరుగా భూమిపైకి శాటిలైట్



❖ స్పేస్‌ఎక్స్ క్లారిటీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్) :**

టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ కు చెందిన స్టార్‌లింక్ ప్రాజెక్ట్ లోని ఉపగ్రహాల్లో ఒక గ్రహం, ఇటీవల అంతరిక్షం నుంచి అదుపుతప్పి భూమివైపుకు దూసుకువస్తోంది. ఈనెల 17న భూమి నుంచి 418 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న'శాటిలైట్ 35956'హఠాత్తుగా అక్కడి నుంచి జారిపోవడంతో, స్పేస్‌ఎక్స్ దానిపై పూర్తి నియంత్రణని కోల్పోవడంతో..ఆ సంస్థ వివరణ ఇచ్చింది. ఉపగ్రహంలో సాంకేతికలోపం తలెత్తి ప్రొపెల్షన్ ట్యాంక్‌లో గ్యాస్ అత్యంత శక్తిమంతంగా బయటకు వెలువడిందని..దాంతో ఒక్కసారిగా అది నాలుగు కిలోమీటర్ల కిందకు దూసుకొచ్చినట్లు, ఆ తర్వాత కొన్ని భాగాలుగా విడిపోయి మెల్లగా జారుతున్నాయని.. వారం రోజుల్లోగా అవి భూవాతావరణంలోకి వచ్చి కూలిపోవచ్చని స్పేస్‌ఎక్స్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది.

...::: తరువాయి 3వ పేజీలో..




## రాజకీయా సందిగ్ధతకు
# స్థానిక నేతలదే బాధ్యత

**కలబురగి (ఏడీఎన్‌ఎన్) :**

రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి స్థానిక నేతలే బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కలబురగిలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సూచించారు. "హైకమాండ్ క్లారిటీతోనే ఉంది. కానీ స్థానిక స్థాయిలోనే కొంత గందరగోళం నెలకొంది. అలాంటప్పుడు ప్రతి చిన్న విషయానికి అధిష్ఠానాన్ని నిందించడం ఏమాత్రం సరికాదు." అని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీలో అంతర్గత విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప, బహిరంగ ప్రకటనలతో పార్టీ ప్రతిష్టను దెబ్బతీయవద్దని హితవు పలికారు.

...::: తరువాయి 2వ పేజీలో..

## తెలంగాణలో ఓటరు
# జాబితా ప్రక్షాళన



సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ప్రకటన

బిహార్‌లో విజయవంతంగా అమలు చేసిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియను త్వరలో తెలంగాణలోనూ చేపట్టబోతున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ హైదరాబాద్ వేదికగా ఆదివారం కీలక ప్రకటన చేశారు. కెనడా దేశ జనాభా కంటే తెలంగాణలోనే ఓటర్లు అధికంగా ఉన్నారని, ఇంతటి భారీ ఓటరు జాబితాను దోషరహితంగా తీర్చిదిద్దే బాధ్యత బూత్ లెవల్ ఆఫీసర్లదేనని పేర్కొన్నారు. చనిపోయిన వారి పేర్లు తొలగించడం, డబుల్ ఓట్లను గుర్తించడం వంటి లోపాలను సరిదిద్దడమే ఈ ఎస్‌ఐఆర్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. భారత ఎన్నికల యంత్రాంగం ప్రపంచానికే మార్గదర్శిగా నిలుస్తోందని, బీఎల్‌వోలే దేశ రాజ్యాంగానికి నిజమైన సైనికులని ఆయన కొనియాడారు. బిహార్‌లో ఈ ప్రక్రియ తర్వాత 7.5 కోట్ల మంది ఓటర్లతో ఫిర్యాదులు లేని జాబితాను విడుదల చేశామని, అదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా బీఎల్‌వోలు అంకితభావంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## కోడలి కోసం
# కొడుకును చంపేశాడు

**హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్) :**

కరీంనగర్ జిల్లాలో తండ్రి కొడుకుల బంధానికే మాయని మచ్చ తెచ్చేలా ఒక దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. తన కోడలితో ఉన్న అక్రమ సంబంధానికి అడ్డుపడుతున్నాడనే కారణంతో కన్న తండ్రి లచ్చయ్య, తన కుమారుడు అంజయ్య (36)ను సుపారీ ఇచ్చి హతమార్చాడు. 2017లో ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన అంజయ్య, 2019లో తిరిగి స్వగ్రామానికి వచ్చినప్పటి నుంచి తన తండ్రి , తన భార్య మధ్య ఉన్న అక్రమ సంబంధాన్ని గమనించాడు. పలుమార్లు వారిద్దరినీ మందలించి ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించినప్పటికీ వారిలో మార్పు రాలేదు. పైగా తమ సంబంధానికి అంజయ్య అడ్డువస్తున్నాడని భావించిన లచ్చయ్య, కోడలితో కలిసి అతడిని వదిలించుకోవాలని పథకం వేశాడు.

...::: తరువాయి 5వ పేజీలో..

## శ్రీకృష్ణుడు, హనుమంతుడు
# గొప్ప దౌత్యవేత్తలు



భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం

**న్యూఢిల్లీ (ఏడీఎన్‌ఎన్) :**

శ్రీకృష్ణుడు , హనుమంతుడు ప్రపంచంలోనే అత్యున్నతమైన దౌత్యవేత్తలని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కొనియాడారు. పుణెలో ఆదివారం జరిగిన బుక్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ భారతీయ సంస్కృతి, రాజనీతిపై అత్యంత ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో..

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
22.12.2025
www.manasarkar.com

# శ్రీకృష్ణుడు, హనుమంతుడు గొప్ప దౌత్యవేత్తలు

**మొదటిపేజీ తరువాయి...**

తన దృష్టిలో భారత్‌కు వ్యూహాత్మక రాజకీయాలు, రాజనీతి తెలియవని విదేశీ రచయితలు రాసిన పుస్తకాలను చదివి తాను విసిగిపోయానని, అందుకే మన ఇతిహాసాల్లోని అద్భుతమైన దౌత్యనీతిని ప్రపంచానికి తెలియజేయాలనుకుంటున్నానని పేర్కొన్నారు. రామాయణంలో హనుమంతుడు లంకకు వెళ్లి సీతమ్మకు ధైర్యం చెప్పడమే కాకుండా, రావణుడిలో భయాన్ని కలిగించిన తీరు గొప్ప దౌత్యానికి ఉదాహరణ అని వివరించారు. అలాగే మహాభారతంలో శ్రీకృష్ణుడు కౌరవపాండవుల మధ్య సంధి కోసం ప్రయత్నిస్తూనే ధర్మం వైపు నిలబడిన విధానాన్ని గుర్తు చేశారు. అటువంటి మహానుభావుల రాజనీతిని ఆదర్శంగా తీసుకునే ప్రధాని మోదీ నాయకత్వంలో తాను అంతర్జాతీయ వేదికలపై ముందుకు సాగుతున్నానని జైశంకర్ స్పష్టం చేశారు.

# శాస్త్రవేత్త ప్రతిభని కొనియాడిన అంబానీ




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ దిగ్గజ శాస్త్రవేత్త డాక్టర్ రఘునాథ్ అనంత్ మషేల్కర్ ప్రతిభను అభినందించారు. రికార్డు స్థాయిలో 54 గౌరవ డాక్టరేట్లు పొందిన డాక్టర్ మషేల్కర్ అసాధారణ విద్యా మైలురాయిని పురస్కరించుకుని, ముంబైలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో ప్రొఫెసర్ ఎం.ఎం. శర్మతో పాటు మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి చంద్రకాంత్ పాటిల్‌తో సహా ప్రముఖులు పాల్గొన్నారు. నవ భారత్ నిర్మాణంలో శాస్త్రవేత్తల పాత్రను కొనియాడుతూ ఈ సందర్భంగా ఒక ప్రత్యేక పుస్తకావిష్కరణని నిర్వహించారు.ముంబై వీధి దీపాల నీడలో చదువుకున్న ఒక సామాన్య బాలుడు, ప్రపంచస్థాయి శాస్త్రీయ ఐకాన్‌గా ఎదిగిన దిగ్గజ శాస్త్రవేత్త డాక్టర్ రఘునాథ్ అనంత్ మషేల్కర్ ప్రతిభను రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ భావోద్వేగానికి గురయ్యారు. మషేల్కర్ జీవిత ప్రయాణం ఆధునిక భారతదేశ ఎదుగుదలకు నిలువుటద్దమని పేర్కొన్నారు. కటిక పేదరికం నుండి విశ్వవ్యాప్త గౌరవం పొందే స్థాయికి ఆయన చేరడం వెనుక తల్లి అంజనీ గారి ప్రోత్సాహం, ఆయన అచంచల సంకల్పం ఉన్నాయని గుర్తుచేశారు. పండ్లతో నిండిన చెట్టు కిందకే వంగి ఉన్నట్లుగా, ఇన్ని విజయాలు సాధించినా ఆయన ఎంతో వినయంగా ఉండటం అందరికీ ఆదర్శమని కొనియాడారు.రిలయన్స్ ఇండస్ట్రీస్ కేవలం ప్రాజెక్టులను నిర్మించే దశ నుండి సైన్స్ ఆధారిత ఆవిష్కరణల దిశగా మళ్లడంలో మషేల్కర్ కృషి ఎంతో ఉందన్నారు. 2000 సంవత్సరంలో ఆయన సూచనలతోనే రిలయన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఏర్పడిందని అంబానీ అన్నారు. ఈ మార్పు కారణంగానే నేడు రిలయన్స్ లో లక్షకు పైగా సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారన్నారు.



# ఆటోడ్రైవర్‌ని కొట్టిన బీజేపీ ఎమ్మెల్యే

**ముంబై (ఏడీఎన్ఎన్) :**

ముంబైలోని ఘట్కోపర్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు, వ్యాపారుల ఆక్రమణలపై బీజేపీ ఎమ్మెల్యే పరాగ్ షా ఆదివారం స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. రోడ్డుపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.కానీ..ఈ కార్యక్రమం జరుగుతుండగానే మధ్యలోకి ఓ ఆటోడ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ తన ఆటోని తీసుకురాగా, బీజేపీ ఎమ్మెల్యే పరాగ్ షా వాగ్వాదానికి దిగాడు. తప్పుడుమార్గంలో వెళ్లిన ఆటోడ్రైవర్‌ను ఎమ్మెల్యే నిలదీశాడు.అంతటితో ఆగకుండా ఆగ్రహంతో అందరూ చూస్తుండగానే ఆటో డ్రైవర్ చెంపపై కొట్టాడు. ఆ ప్రాంతమంతా కొద్దిసేపు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వార్త నెట్టింట వైరల్ అయ్యింది. దీంతో బీజేపీ ఎమ్మెల్యే తీరును ప్రతిపక్ష నేతలు తప్పుపట్టారు. ఎమ్మెల్యే తీరుపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి.

# వీజీ జీ రామ్‌జీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**మొదటిపేజీ తరువాయి...**

మోడీ ప్రభుత్వం ఈ పథకం నుంచి గాంధీ పేరును తొలగించాలనే ఉద్దేశంతో కొత్త చట్టంతో వస్తోంది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (గ్రామిన్) బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం ప్రభుత్వం పంపింది. ఆదివారం ఆ బిల్లుపై ప్రెసిడెంట్ సంతకం చేశారు. ఈ కొత్త స్కీమ్‌లో పనిదినాలతో పాటు వేతనం పెంచింది. ఇంతకుముందు 100 రోజులున్న పని దినాలను 125కు, కనీస వేతనాన్ని రూ.240కి పెంచారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల్లోనూ కీలక మార్పులు చేశారు. ఇంతకుముందు హిమాలయ పర్వత ప్రాంత రాష్ట్రాల్లో ఈ వాటా 90:10గా, ఇతర రాష్ట్రాల్లో 75:25గా ఉండేది. ఇకనుంచి ఆ భారాన్ని కేంద్ర, రాష్ట్రాలు ఖర్చులను 60:40 శాతంలో భరించనున్నాయి.

# రాజకీయా సందిగ్ధతకు స్థానిక నేతలదే బాధ్యత

**మొదటిపేజీ తరువాయి...**

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి మార్పుపై జరుగుతున్న ప్రచారాన్ని ఆ ఖర్గే తోసిపుచ్చారు. ఈ విషయంలో అధిష్టానంపై వస్తున్న విమర్శలకు గట్టి సమాధానమిచ్చారు. నాయకత్వ మార్పు విషయంలో పార్టీ హైకమాండ్ ఎలాంటి గందరగోళం సృష్టించలేదని, సమస్య అంతా స్థానిక నాయకత్వంలోనే ఉందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల విజయంపై జరుగుతున్న క్రెడిట్ వార్‌ను కూడా ఖర్గే తప్పుబట్టారు. పార్టీ అధికారంలోకి రావడానికి ఏ ఒక్క వ్యక్తి కృషో కారణం కాదని, లక్షలాది మంది కార్యకర్తల సమష్టి కష్టం వల్లే ఇది సాధ్యమైందని గుర్తు చేశారు. "నాయకులు తామే గెలిపించామని వ్యక్తిగత గొప్పలు చెప్పుకోవడం మాని, పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన కార్యకర్తల కృషిని గుర్తించాలి" అని ఆయన కోరారు.ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా తానే కొనసాగుతానని సిద్ధరామయ్య అసెంబ్లీలో ధీమా వ్యక్తం చేసిన నేపథ్యంలో ఖర్గే వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదే సమయంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనపై స్పందిస్తూ, తనకు ఆ విషయంలో ఎలాంటి సమాచారం లేదని ఖర్గే దాటవేశారు. మొత్తానికి, కర్ణాటక కాంగ్రెస్‌లో సాగుతున్న 'అధికార పోరుకు అడ్డుకట్ట వేసేలా ఖర్గే చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# యువ భారతం గుండె చప్పుడుగా మారిన వందేళ్ళ యువ సంస్థ

**మొదటిపేజీ తరువాయి...**

యువతరం సంఘ్ వైపు ఆకర్షితులవ్వడానికి గల బలమైన కారణాలను, వారిలో ఉన్న కొన్ని అపోహలను సంఘ్ ఎలా తొలగిస్తోంది? 'ఐటీ మిలన్ల' (IT Milans) ద్వారా సంఘ్ టెక్నాలజీని ఎలా అందిపుచ్చుకుంది? అనే అంశాలను ఒక మినీథీసిస్ స్థాయిలో విశ్లేషించుకుందాం.

**ఆకర్షణకు కారణాలు - "నేనెవరిని?" (The Search for Identity)**

నేటి యువతకు ఇంటర్నెట్ ఉంది, డబ్బు ఉంది, స్వేచ్ఛ ఉంది. కానీ వారిలో ఒక తెలియని వెలితి ఉంది. అదే "అస్తిత్వ సంక్షోభం" (Identity Crisis). "నేను కేవలం ఒక గ్లోబల్ సిటిజన్‌నేనా? నాకు అంటూ ఒక గతం, ఒక మూలం (Roots) లేవా?" అనే ప్రశ్న వారిని వేధిస్తోంది. దీనికి సరైన సమాధానం వారికి సంఘ్‌లో దొరుకుతోంది.

**1. డీకాలనైజేషన్ (Decolonization of Mind):**

జె. సాయి దీపక్, విక్రమ్ సంపత్ వంటి యువ మేధావులు రాసిన పుస్తకాలు చదివి, నేటి యువత ఆలోచించడం మొదలుపెట్టింది. "మా చరిత్ర పుస్తకాల్లో అబద్ధాలు చెప్పారు. మా సంస్కృతిని తక్కువ చేశారు" అని వారు గ్రహించారు.

- **సంఘ్ వారికి** **"నిజమైన చరిత్ర"**ను చూపిస్తోంది. శివాజీ మహారాజ్, రాణా ప్రతాప్, అల్లూరి సీతారామరాజు వంటి వారి నిజమైన వీరత్వాన్ని పరిచయం చేస్తోంది.
- **"హిందూ ధర్మం** అంటే మూఢనమ్మకం కాదు, అది అత్యంత శాస్త్రీయమైన జీవన విధానం" అని సంఘ్ చెప్పే తర్కం (Logic) యువతకు నచ్చుతోంది.

**2. యాక్షన్ ఓరియెంటెడ్ (Action, Not Just Words):**

నేటి యువతకు ఉపన్యాసాలు నచ్చవు. వారికి "యాక్షన్" కావాలి.

- **వామపక్ష** విద్యార్థి సంఘాలు కేవలం నినాదాలు చేస్తాయి, ధర్నాలు చేస్తాయి.
- **కానీ సంఘ్** "సేవ" చేస్తుంది. వరదలు వస్తే బురదలోకి దిగుతుంది. కోవిడ్ వస్తే ఆసుపత్రులకు వెళ్తుంది.
- **"దేశం కోసం** ఏదో ఒకటి చేయాలి" అనే తపన ఉన్న యువకుడికి, సంఘ్ ఒక "ప్లాట్‌ఫామ్" (Platform) ను ఇస్తోంది. "రండి, కలిసి పనిచేద్దాం" అని పిలుస్తోంది. ఈ 'డూయింగ్' (Doing) ఆటిట్యూడ్ యువతను విపరీతంగా ఆకర్షిస్తోంది.

**3. క్రమశిక్షణ మరియు ఫిట్‌నెస్ (Fitness & Discipline):**

జిమ్ కల్చర్ పెరిగిన ఈ రోజుల్లో, సంఘ్ శాఖలో జరిగే "సూర్య నమస్కారాలు", "నియుద్ధ" (Martial Arts), "దండ యుద్ధ" (Stick Fighting) యువతకు ఫిట్‌నెస్ పరంగా కూడా ఆకర్షణీయంగా మారాయి.

- **తెల్లవారుజామున** లేవడం, సమయపాలన (Punctuality) పాటించడం తమ కెరీర్‌కు కూడా ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

ఐటీ మిలన్స్ (IT Milans) డిజిటల్ యుగంలో సంఘ్ కొత్త అవతారం

ఒక సామాన్యుడి ఊహల్లో "ఆర్ఎస్ఎస్ శాఖ" అంటే తెల్లవారుజామున, ఊరి బయట ఉన్న మైదానంలో, ఖాకీ నిక్కర్లు వేసుకున్న కొందరు వ్యక్తులు కర్రసాము చేయడం. కానీ, బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలోనో, హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలోనో, లేదా గురుగ్రామ్ సైబర్ హబ్‌లోనో ఆదివారం ఉదయం చూస్తే... ఆ ఊహ పూర్తిగా తలకిందులవుతుంది.

అక్కడ ఏసీ కాన్ఫరెన్స్ హాల్స్‌లో, లేదా అపార్ట్‌మెంట్ క్లబ్‌హౌస్‌లలో, జీన్స్, టీషర్టులు వేసుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు, స్టార్టప్ ఫౌండర్లు సమావేశమై ఉంటారు. వారు చర్చిస్తున్నది పాతకాలపు రాజకీయాలు కాదు.. వారు చర్చిస్తున్నది "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) లో నైతికత" గురించి, "భారతీయ డిజిటల్ ఎకానమీ" గురించి. ఇదే నేటి సంఘ్ కొత్త ముఖచిత్రం "ఐటీ మిలన్స్".

సంఘ్ ఒక శతాబ్దపు వృక్షం అయితే, 'ఐటీ మిలన్' అనేది దానికి పుట్టిన లేత, శక్తివంతమైన చిగురు. దీనిని నాలుగు కోణాల్లో లోతుగా విశ్లేషించవచ్చు:

**1. ఫార్మాట్ మార్పు - "ఫ్లెక్సిబిలిటీ" (The Pivot to Flexibility)**

సాంప్రదాయక సంఘ్ శాఖలు ప్రతిరోజూ (నిత్య శాఖ) జరుగుతాయి. కానీ ఐటీ ఉద్యోగుల జీవనశైలి వేరు. వారికి రాత్రి షిఫ్టులు ఉంటాయి, ప్రాజెక్ట్ డెడ్‌లైన్లు ఉంటాయి. రోజూ ఒకే సమయానికి రావడం వారికి అసాధ్యం.

- **సంఘ్ వ్యూహం:** "స్వయంసేవకుడు శాఖకు రాలేకపోతే, శాఖనే స్వయంసేవకుడి దగ్గరకు వెళ్లాలి" అని సంఘ్ నిర్ణయించుకుంది.
- **సప్తాహిక్ మిలన్ (Weekly Gathering):** వీరి కోసం ప్రత్యేకంగా "వారానికి ఒకసారి" (Sunday mornings mostly) శాఖలను డిజైన్ చేశారు.
- **స్థలం:** దుమ్ము ధూళి ఉండే మైదానాలు కాకుండా, వారికి సౌకర్యంగా ఉండే అపార్ట్‌మెంట్ బేస్‌మెంట్లు, కమ్యూనిటీ హాల్స్, కొన్నిసార్లు ఆఫీసుల దగ్గర్లోని పార్కులను ఎంచుకున్నారు. కోవిడ్ సమయంలో ఇవి "ఈ-శాఖలు" (Zoom calls) గా మారిపోయాయి. ఈ 'ఎజిలిటీ' (Agility) సంఘ్‌ను టెక్కీలకు దగ్గర చేసింది.

**2. బౌద్ధిక విందు - మేధో మథనం (Intellectual Churning)**

ఐటీ మిలన్లలో శారీరక వ్యాయామం కంటే "బౌద్ధిక" (Intellectual) కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఐటీ యువతకు తర్కం (Logic) కావాలి. వారు దేనినీ గుడ్డిగా నమ్మరు. అందుకే ఇక్కడ చర్చలు అత్యున్నత ప్రమాణాలతో ఉంటాయి.

- **టాపిక్ 1: టెక్నాలజీ మరియు ధర్మం (Tech & Dharma):**

"ఏఐ (AI) కి స్పృహ (Consciousness) ఉంటుందా? ఉంటే దాని నైతికత ఏమిటి?" అనే పాశ్చాత్య ప్రశ్నకు, మన "వేదాంతం" ఏం చెబుతుందో చర్చిస్తారు.

టెక్నాలజీని మానవ వినాశనానికి కాకుండా, సంక్షేమానికి ఎలా వాడాలో భారతీయ దర్శనం ద్వారా విశ్లేషిస్తారు.

- **టాపిక్ 2: డిజిటల్ కోలనైజేషన్ (Digital Colonization):**

"ఈస్ట్ ఇండియా కంపెనీ ఎలాగైతే వ్యాపారం పేరుతో వచ్చి దేశాన్ని ఆక్రమించిందో, గూగుల్, ఫేస్‌బుక్ వంటి బిగ్ టెక్ (Big Tech) కంపెనీలు మన డేటాను (Data) దొంగిలించి 'డిజిటల్ బానిసలు'గా మారుస్తున్నాయి" అనే అవగాహన కల్పిస్తారు. దీనికి పరిష్కారంగా "డేటా సార్వభౌమత్వం" (Data Sovereignty) గురించి చర్చిస్తారు.

- **టాపిక్ 3: స్టార్టప్ ఎకోసిస్టమ్:**

ఒక స్వయంసేవకుడు కేవలం ఉద్యోగిగా ఉండిపోకూడదు. అతను పారిశ్రామికవేత్తగా (Job Creator) ఎదగాలి. స్టార్టప్స్ ఎలా పెట్టాలి? స్వదేశీ పెట్టుబడులు ఎలా తేవాలి? అనే విషయాలపై సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ (Senior Executives) జూనియర్లకు మార్గనిర్దేశం చేస్తారు.

**3. సామాజిక బాధ్యత - "వీకెండ్ వారియర్స్" (Weekend Warriors)**

ఐటీ ఉద్యోగులకు డబ్బు ఉంటుంది, కానీ సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్నా, సమయం ఉండదు. ఐటీ మిలన్స్ వారికి ఒక వేదికను (Platform) ఇస్తాయి.

- **విద్యా దానం:** వారాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి, పేద పిల్లలకు కోడింగ్ (Coding), ఇంగ్లీష్, గణితం నేర్పిస్తారు.
- **డిజిటలైజేషన్:** తాళపత్ర గ్రంథాలను డిజిటలైజ్ చేయడం, భారతీయ చరిత్రను వికీపీడియాలో సరిగ్గా రాయడం (Fact Checking) వంటి పనులు చేస్తారు.
- **హ్యాకథాన్స్ (Hackathons):** సామాజిక సమస్యలకు (ఉదా: ట్రాఫిక్, చెత్త నిర్వహణ) టెక్నాలజీ ద్వారా పరిష్కారాలు కనుగొనడానికి సంఘ్ హ్యాకథాన్లను నిర్వహిస్తుంది.

**4. గ్లోబల్ కనెక్ట్ - సిలికాన్ వ్యాలీ నుంచి బెంగళూరు వరకు**

విశేషమేమిటంటే, ఈ ఐటీ మిలన్స్ కేవలం భారత్‌లోనే లేవు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీ (Silicon Valley) లోని గూగుల్, మైక్రోసాఫ్ట్, టెస్లా వంటి కంపెనీల్లో పనిచేసే వేలాది మంది భారతీయులు అక్కడ "హిందూ స్వయంసేవక్ సంఘ్" (HSS) పేరుతో ఇవే మిలన్లను నిర్వహిస్తున్నారు.

- **అక్కడ** వారు భారతీయ పండుగలను జరుపుకుంటారు, భారతీయ సంస్కృతిని తమ పిల్లలకు నేర్పిస్తారు.
- **సత్య నాదెళ్ల,** సుందర్ పిచాయ్ వంటి వారు భారతీయ విలువలతో ఎదగడం వెనుక ఉన్న పర్యావరణం (Ecosystem) ఇదే.

**ఐటీ మిలన్స్ ద్వారా సంఘ్ ఒక బలమైన సందేశాన్ని పంపింది:**

"మేము కాలంతో పాటు పరిగెడతాం. మా చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటుంది, కానీ మా హృదయంలో సనాతన ధర్మం ఉంటుంది."

ఈ మిలన్స్, ఆధునిక సాంకేతికతకు మరియు ప్రాచీన విజ్ఞానానికి మధ్య ఒక "వారధి" (Bridge) లా మారాయి. అందుకే దేశంలోని అత్యుత్తమ మేధావులు (The Brains of India) నేడు సంఘ్ వైపు ఆకర్షితులవుతున్నారు.

**మేధో పోరాటం - క్యాంపస్‌లో మార్పు (The Intellectual Warrior)**

రెండు దశాబ్దాల క్రితం వరకు భారతీయ ప్రీమియర్ యూనివర్సిటీలైన ఢిల్లీలోని జేఎన్‌యూ (JNU), హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (HCU), కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీలలో వాతావరణం ఎలా ఉండేదో అందరికీ తెలుసు. అక్కడ "జాతీయవాదం" గురించి మాట్లాడటం ఒక నేరం. నుదిటిన తిలకం పెట్టుకుంటే "మతతత్వవాది" అని, వందేమాతరం అంటే "ముస్లిం వ్యతిరేకి" అని, సావర్కర్ పేరు ఎత్తితే "దేశద్రోహి" అని ముద్ర వేసేవారు. ఈ క్యాంపస్‌లు వామపక్ష మేధావుల (Leftist Intellectuals) గుత్తాధిపత్యంలో ఉండే "ఎకో ఛాంబర్స్" (Echo Chambers).

కానీ, నేడు ఆ దృశ్యం పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు అదే క్యాంపస్‌లలో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. స్వామి వివేకానందుడి విగ్రహాలు ఆవిష్కృతం అవుతున్నాయి. "భారత్ మాతా కీ జై" నినాదాలు మార్మోగుతున్నాయి. ఈ మార్పు రాత్రికి రాత్రి జరిగింది కాదు. ఇది సంఘ్ ప్రేరణతో యువత చేసిన ఒక సుదీర్ఘ "మేధో పోరాటం" (Intellectual Battle) ఫలితం.

**ఈ పరిణామాన్ని నాలుగు దశలుగా విశ్లేషించవచ్చు:**

**1. భయం వదిలిన యువత (Breaking the Fear Psychosis)**

ఒకప్పుడు క్యాంపస్‌లలో వామపక్ష విద్యార్థి సంఘాల (SFI/AISA) హింస మరియు బౌద్ధిక దాడి (Intellectual Bullying) ఎంత ఎక్కువగా ఉండేదంటే, జాతీయవాద భావాలు ఉన్న విద్యార్థులు మౌనంగా ఉండిపోయేవారు.

- **సంఘ్ వ్యూహం:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) ద్వారా సంఘ్ విద్యార్థులకు "ధైర్యాన్ని" నూరిపోసింది. "మనం నమ్మేది సత్యం. దేశం కోసం నిలబడటం తప్పు కాదు" అనే ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది.
- **ఫలితం:** ఎప్పుడైతే ఒక సమూహం ధైర్యంగా ముందుకొచ్చిందో (ఉదాహరణకు 2016 జేఎన్‌యూలో "తుక్డే తుక్డే" నినాదాలకు వ్యతిరేకంగా), అప్పటి వరకు మౌనంగా ఉన్న మెజారిటీ విద్యార్థులు (Silent Majority) కూడా గొంతు విప్పారు.

**2. తర్కంతో దాడి (Logic over Rhetoric)**

గతంలో ఏబీవీపీ అంటే కేవలం ధర్నాలు చేసే సంస్థ అనే పేరు ఉండేది. కానీ ఇప్పుడు వారు "స్టడీ సర్కిల్స్", "డిబేటింగ్ క్లబ్స్" ద్వారా బౌద్ధికంగా బలపడ్డారు.

- **ఆర్టికల్ 370:** వామపక్షాలు "కాశ్మీరీల హక్కులు పోతున్నాయి" అని అరిస్తే, సంఘ్ విద్యార్థులు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మాటలను, శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగాన్ని, మరియు కాశ్మీరీ దళితుల, మహిళల దయనీయ స్థితిని గణాంకాలతో (Data) సహా వివరించారు.
- **సిఏఏ (CAA):** "ముస్లింల పౌరసత్వం పోతుంది" అని ప్రచారం జరిగినప్పుడు, "ఇది బాధితులకు పౌరసత్వం ఇచ్చే చట్టమే కానీ, ఎవరిదీ తీసేసే చట్టం కాదు" అని చట్టంలోని సెక్షన్లను చూపిస్తూ డిబేట్ చేశారు. ఈ తార్కిక వాదనల ముందు వామపక్షాల ఆవేశం నిలబడలేకపోయింది.

**3. థింక్ ఇండియా (Think India) - పాలసీ మేకర్స్**

సంఘ్ ఆధ్వర్యంలోని "థింక్ ఇండియా" (Think India) అనే ఫోరమ్, ఐఐటీలు (IITs), ఐఐఎంలు (IIMs), నేషనల్ లా స్కూల్స్ (NLUs) వంటి ప్రీమియర్ సంస్థల్లో ఒక విప్లవాన్ని తెచ్చింది.

- **ఇక్కడ** విద్యార్థులు కేవలం రాజకీయాలు మాట్లాడరు. వారు పబ్లిక్ పాలసీ (Public Policy), విదేశాంగ విధానం, ఆర్థిక సంస్కరణలపై చర్చిస్తారు.
- **వీరు** "ఇంటర్న్‌షిప్స్" ద్వారా మంత్రుల వద్ద, ఎంపీల వద్ద పనిచేస్తూ, దేశ నిర్మాణంలో (Nation Building) ప్రత్యక్షంగా పాలుపంచుకుంటున్నారు. "రాజకీయాలంటే గొడవలు కాదు, అది పాలన (Governance)" అనే కొత్త నిర్వచనాన్ని వీరు ఇస్తున్నారు.

**4. సాంస్కృతిక పునరుజ్జీవనం (Cultural Renaissance)**

క్యాంపస్‌లలో ఇప్పుడు లిటరేచర్ ఫెస్టివల్స్ (Lit Fests) జరుగుతున్నాయి. కానీ అందులో పాశ్చాత్య రచయితలే కాదు, విక్రమ్ సంపత్, జె. సాయి దీపక్, సంజీవ్ సన్యాల్ వంటి "ఇండిక్ వింగ్" (Indic Wing) రచయితలు వస్తున్నారు.



**రెండు దశాబ్దాల క్రితం వరకు భారతీయ ప్రీమియర్ యూనివర్సిటీలైన ఢిల్లీలోని జేఎన్‌యూ (JNU), హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (HCU), కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీలలో వాతావరణం ఎలా ఉండేదో అందరికీ తెలుసు. అక్కడ "జాతీయవాదం" గురించి మాట్లాడటం ఒక నేరం. నుదిటిన తిలకం పెట్టుకుంటే "మతతత్వవాది" అని, వందేమాతరం అంటే "ముస్లిం వ్యతిరేకి" అని, సావర్కర్ పేరు ఎత్తితే "దేశద్రోహి" అని ముద్ర వేసేవారు.**

- **డీకాలనైజేషన్:** "వలసవాద భావజాలం నుంచి విముక్తి పొందాలి" అనే అంశంపై క్యాంపస్‌లలో లోతైన చర్చలు జరుగుతున్నాయి.
- **విద్యార్థులు** తమ సొంత సంస్కృతిని, పండుగలను (ఉగాది, హోలీ, రక్షా బంధన్) క్యాంపస్‌లలో జరుపుకోవడానికి ఇప్పుడు సిగ్గుపడటం లేదు, గర్వపడుతున్నారు.

ఈ "ఇంటెలెక్చువల్ వారియర్స్" (మేధో యోధులు) సాధించిన అతిపెద్ద విజయం ఏమిటంటే "ఓవర్‌టన్ విండో" (Overton Window) ను మార్చడం.

ఒకప్పుడు క్యాంపస్‌లో "నేను హిందువును" అని చెప్పడం వెనుకబాటుతనంగా చూసేవారు.

నేడు "నేను సనాతన ధర్మాన్ని అనుసరిస్తాను, జాతీయవాదిని" అని చెప్పడం ఒక "కూల్" (Cool) మరియు "రెబల్" (Rebel) విషయంగా మారింది.

ఎందుకంటే, దశాబ్దాలుగా క్యాంపస్‌లను ఏలిన వామపక్ష భావజాలమే ఇప్పుడు "ఎస్టాబ్లిష్‌మెంట్" (Establishment) అయ్యింది. దానిని ప్రశ్నించే సంఘ్ భావజాలం ఇప్పుడు యువతకు "కొత్త విప్లవం"గా కనిపిస్తోంది. ఇదే సంఘ్ సాధించిన అసలైన విజయం.

అపోహలు వాస్తవాలు (Breaking the Stereotypes)

యువతలో సంఘ్ పట్ల కొన్ని అపోహలు ఉన్నాయి. సంఘ్ వాటిని తన చర్యల ద్వారా ఎలా చెరిపేసుకుంటోంది?

**అపోహ 1:** "సంఘ్ పాతకాలపు సంస్థ, మోడ్రన్ కాదు."

**వాస్తవం:** 2016లో సంఘ్ తన యూనిఫామ్ (Ganavesh) మార్చింది. పాత ఖాకీ నిక్కరు స్థానంలో మోడ్రన్ బ్రౌన్ ట్రౌజర్స్ (Brown Pants) వచ్చాయి.

- **ఇది చిన్న** మార్పే కావచ్చు, కానీ "మేము మారుతున్న కాలానికి అనుగుణంగా మారుతాము" అనే సంకేతాన్ని యువతకు ఇచ్చింది. ఇప్పుడు యువకులు ఆ యూనిఫామ్ వేసుకోవడానికి సిగ్గుపడటం లేదు, గర్వపడుతున్నారు.

అపోహ 2: "సంఘ్ మహిళలకు వ్యతిరేకం (AntiWomen)."

వాస్తవం: సంఘ్ కేవలం పురుషులకే కాదు. మహిళల కోసం "రాష్ట్ర సేవికా సమితి" (Rashtra Sevika Samiti) అనే అతిపెద్ద మహిళా సంస్థ ఉంది.

- **అంతేకాకుండా,** నేడు సంఘ్ కుటుంబ శాఖలను (Family Shakhas) ప్రోత్సహిస్తోంది.
- **ఇస్రోలో** పనిచేసే మహిళా శాస్త్రవేత్తలు, కార్పొరేట్ సీఈఓలు కూడా సంఘ్ భావజాలాన్ని సమర్థిస్తున్నారు. స్త్రీని "మాతృశక్తి"గా గౌరవించే సంస్థ సంఘ్ అని యువతులు గుర్తిస్తున్నారు.

**అపోహ 3:** "ఇక్కడ వ్యక్తిగత స్వేచ్ఛ ఉండదు, అంతా ఆర్డర్లే."

**వాస్తవం:** సంఘ్ లో అత్యంత ప్రజాస్వామ్య వాతావరణం ఉంటుంది.

- **ఒక సామాన్య** స్వయంసేవకుడు కూడా సర్ సంఘ్‌చాలక్‌ను (Chief) ప్రశ్న అడగవచ్చు.
- **శాఖలో** జరిగే "చర్చ" (Baithak) లో ఎవరైనా తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా చెప్పవచ్చు. బయట కనిపించే క్రమశిక్షణ వేరు, లోపల ఉండే స్వేచ్ఛ వేరు. ఈ "అంతర్గత ప్రజాస్వామ్యం" (Internal Democracy) చూసి యువత ఆశ్చర్యపోతోంది.

**యూత్ ఫర్ సేవా (Youth for Seva) - కార్పొరేట్ కారిడార్లలో సేవా సుగంధం**

భారతదేశంలోని మెట్రో నగరాల్లో (బెంగళూరు, హైదరాబాద్, పూణే, చెన్నై) నివసించే యువతది ఒక విచిత్రమైన పరిస్థితి. వారి చేతిలో మంచి జీతం (High Salary) ఉంటుంది, వారాంతాల్లో పార్టీలు చేసుకోవడానికి డబ్బు ఉంటుంది. కానీ, రాత్రి పడుకునే ముందు వారిలో చాలామందికి ఒక తెలియని వెలితి (Void) అనిపిస్తుంది. "నేను కేవలం నా కోసమే బతుకుతున్నానా? ఈ సమాజానికి నేనేమి తిరిగి ఇస్తున్నాను?" అనే ప్రశ్న వారిని వెంటాడుతుంది.

సరిగ్గా ఈ "తపన" (Yearning) మరియు "అవకాశం" (Opportunity) మధ్య ఉన్న అంతరాన్ని పూరించడానికి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) ప్రేరణతో పుట్టిన అద్భుతమైన వేదికే "యూత్ ఫర్ సేవా" (YFS). 2007లో బెంగళూరులో ప్రారంభమైన ఈ సంస్థ, నేడు వేలాది మంది టెక్కీలను, డాక్టర్లను, కాలేజీ విద్యార్థులను "సేవా యోధులు"గా మార్చింది.

దీనిని కేవలం ఒక NGOగా కాకుండా, ఒక "సామాజిక ఉద్యమం"గా ఎందుకు చూడాలో నాలుగు కోణాల్లో విశ్లేషించవచ్చు:

**1. సమయ దానం - డబ్బు కంటే విలువైనది (Time over Money)**

సాధారణంగా స్వచ్ఛంద సంస్థలు "విరాళాలు" (Donations) అడుగుతాయి. కానీ YFS వినూత్నంగా ఆలోచించింది.

- **కాన్సెప్ట్:** "మాకు మీ డబ్బు వద్దు, మీ సమయం కావాలి."
- **ఒక** ఐటీ ఉద్యోగి వారానికి 40 గంటలు కోడింగ్ రాస్తే, కేవలం 2 గంటలు పేద పిల్లల కోసం ఇవ్వలేడా? అనే ప్రశ్నతో ఇది మొదలైంది.
- **వారాంతపు వాలంటీర్లు (Weekend Volunteers):** సోమవారం నుంచి శుక్రవారం వరకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేసేవారు, శని, ఆదివారాల్లో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తారు. అక్కడ వారు కేవలం టీచర్లు కాదు, పిల్లలకు రోల్ మోడల్స్ (Role Models). ఆ పిల్లలకు ఇంగ్లీష్ నేర్పిస్తారు, కంప్యూటర్లు ఆపరేట్ చేయడం నేర్పిస్తారు.
- **ఈ ప్రక్రియలో,** ఆ పిల్లల భవిష్యత్తు మారడమే కాదు, ఆ వాలంటీర్లకు ఒక "జీవిత పరమార్థం" (Purpose of Life) దొరుకుతుంది.

**2. స్క్రైబ్స్ - నేత్రం లేని వారికి చూపుగా (Scribing for the Blind)**

YFS చేపట్టిన అత్యంత హృదయపూర్వకమైన కార్యక్రమం స్క్రైబ్స్ (Scribes).

- **దృష్టిలోపం** ఉన్న విద్యార్థులు (Visually Challenged) పరీక్షలు రాయడానికి ఎవరైనా సహాయకుడు కావాలి. గతంలో దీనికోసం వారు ఎంతో ఇబ్బంది పడేవారు.
- **YFS పరిష్కారం:** యువతను స్క్రైబ్స్‌గా రిజిస్టర్ చేసింది. పరీక్ష రోజున, ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీరో, ఎంబీఏ విద్యార్థో వెళ్లి, ఆ అంధ విద్యార్థి పక్కన కూర్చుని, అతను చెప్పింది విని పరీక్ష రాస్తారు.
- **భావోద్వేగ బంధం:** మూడు గంటల పాటు ఆ విద్యార్థికి కళ్లుగా మారడం అనేది ఆ వాలంటీర్ జీవితాన్ని మార్చేస్తుంది. "నాకున్న కళ్లు ఎంత విలువైనవో" అతనికి అర్థమవుతుంది. ఆ అంధ విద్యార్థి పాస్ అయినప్పుడు వచ్చే ఆనందం, ఏ ప్రమోషన్ వచ్చినా రాదు.

**3. డాక్టర్స్ ఎట్ స్కూల్ & గ్రీన్ వారియర్స్**

సేవను YFS చాలా ప్రొఫెషనల్ గా డిజైన్ చేసింది.

- **వైద్య సేవ:** యువ డాక్టర్లు సెలవు రోజుల్లో మురికివాడల్లోని పాఠశాలలకు వెళ్లి పిల్లలకు హెల్త్ చెకప్ (Health Checkup) చేస్తారు. కంటి చూపు సరిగ్గా లేని పిల్లలను గుర్తించి, ఉచితంగా కళ్లద్దాలు ఇప్పిస్తారు.
- **పర్యావరణం:** "ఒక టెక్కీ ఒక మొక్క" వంటి కార్యక్రమాల ద్వారా నగరాల్లో పచ్చదనాన్ని పెంచుతున్నారు. చెరువులను శుభ్రం చేస్తున్నారు.

**4. చిత్తశుద్ధి - వ్యక్తిత్వ వికాసం (Self-Transformation through Service)**

సంఘ్ సిద్ధాంతం ప్రకారం, సేవ అనేది ఎదుటివారికి చేసే ఉపకారం కాదు, అది మనల్ని మనం సంస్కరించుకునే మార్గం ("ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయ చ").

- **ఒక కార్పొరేట్** ఆఫీసులో ఏసీ గదిలో కూర్చుని, "ట్రాఫిక్ బాగోలేదు, రోడ్లు బాగోలేవు" అని విమర్శించే యువకుడు, YFSలో చేరిన తర్వాత విమర్శించడం మానేస్తాడు.
- **అతను సమస్యలో** భాగం కాకుండా, పరిష్కారంలో భాగం (Part of Solution) అవుతాడు.
- **ఈ "పాజిటివ్ మైండ్‌సెట్"** వారి వృత్తిగత జీవితంలో కూడా వారికి ఉపయోగపడుతుంది. వారిలో నాయకత్వ లక్షణాలు (Leadership Skills), తాదాత్మ్యం (Empathy) పెరుగుతాయి.

"యూత్ ఫర్ సేవా" అనేది యువతకు ఒక "రియాలిటీ చెక్". ఇది వారిని వారి 'వర్చువల్ ప్రపంచం' (Virtual World) నుంచి బయటకు తెచ్చి, 'వాస్తవ ప్రపంచం' (Real World) లోని కష్టసుఖాలను పరిచయం చేస్తోంది.

సంఘ్ అంటే కేవలం శాఖలు, కవాతులు కాదని... "నిస్వార్థ సేవే నిజమైన సంఘ్ పని" అని ఈ యువత నిరూపిస్తోంది. అందుకే, నేటి యువతరం దృష్టిలో సంఘ్ ఒక "కూల్" (Cool) మరియు "బాధ్యతాయుతమైన" సంస్థగా మారింది.

కెరీర్ మరియు నెట్‌వర్కింగ్ (Professional Growth) ఇది కొంచెం ప్రాక్టికల్ విషయం. సంఘ్ అనేది ఒక భారీ నెట్‌వర్క్.

- **ఒక** యువకుడు సంఘ్‌లో చేరితే, అతనికి దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మందితో ఒక "అదృశ్య బంధం" ఏర్పడుతుంది.
- **మెంటార్‌షిప్:** సీనియర్ స్వయంసేవకులు (ఐఏఎస్ ఆఫీసర్లు, పారిశ్రామికవేత్తలు) జూనియర్లకు గైడెన్స్ ఇస్తారు. సివిల్స్ కోచింగ్ సెంటర్లు (సంకల్ప్) నడుపుతారు.
- **సంఘ్‌లో** నేర్చుకునే నాయకత్వ లక్షణాలు (Leadership Qualities), టీమ్ వర్క్ (Team Work), కమ్యూనికేషన్ స్కిల్స్ (Communication Skills) వారి కార్పొరేట్ కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

భవిష్యత్తు వారిదే...

యువతరం దృష్టిలో ఇప్పుడు సంఘ్ ఒక "రాజకీయ సంస్థ" కాదు. అదొక "లైఫ్ స్టైల్" (Lifestyle).

- **ఉదయం** యోగా చేయడం, ఖాదీ బట్టలు వేసుకోవడం, సేంద్రీయ ఆహారం తినడం, దేశం కోసం ఆలోచించడం... ఇదంతా ఇప్పుడు ఒక "ట్రెండ్". ఈ ట్రెండ్‌కు మూలకేంద్రం సంఘ్.

పాశ్చాత్య దేశాల్లో చర్చిలు ఖాళీ అవుతున్నాయి, యువత దేవుడికి దూరమవుతోంది. కానీ భారతదేశంలో యువత దేవాలయాలకు వెళ్తోంది, ధర్మాన్ని ఆచరిస్తోంది, సంఘ్ శాఖలకు వెళ్తోంది. ఎందుకంటే, వారికి అక్కడ తమ ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతున్నాయి.


వందేళ్ళ సంఘ్, ఇప్పుడు కొత్త రక్తాన్ని (Young Blood) ఎక్కించుకుని, రెట్టించిన ఉత్సాహంతో 2047 (వికసిత భారత్) వైపు పరుగెడుతోంది. ఈ పరుగులో పతాకధారులు (Torchbearers) ఈ నవతరమే. వారు సంఘ్‌ను కేవలం కాపాడటం లేదు, దానిని "రీడిఫైన్" (Redefine) చేస్తున్నారు. జై యువ భారత్!

**వందేళ్ళ సంఘ్, ఇప్పుడు కొత్త రక్తాన్ని (Young Blood) ఎక్కించుకుని, రెట్టించిన ఉత్సాహంతో 2047 (వికసిత భారత్) వైపు పరుగెడుతోంది. ఈ పరుగులో పతాకధారులు (Torchbearers) ఈ నవతరమే. వారు సంఘ్‌ను కేవలం కాపాడటం లేదు, దానిని "రీ-డిఫైన్" (Redefine) చేస్తున్నారు. జై యువ భారత్!**

రచన: భూక్యా గోపినాయక్

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar






## భారత్, పాక్‌లకు ఉమ్మడి పాస్‌పోర్ట్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్, పాకిస్థాన్ మధ్య ఇప్పుడున్న పరిస్థితుల్లో ఉమ్మడిగా పాస్‌పోర్ట్ ఊహించలేం. ఇలాంటి తరుణంలో భారత్, పాక్ ఉమ్మడి పాస్‌పోర్ట్ అనేది ఈ రోజుల్లో అసాధ్యం అనిపించవచ్చు. కానీ అది ఒకప్పుడు నిజంగానే ఇరు దేశాల మధ్య ఉమ్మడి పాస్‌పోర్ట్ ఉండేది. దేశ విభజన తర్వాత చాలామందికి పాస్‌పోర్ట్ లు లేకపోయినా కుటుంబసభ్యులను కలవడానికి సరిహద్దు దాటాల్సి వచ్చేది. ఈ ప్రయాణాన్ని సులభతరం చేయడానికి, రెండు దేశాల మధ్య రాకపోకలకు వీలు కల్పించే ఉమ్మడి ఇండియా, పాకిస్థాన్ పాస్‌పోర్ట్‌ను జారీ చేసేవారు. ఈ పాస్‌పోర్ట్ లు 1960ల చివరివరకు వాడుకలో ఉండేవి.తాజాగా ప్రముఖ చరిత్రకారిణి డాక్టర్ నూర్ జైదీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ వైరల్ అవుతోంది. భారత్ పాక్ ఉమ్మడి పాస్‌పోర్ట్ గురించి ఆమె తన పోస్ట్ లో వివరించారు. ఇండియా, పాకిస్థాన్ ఉమ్మడి పాస్‌పోర్టా? ఈ రోజుల్లో యుద్ధాలు, దాడులు, రాఫెల్స్, సింధూర్ వంటి వార్తల మధ్య ఇది అసాధ్యం అనిపిస్తుంది. కానీ ఇది నిజంగా ఉండేదని ఆమె పేర్కొన్నారు. దేశ విభజన తర్వాత చాలా మందికి పాస్‌పోర్ట్ లు లేవని, కానీ ఇరువైపులా కుటుంబాలు ఉన్నవారికి ప్రయాణాన్ని సులభతరం చేయడానికి ఈ ఉమ్మడి పాస్‌పోర్ట్ ను ఇచ్చేవారని ఆమె తెలిపారు. ఈ ఉమ్మడి ఇండియా, పాకిస్థాన్ పాస్‌పోర్ట్ ఎరుపు రంగు కవర్‌తో ఉండేది. అమృత్‌సర్‌కు చెందిన 'ది పార్టిషన్ మ్యూజియం'ఒక అరుదైన పాస్‌పోర్ట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకుంది. దీనిని 1968 అక్టోబర్ 28న పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చెందిన సర్దార్ షంషేర్ సింగ్ అనే వ్యక్తికి జారీ చేశారు.1968 అక్టోబర్ 28న అమృత్‌సర్‌లో జారీ చేసిన ఈ భారత్, పాకిస్థాన్ పాస్‌పోర్ట్ సర్దార్ షంషేర్ సింగ్‌కు చెందింది. 1888 నవంబర్ 14న ప్రస్తుతం పాకిస్థాన్‌లోని నన్‌కానా సాహిబ్ జిల్లాలో ఉంది. ఖిలా ధరంసింగ్‌లో జన్మించిన ఆయన, దేశ విభజన తర్వాత పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా, ముక్త్‌సర్‌లో నివసిస్తున్న ఒక రైతు. పాక్‌లోని షేఖుపురాలో మొహబత్‌వాలా గ్రామంలో భాగమైన ఒక భూమి ఆయనకు సంక్రమించింది. ఆ ఎస్టేట్ నన్‌కానా సాహిబ్‌కు చాలా దగ్గరగా ఉండేది.ఆయన దానిని కోట్ షంషేర్ సింగ్ అనే కొత్త గ్రామంగా మార్చారు. 1968 నవంబర్ 1 నుంచి 1968 నవంబర్ 7 వరకు పాక్‌లోని వివిధ మతపరమైన ప్రదేశాలను సందర్శించడానికి వీలుగా ఈ పాస్‌పోర్ట్ జారీ చేయబడిందని తెలిపింది. 1952 అక్టోబర్‌లో ఇండియా, పాకిస్తాన్ పాస్‌పోర్ట్, వీసా పథకం కింద ఈ ప్రత్యేక పాస్‌పోర్ట్ ను జారీ చేసేవారు. ఇది రెండు దేశాల మధ్య ప్రయాణాన్ని నియంత్రించేది. రెండోది మిగతా దేశాలకు వెళ్లడానికి ప్రతి దేశం సాధారణ పాస్‌పోర్ట్ గా ఉపయోగపడేది.. దేశ విభజన తర్వాత వచ్చిన శరణార్థుల ప్రవాహాన్ని నియంత్రించడానికి 1948లో నాటి ప్రభుత్వం భారతీయ పాస్‌పోర్ట్ ను రూపొందించింది.. భారత్ తన పశ్చిమ సరిహద్దులో పాకిస్థాన్‌తో ఒక కొత్త పర్మిట్ వ్యవస్థను కూడా రూపొందించి అమలు చేసింది. దీనిని తర్వాత 1948 అక్టోబర్‌లో పాక్‌కు స్వీకరించింది. చివరికి ఇండియా, పాకిస్థాన్, వీసా పథకాన్ని 1967లో ఒక అంతర్జాతీయ పాస్‌పోర్ట్ గా విలీనం చేశారని ఫేస్‌బుక్‌లో వివరించింది.



## టీచర్ల కన్నీటి గాథ, చిన్నారుల్లో మానసిక వేదన

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికాలో ప్రీస్కూల్ టీచర్లు వారం క్రితం వరకు రోజులాగే చిన్నారుల ఆటపాటలతోనే సమయం గడిచేది. కానీ అక్టోబర్‌లో వారి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. వారికి ఉన్న వర్క్ పర్మిట్ రెన్యువల్ దరఖాస్తును అమెరికా అధికారులు తిరస్కరించారు. దీంతో ప్రీస్కూల్ టీచర్లుగా తమ ఉద్యోగాన్ని తక్షణమే వదులుకోవాల్సి వచ్చింది.తమ విద్యార్థులకు వీడ్కోలు చెప్పిన క్షణాలను గుర్తుచేసుకుంటూ వారంతా సర్వస్వం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వెళ్ళిపోతున్నామని చెప్పినప్పుడు, ఎందుకని అడిగిన పిల్లలకు సమాధానం చెప్పలేకపోయామనీ వాపోయారు. పిల్లలు తమను కౌగిలించుకున్నప్పుడు తమ గుండెలు బరువెక్కినట్లు బాధపడ్డారు. అమెరికాలో మొత్తం టీచర్లలో దాదాపు 10 శాతం మంది వలసదారులే ఉన్నారు. దేశవ్యాప్తంగా టీచర్ల కొరత కారణంగా, బైడెన్ ప్రభుత్వం విదేశాల నుంచి నిపుణులను ఆహ్వానించింది. 6,716 మంది టీచర్లను తాత్కాలిక వీసాలపై అమెరికాకు రప్పించారు. అయితే ట్రంప్ ప్రభుత్వం వలసదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తుండటంతో, ఇప్పటికే చట్టబద్ధంగా పనిచేస్తున్న వారి ఉద్యోగం ప్రమాదంలో పడింది. వాషింగ్టన్‌లోని కమ్యూనికిడ్స్ లాంగ్వేజ్ స్కూల్ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. ఈ స్కూల్‌లోని 90 శాతం సిబ్బంది వలస నేపథ్యం ఉన్నవారే. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల తమ సిబ్బంది తీవ్రంగా నష్టపోయారని యాజమాన్యం తెలిపింది. ఈ పరిణామాలు కేవలం టీచర్ల జీవితాలనే కాకుండా, చిన్నారుల మానసిక ఆరోగ్యంపై, చదువుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విద్యార్థులకు వారి టీచర్లతో బలమైన అనుబంధం ఉంటుంది. ఉన్నట్టుండి టీచర్లు దూరమవడం వారిని మానసికంగా కుంగదీస్తోందనీ అంటున్నారు. విద్యా సంవత్సరం మధ్యలోనే టీచర్లు మారిపోతే పిల్లల భాషా నైపుణ్యాల అభివృద్ధి దెబ్బతింటుందని ఒక అధ్యయనం తేల్చింది. దీంతో స్కూళ్ళల్లో ప్రత్యామ్నాయ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

## హాదీ ఖననం .. ప్రభుత్వానికి అల్టిమేటం

**బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు**
**ఇంక్విలాబ్ మంచ్ అల్టిమేటం**
**ముగిసిన హదీ అంత్యక్రియలు**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



బంగ్లాదేశ్‌లో ఇంక్విలాబ్ ఉద్యమ నేత , షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్య తర్వాత దేశంలో పరిస్థితులు ఉద్రిక్తతగా మారాయి. శుక్రవారం సింగపూర్ నుంచి ఢాకా తీసుకురావడంతో, శనివారం అతని అంత్యక్రియలు ఢాకా విశ్వవిద్యాలయం సమీపంలోని జాతీయ కవి కాజీ నజ్రుల్ ఇస్లామ్ సమాధి వద్ద నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు ముహమ్మద్ యూనస్ వివిధ రాజకీయ పార్టీల నేతలు, హాదీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హాదీ హత్యపై విచారణ, భారత్ , బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలను తెచ్చిపెట్టింది. హాదీని కాల్చిన హంతకులు భారత దేశానికి పారిపోయారని వ్యాపించిన పుకార్లు, రెండు దేశాల మధ్య మరింత అనైక్యతను పెంచాయి. హాదీ మరణం తర్వాత, ఇంక్విలాబ్ మంచ్ సంస్థ బంగ్లాదేశ్ ప్రభుత్వానికి 24 గంటల ఆంక్షతో అల్టిమేటం జారీ చేసింది. ఈ సంస్థ, హాదీ హంతకులను త్వరగా పట్టుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ప్రభుత్వానికి చేపట్టే చర్యలు, సుముఖంగా ఉండాలనేది వారు ఉద్ఘాటించారు. ఇంక్విలాబ్ మంచ్ నేతృత్వంలో, హాదీ హంతకులను వెంటనే పట్టుకోవాలని 24 గంటల క్రితం ప్రభుత్వానికి హక్కు ఇవ్వడం జరిగింది. ఒకే రోజు, ఇంక్విలాబ్ ప్రతినిధి అబ్దుల్లా అల్ జబర్ ప్రజల ముందుకు వచ్చి, "హంతకులను పట్టుకోవడానికి, ప్రభుత్వం ఇప్పటివరకు ఏమి చర్యలు తీసుకుంది? అని మేము అడిగాము. 24 గంటలలో హంతకులను పట్టుకోకపోతే, హోం అఫైర్స్ అడ్వైజర్ ముహమ్మద్ జహంగీర్ ఆలమ్ చౌధరీ, చీఫ్ అడ్వైజర్ స్పెషల్ అసిస్టెంట్ ఖుదా బక్ష్ చౌధరీ రాజీనామా చేయాలి," అని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో చెలరేగిన హింస, ప్రభుత్వం పై ప్రజల అంగీకారం లేకపోవడం, ఈ ఘటనకు సంబంధించిన వివిధ సంఘటనలను మరింత అభివృద్ధి చేసింది. హాదీ మరణం తర్వాత , హింస పట్ల సంబంధిత మీడియా సంస్థలు కూడా ప్రక్షోభానికి గురయ్యాయి. "ప్రథమ్ ఆలో" "డైలీ స్టార్" అనే పత్రికల భవనాలకు నిప్పంటించడం, ఈ సమయంలో పత్రికా ముద్రణ సిబ్బందిని ప్రాణాలతో తప్పించుకోవడం వంటి సంఘటనలు ఈ ఉద్రిక్త పరిస్థితులను మరింత ప్రతిబింబించాయి. హాదీ మరణం పై యూరోపియన్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. జర్మనీ రాయబార కార్యాలయం, పతాకాన్ని అవనతం చేసి, "జాతీయ సంతాపం" అని ప్రకటించింది. అమెరికా, బ్రిటన్, జర్మనీ సహా పలు ఇతర దేశాలు ఈ ఘటనపై తమ సంతాపాన్ని వ్యక్తం చేశాయి. అమెరికా, బ్రిటిష్, జర్మన్ ఎంబసీల నుండి వచ్చిన సందేశాలు హాదీ కుటుంబానికి, మద్దతుదారులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భారత విదేశాంగ శాఖ నుండి ఈ సందర్భంగా ఎలాంటి స్పందన లేకపోవడం, సంబంధిత దేశాల మధ్య మరింత కలవరాన్ని పెంచింది.

**భారత-బంగ్లాదేశ్ సంబంధాలపై ప్రభావం: -**

హాదీ మరణం తర్వాత, భారత్ బంగ్లాదేశ్ సంబంధాలు మరింత క్షీణించాయి. బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయి, ఆమె భారతదేశంలో ఆశ్రయం పొందిన తర్వాత, రెండు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కానీ,భారత ప్రధాని నరేంద్ర మోదీ ,ముహమ్మద్ యూనస్ మధ్య జరిగిన ఏప్రిల్ భేటీలో సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నాలు జరిగినప్పటికీ, హాదీ మరణం తరువాత సంబంధాలు మరింత సవాలుగా మారాయని కొంతమంది రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పాలక వర్గానికి ఉద్దేశించిన సందేశం: ముహమ్మద్ యూనస్ హాదీ అంత్యక్రియల సందర్భంగా మాట్లాడుతూ, "హాదీకి ఎప్పటికీ మరణం రాదని," అతని కృషిని, ప్రజల మధ్య మానవత్వాన్ని కొనియాడారు. ఆయన మాట్లాడుతూ, "హాదీ ఎప్పటికీ మా మదిలో జీవిస్తాడు", "మేము అతని ఆశయాలను కొనసాగిస్తాం" అని చెప్పారు. హాదీ మరణం తర్వాత , భవిష్యత్తులో బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వ భారతదేశం తో సంబంధాలను ఎలా నిర్వహించుకుంటుందో, అంతే కాకుండా భారత వ్యతిరేకి గా భావించిన హాదీ నమ్మకాలు మరియు సిద్ధాంతాలపై భారతదేశం ఎలా స్పందించనో అనేది మరో చర్చనీయాంశం.

## పాకిస్థాన్‌కు భారీ సాయం.. భారత్ అప్రమత్తం




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పాకిస్థాన్ దేశానికి ప్రపంచబ్యాంకు 700 మిలియన్ డాలర్ల సాయాన్ని ఆమోదిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌లోని ఆర్థికవ్యవస్థను గాడినపెట్టేందుకు, సేవారంగాన్ని పెంపొందించేందుకు ప్రపంచ బ్యాంక్ రుణ సదుపాయాన్ని కల్పించినట్లు తెలుస్తోంది. పబ్లిక్ రిసోర్స్ ఫర్ ఇన్ క్లూజివ్ డెవలప్‌మెంట్ మల్టీఫేజ్ ప్రోగ్రామాటిక్ అప్రోచ్ (PRID MPA)లో భాగంగా మొత్తం 1.35 బిలియన్ డాలర్ల సాయాన్ని వరల్డ్ బ్యాంకు అప్రూవల్ చేసినట్లు ఒక వార్తాపత్రిక కథనాల్లో వెల్లడించింది. ఇందులో 600 మిలియన్ డాలర్లను ఫెడరల్ లెవెల్ ప్రోగ్రామ్స్‌కు, అలాగే 100 మిలియన్ డాలర్లు సింధ్ రాష్ట్రంలోని అభివృద్ధి పనులకు కేటాయించింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ధాటికి పాకిస్థాన్ అతలాకుతలం అయ్యింది. అంతే కాకుండా పాకిస్థాన్‌పై భారత్ కఠినమైన ఆంక్షలు విధించింది. సింధూజలాల నిలిపివేతతో ఇరుదేశాల మధ్య వాణిజ్యం నిలిచిపోవడంతో పాకిస్థాన్ ఆర్థికరంగం దెబ్బతిన్నది. ఈ క్రమంలో పాకిస్థాన్‌లోని ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టేందుకు వరల్డ్ బ్యాంకు మొత్తం 1.35 బిలియన్ డాలర్ల సాయాన్ని ప్రకటించింది. దానిలో భాగంగా తాజాగా 700 మిలియన్ డాలర్ల సాయాన్ని ఆమోదిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక ఇటీవల పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలోని ప్రాథమిక విద్యాభివృద్ధి కోసం ఈ ఏడాది ఆగస్టులో 47.9 మిలియన్ డాలర్లు సాయం చేసింది. తాజాగా మరో 700 మిలియన్ డాలర్ల సాయాన్ని వరల్డ్ బ్యాంకు అందించింది. ఈ విషయాన్ని పాకిస్థాన్‌లోని వరల్డ్ బ్యాంకు ఆఫీసర్ బోలోర్మా అంగాబజార్ ధృవీకరించారు. పాకిస్థాన్‌లో సమీకృత, సుస్థిర అభివృద్ధి కోసం దేశీయంగా ఉన్న రీసోర్స్‌లను సమర్థవంతంగా వినియోగించి మెరుగైన ఫలితాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రభుత్వంతో పాటు సింధూ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పాఠశాలలు, క్లినిక్స్ ట్యాక్స్ వ్యవస్థలపై ఫండింగ్ చేస్తున్నట్లు బోలోర్మా అంగాబజార్ తెలిపారు. సామాజిక, పర్యావరణ పెట్టుబడులతో ప్రజల్లో నమ్మకాన్ని బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో భారత్ అప్రమత్తమైంది. ప్రపంచ బ్యాంక్ సాయంతో పాకిస్థాన్‌పై దృష్టి సారించింది. ఎప్పటికప్పుడు పాకిస్థాన్ కదలికలను పరిశీలిస్తుంది.

## మాజీ ప్రియురాలిపై కోర్టులో యువకుడి దావా..!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



నార్త్ ఈస్టర్న్ చైనాలో గల హిలోంజియాంగ్ రాష్ట్రంలోని ఒక మారుమూల గ్రామానికి చెందిన యువకుడు హెవాంగ్ అనే యువతితో మాట్రిమోని యాప్‌లో పరిచయం ఏర్పడింది. ఆపై ఇరువురూ కొంతకాలం రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. ఆ సమయంలో హె తల్లిదండ్రులకు చెందిన హోటల్‌లో వాంగ్ పనిచేసింది. అప్పుడే హెవాంగ్ ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. ఆ సమయంలో సంప్రదాయం ప్రకారం హె తల్లిదండ్రులు బ్రైడ్ ప్రైస్ కింద 20 వేల యువాన్లు వాంగ్‌కు ఇచ్చారు. ఎంగేజ్‌మెంట్ తర్వాత ఆరు నెలలు కలిసి ఉన్నారు. ఆ తర్వాత వాంగ్ తీరుతో విసిగిపోయిన హె ఆమెతో పెళ్లిని రద్దు చేసుకున్నాడు. వాంగ్‌కు పనికన్నా తిండిపైనే ఎక్కువ శ్రద్ధ ఉండేదని, తరచూ షాపింగ్ చేస్తూ తన డబ్బుతో దుస్తులు ఇతర త్రా వ్యక్తిగత వస్తువులను కొనుగోలు చేసిందని ఆరోపించాడు. అందుకు 30 వేల యువాన్లు ఖర్చయిందని, బ్రైడ్ ప్రైస్‌గా ఇచ్చిన 20 వేల యువాన్లు కలిపి మొత్తం 50 వేల యువాన్లు (దాదాపు రూ.6.3 లక్షలు) తిరిగి ఇప్పించాలని కోర్టులో దావా వేశాడు.అయితే ప్రియురాలి కోసం పెట్టిన ఖర్చు ఇద్దరి భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని, ఆ సొమ్మును తిరిగి ఇవ్వమనడం సరికాదని జడ్జి పేర్కొన్నారు. కేసును కొట్టేస్తూ బ్రైడ్ ప్రైజ్ కింద యువకుడి కుటుంబం ఇచ్చిన 20 వేల యువాన్లలో సగం సొమ్ము తిరిగి ఇవ్వాలని వాంగ్‌ను ఆదేశించారు.

## సౌత్ కొరియాకు 'తల' గండం



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

దక్షిణ కొరియాకు కొత్త తలనొప్పి మొదలైంది. దేశంలో బట్టతల సమస్య ఇప్పుడు సామాజిక, రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. గత ఏడాది గణాంకాల ప్రకారం, సుమారు 2.40 లక్షల మంది బట్టతల సమస్యతో ఆసుపత్రులను ఆశ్రయించారు. అందులో 40% మంది యువత (2030 ఏళ్ల వారు) ఉండటం గమనార్హం. కొరియాలో అత్యంత పోటీతత్వమైన సమాజం ఉండటం, వ్యక్తిగత ఆహార్యం, ఉద్యోగ అవకాశాలు సామాజిక హోదాపై ప్రభావం చూపడం వల్ల యువతలో ఆత్మన్యూనతా భావం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో, బట్టతల సమస్యకు చికిత్సలకు ప్రభుత్వమే నిధులు అందించాలని ప్రతిపాదించిన రాష్ట్రీయ అధ్యక్షుడు లీ జేమ్యూన్, దేశవ్యాప్తంగా వివాదాన్ని నడిపించారు. ప్రాణాంతక వ్యాధుల కంటే జుట్టు పెంచే చికిత్సలకు నిధులు కేటాయించడం సమంజసమైందా అన్నది విమర్శకుల ప్రశ్న. కొందరు ఆర్థిక నిపుణులు దీనిని 'పాపులిస్ట్' ప్రకటనగా ఆరోపిస్తున్నారు. ఇక, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ, జుట్టు రాలే సమస్య కూడా మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని, కాబట్టి దీనిని బీమా పరిధిలోకి తీసుకురావడం అవసరమని పేర్కొంది. దేశ ప్రగతిపై కూడా పాజిటివ్ ప్రభావం పడే అవకాశం ఉందని సమర్థకులు అభిప్రాయపడుతున్నారు. జుట్టు మార్పిడి, మందుల ఖర్చులు ఎక్కువ కావడంతో, ఈ పథకం అమలు అవుతుంటే, దక్షిణ కొరియా ప్రపంచంలోనే జుట్టు రాలే సమస్యకు ప్రభుత్వ నిధులతో చికిత్స అందించే తొలి దేశాలలో ఒకటిగా దక్షిణ కొరియా నిలుస్తుంది. సౌత్ కొరియాకు 'తల' గండం దక్షిణ కొరియాకు కొత్త తలనొప్పి మొదలైంది . దేశంలో బట్టతల సమస్య ఇప్పుడు సామాజిక, రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. గత ఏడాది గణాంకాల ప్రకారం, సుమారు 2.40 లక్షల మంది బట్టతల సమస్యతో ఆసుపత్రులను ఆశ్రయించారు. అందులో 40% మంది యువత (2030 ఏళ్ల వారు) ఉండటం గమనార్హం. కొరియాలో అత్యంత పోటీతత్వమైన సమాజం ఉండటం, వ్యక్తిగత ఆహార్యం, ఉద్యోగ అవకాశాలు సామాజిక హోదాపై ప్రభావం చూపడం వల్ల యువతలో ఆత్మన్యూనతా భావం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో, బట్టతల సమస్యకు చికిత్సలకు ప్రభుత్వమే నిధులు అందించాలని ప్రతిపాదించిన రాష్ట్రీయ అధ్యక్షుడు లీ జేమ్యూన్, దేశవ్యాప్తంగా వివాదాన్ని నడిపించారు. ప్రాణాంతక వ్యాధుల కంటే జుట్టు పెంచే చికిత్సలకు నిధులు కేటాయించడం సమంజసమైందా అన్నది విమర్శకుల ప్రశ్న. కొందరు ఆర్థిక నిపుణులు దీనిని 'పాపులిస్ట్' ప్రకటనగా ఆరోపిస్తున్నారు. ఇక, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ, జుట్టు రాలే సమస్య కూడా మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని, కాబట్టి దీనిని బీమా పరిధిలోకి తీసుకురావడం అవసరమని పేర్కొంది. దేశ ప్రగతిపై కూడా పాజిటివ్ ప్రభావం పడే అవకాశం ఉందని సమర్థకులు అభిప్రాయపడుతున్నారు. జుట్టు మార్పిడి, మందుల ఖర్చులు ఎక్కువ కావడంతో, ఈ పథకం అమలు అవుతుంటే, దక్షిణ కొరియా ప్రపంచంలోనే జుట్టు రాలే సమస్యకు ప్రభుత్వ నిధులతో చికిత్స అందించే తొలి దేశాలలో ఒకటిగా దక్షిణ కొరియా నిలుస్తుంది.



## భారత్ అణుచట్టం రూల్స్‌పై ట్రంప్ మెలిక

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్ అణు బాధ్యత చట్టాలను అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా మార్చాలని సూచిస్తూ, అమెరికా రక్షణ చట్టంపై ట్రంప్ సంతకం చేయడం పెను దుమారం రేపుతోంది.రెండురోజుల క్రితం భారత పార్లమెంటు, అణురంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అనుమతిస్తూ, అణు ప్రమాద బాధ్యతను ఆపరేటర్‌పై రూ.3,000 కోట్లకు పరిమితం చేస్తూ శాంతి బిల్లును ఆమోదించింది. ఈ పరిణామం జరిగిన 48 గంటల్లోనే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వార్షిక జాతీయ రక్షణ అధికార చట్టం (NDAA)పై సంతకం చేశారు.ఈ చట్టంలోని ఓ భాగంలో 2008 నాటి భారత్ అమెరికా అణు ఒప్పందం అమలును పర్యవేక్షించడానికి, మన దేశీయ అణు బాధ్యత చట్టాలను అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా మార్చేందుకు భారత్‌తో కలిసి పనిచేయాలని అమెరికా విదేశాంగ మంత్రిని ఆదేశించారు. ఈ బిల్లుతో, అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించే అమెరికా కంపెనీలు (వెస్టింగ్‌హౌస్, జీఈ) ప్రధాన ఆందోళనను భారత్ పాక్షికంగా పరిష్కరించింది. ప్రమాదం జరిగితే, ఆపరేటర్ (ఎన్‌పీసీఐఎల్) బాధ్యతను రూ.3,000 కోట్లకు పరిమితం చేసింది. అమెరికా రక్షణ శాఖ వార్షిక బడ్జెట్‌ను నిర్దేశించే ఈ చట్టంలో, భారత్ అణు బాధ్యత అంశాన్ని చేర్చడం వ్యూహాత్మకంగా కనిపిస్తోంది. ఇది కేవలం ఆపరేటర్ బాధ్యతకే పరిమితం కాకుండా, అంతర్జాతీయంగా అమలవుతున్న పూర్తి నిబంధనల వైపు భారత్‌ను నడిపించాలనే అమెరికా ఆకాంక్షను స్పష్టం చేస్తోంది. ఇదే పరిణామంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఒకప్పుడు మంచి మిత్రుడైన ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోవడానికే, ప్రధాని మోదీ పార్లమెంటులో శాంతి బిల్లును బుల్డోజ్ చేశారని, అయినా అమెరికా నుంచి ఒత్తిడి తప్పడం లేదని విమర్శించింది. అంతర్జాతీయంగా, అణుప్రమాదం జరిగితే, దాని పూర్తి బాధ్యత ఆ ప్లాంట్‌ను నడిపే ఆపరేటర్‌దే. పరికరాలు సరఫరా చేసిన సప్లయర్‌కు ఎలాంటి బాధ్యత ఉండదు.అయితే భోపాల్ గ్యాస్ దుర్ఘటన అనుభవంతో, భారత్ తన చట్టంలో ఓ ప్రత్యేక నిబంధనను (సెక్షన్ 17బి) చేర్చింది. దీని ప్రకారం సప్లయర్ అందించిన పరికరాలలో లోపం వల్ల ప్రమాదం జరిగితే ఆ నష్టాన్ని ఆపరేటర్, సప్లయర్ నుంచి రాబట్టుకోవచ్చు.ఈ సప్లయర్ బాధ్యత నిబంధన వల్లే, అమెరికా కంపెనీలు భారత్‌లో అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించడానికి ఇన్నేళ్లుగా వెనకాడుతున్నాయి. శాంతి బిల్లుతో ఆపరేటర్ బాధ్యతను పరిమితం చేసినా, సప్లయర్ బాధ్యత అంశం ఇంకా మిగిలే ఉంది. ఇప్పుడు, NDAA ద్వారా అమెరికా ఆ అంశాన్ని పరిష్కరించాలని కోరింది.



## వీల్ ఛైర్‌లోనే నింగిలోకి..!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అంతరిక్ష పరిశోధన రంగంలో చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. జర్మనీకి చెందిన ఏరోస్పేస్ ఇంజనీర్ మిచెల్లా బెన్ తావూస్ వీల్ ఛైర్‌ను ఉపయోగిస్తూ, అంతరిక్షంలోకి వెళ్లిన తొలి వ్యక్తిగా ప్రపంచ రికార్డు సృష్టించారు. అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్‌కు చెందిన బ్లూ ఆరిజిన్ సంస్థ చేపట్టిన NS37 మిషన్‌లో భాగంగా ఆమె ఈ అసాధారణ విజయాన్ని సాధించారు. టెక్సాస్‌లోని లాంచ్ సైట్ వన్ నుండి న్యూ షెపర్డ్ వ్యోమనౌక ద్వారా మరో ఐదుగురు సభ్యులతో కలిసి ఆమె అంతరిక్షంలోకి ప్రయాణించారు. కేవలం 10 నిమిషాల పాటు సాగిన ఈ ప్రయాణంలో భూమికి సుమారు 105 కిలోమీటర్ల ఎత్తులో (కర్మాన్ రేఖకు అవతల) ఆమె భారరహిత స్థితిని అనుభవించారు. 33 ఏళ్ల మిచెల్లా 2018లో జరిగిన ఒక మౌంటైన్ బైకింగ్ ప్రమాదంలో వెన్నుపాము గాయం కారణంగా నడవలేకపోయారు. అయినప్పటికీ అంతరిక్షంపై ఉన్న మక్కువతో ఆమె పట్టుదలతో ఈ స్థాయికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇది నా జీవితంలో మర్చిపోలేని అద్భుతమైన అనుభవం, కల నిజమైన క్షణమని ఉద్వేగానికి లోనయ్యారు. శారీరక వైకల్యం అనేది కలలను చేరుకోవడానికి అడ్డంకి కాదని నిరూపించిన మిచెల్లా కృషిపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆమెతో పాటు ఈ యాత్రలో మాజీ స్పేస్‌ఎక్స్ ఎగ్జిక్యూటివ్ హన్స్ కోనిగ్‌స్మాన్ పాల్గొనడం విశేషం. ఈ విజయం భవిష్యత్తులో దివ్యాంగులు సైతం అంతరిక్ష యాత్రలు చేసేందుకు బాటలు వేసిందంటూ పలువురు కొనియాడుతున్నారు.

## నేరుగా భూమిపైకి శాటిలైట్

**మొదటిపేజీ తరువాయి...**

శనివారం ఆ ఉపగ్రహానికి సంబంధించిన శకలాలు అమెరికాలోని అలాస్కా సమీపంలో గగనతలంలో ప్రయాణిస్తుండగా, వెంటోర్‌టెక్ సంస్థకు చెందిన వరల్డ్‌వ్యూ3 అనే ఉపగ్రహం 241 కిలోమీటర్ల దూరం నుంచి హైరిజల్యూషన్ చిత్రాలను తీసింది. ఈ ఉపగ్రహం నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి లేదా భూమికి ఎలాంటి ముప్పులేదని స్పేస్‌ఎక్స్ చెబుతోంది. ప్రస్తుతం అది ఐఎస్ఎస్ కంటే కిందే ఉందని వెల్లడించింది.అది లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో ఉండటంతో భూ గురుత్వాకర్షణ శక్తి దానిని సులువుగా లాగేస్తుందని తెలిపింది. అవి వాతావరణ ఘర్షణతో కాలిపోయే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ప్రస్తుతం స్టార్‌లింక్ ప్రాజెక్టు కింద 9,000 ఉపగ్రహాలను స్పేస్‌ఎక్స్ అంతరిక్షంలోకి పంపింది. దీంతో ప్రపంచంలోని మారుమూల ప్రాంతాలకు సైతం ఇంటర్నెట్ సరఫరా చేయనున్నట్లు స్పేస్‌ఎక్స్ తెలిపింది.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
22.12.2025
www.manasarkar.com



# వైసీపీ ఒక క్యాన్సర్ గడ్డ..

## ఏపీకి యోగి మార్క్ ట్రీట్‌మెంట్ అవసరం

**రాజమండ్రి (ఏడీఎన్ఎన్) :**

వైసీపీ నేతలు ,ఆ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నిప్పులు చెరిగారు. ఆదివారం రాజమండ్రి గోరక్షణపేట సెంటర్‌లో భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ తరువాత జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వైసీపీ ఒక "క్యాన్సర్ గడ్డ" లాంటిదని, దానిని మూలాలతో సహా తొలగించాలని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పినట్లుగా రాష్ట్రంలో నేరస్తుల పట్ల ఉత్తరప్రదేశ్ తరహాలో 'యోగి ఆదిత్యనాథ్ ట్రీట్‌మెంట్' అమలు కావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అంతులేని అవినీతి , ఆర్థిక విధ్వంసం జరిగిందని మంత్రి ఆరోపించారు. కోర్టుల నుంచి ఎన్నిసార్లు మొట్టికాయలు తిన్నా వైసీపీ నాయకుల తీరులో మార్పు రావడం లేదని విమర్శించారు. వ్యవస్థలోని లొసుగులను వాడుకుని కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, తనపై మాజీ మంత్రులు చేస్తున్న విమర్శలు పిచ్చి ప్రేలాపనలేనని కొట్టిపారేశారు. "నేను పుట్టినా, చనిపోయినా బీజేపీలోనే ఉంటాను" అని తన రాజకీయ నిబద్ధతను చాటుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుంటే, ఓర్వలేక వైసీపీ నేతలు బైక్ ర్యాలీలు, సంతకాల సేకరణ పేరుతో డ్రామాలు ఆడుతున్నారని సత్యకుమార్ మండిపడ్డారు. జగన్ అండ్ కో చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, కోటి సంతకాల సేకరణ ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రుల విషయంలో తాము చిన్నారుల కోసం 'హెల్త్ డిజిటల్ రికార్డులు' మెయింటైన్ చేస్తున్నామని, సర్వే ద్వారా అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందిస్తామని ఈ సందర్భంగా వివరించారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి నిబద్ధత భవిష్యత్తు తరాలకు ఆదర్శమని మంత్రి కందుల దుర్గేశ్ కొనియాడారు. దేశ ప్రజలందరూ ప్రేమించే గొప్ప నాయకుడు వాజ్‌పేయి అని, రాజకీయాలంటే సేవ అని ఆయన నిరూపించారని తెలిపారు. మోదీ, చంద్రబాబు మరియు పవన్ కల్యాణ్‌ల త్రిముఖ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకుపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయి, కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ, ఎంపీ పురందరేశ్వరి తదితర కీలక నేతలు పాల్గొన్నారు.



# పోలియో రహిత సమాజమే లక్ష్యం

**నరసరావుపేట (ఏడీఎన్ఎన్) :**

దేశవ్యాప్త పల్స్ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసరావుపేట పట్టణంలోని 8వ వార్డులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు ఆదివారం ప్రారంభించారు. చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయడం ద్వారా ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని, ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ,మైనార్టీ నేతలు పాల్గొన్నారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ రఫీ, అంజుమన్ సెక్రటరీ హాజీ కరిముల్లా,పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు బడే బాబు,మాజీ అంజుమన్ ఉపాధ్యక్షులు షేక్ బుడే, 8వ వార్డు ప్రెసిడెంట్ షేక్ మీరసా, షేక్ కాలేషా ,పఠాన్ కరీం ఇతర నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొని, వార్డులోని ప్రతి ఇంటికీ సమాచారం అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతి చిన్నారికి చుక్కలు వేసేలా వైద్య సిబ్బంది , అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా కోరారు.



# 'ఎంపీఎల్-4' ప్రారంభించిన నారా బ్రాహ్మణి

**మంగళగిరి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ రాబోయే పుట్టినరోజును పురస్కరించుకొని మంగళగిరి నియోజకవర్గంలో 'మంగళగిరి ప్రీమియర్ లీగ్' ('ఎంపీఎల్ 4' ) క్రికెట్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నారా బ్రాహ్మణి, ఏలూరు ఎంపీ సానా సతీష్, ప్రముఖ సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ క్రీడా సంబరాలను ప్రారంభించారు. పోటీల ప్రారంభోత్సవంలో భాగంగా నారా బ్రాహ్మణి టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. తర్వాత మైదానంలో నారా బ్రాహ్మణి, హీరో నిఖిల్ కొద్దిసేపు సరదాగా క్రికెట్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. నిఖిల్ బౌలింగ్ చేయగా, బ్రాహ్మణి బ్యాటింగ్ చేస్తూ క్రీడాకారుల్లో జోష్ నింపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన చిత్ర ప్రదర్శనను వారు ఆసక్తిగా తిలకించారు. ఆదివారం నుంచి వచ్చే నెల 21 వరకు ఈ క్రికెట్ పోటీలు జరగనున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 125 టీమ్‌లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంతో పాటు, మంత్రి లోకేశ్ జన్మదినాన్ని ఒక వేడుకలా జరుపుకోవాలనే లక్ష్యంతో ఈ లీగ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సానా సతీష్ మాట్లాడుతూ, యువత క్రీడల్లో రాణించాలని, లోకేశ్ నాయకత్వంలో మంగళగిరి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని అన్నారు. హీరో నిఖిల్ మాట్లాడుతూ మంగళగిరిలో క్రీడల పట్ల ఉన్న ఉత్సాహాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, క్రీడాకారులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్న పునర్జన్మ ప్రసాదించారు


**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కోసం తిరుమల తిరుపతి దేవస్థానం రూ. 35.19 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో, భక్తుల సౌకర్యార్థం ఈ నిధులతో వంద గదుల ధర్మశాల , భారీ దీక్షా మండపాన్ని నిర్మించనున్నారు. గతంలో పవన్ కల్యాణ్ ఈ క్షేత్రాన్ని సందర్శించినప్పుడు అక్కడ ఎదురవుతున్న సమస్యలను గమనించి, టీటీడీ ద్వారా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని ఇచ్చిన హామీని ఇప్పుడు నెరవేర్చారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ భావోద్వేగంగా



స్పందిస్తూ, తన ఇష్టదైవమైన కొండగట్టు అంజన్న తనకు పునర్జన్మను ప్రసాదించడమే కాకుండా, అడుగడుగునా ధైర్యాన్ని, బలాన్ని అందిస్తూ నడిపిస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి స్వామివారి సన్నిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం కలగడం తన అదృష్టమని, ఇందుకు స్వామివారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. ఈ నిధుల ద్వారా భక్తులకు మెరుగైన వసతులు సమకూరుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, కొండగట్టు అభివృద్ధికి ప్రతిపాదన చేయగానే సానుకూలంగా స్పందించి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు గారికి మరియు తిరుమల శ్రీవారి భక్తులందరికీ పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. స్వామివారి కృపతో ఈ అభివృద్ధి పనులు వేగంగా, విజయవంతంగా పూర్తి కావాలని ఆయన ఆకాంక్షించారు.

# పీపీపీ విధానం పేదలకు శాపం



**నెల్లూరు (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ పేరుతో ప్రభుత్వాలు ప్రజలను దోచుకుంటున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నెల్లూరులో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి విధానపరంగా ఎలాంటి తేడా లేదని, ఇద్దరూ అడ్డదారిలో ప్రజాధనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. నాడు ముఖ్యమంత్రి జగన్ మెడికల్ కాలేజీల నిర్మాణంలో అడ్డదారి ఒప్పందాలతో దోచుకుంటే, నేడు చంద్రబాబు పీపీపీ పేరుతో అదే పని చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం పేద ప్రజల గొంతు కోయడమేనని నారాయణ వ్యాఖ్యానించారు. పీపీపీ విధానంలో ప్రభుత్వానికి చెందిన విలువైన భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తారని, కాలేజీల నిర్మాణానికి అయ్యే ఖర్చును కూడా ఐదేళ్ల పాటు ప్రభుత్వమే భరిస్తుందని, ఇది కేవలం కార్పొరేట్ శక్తులకు మేలు చేయడానికేనని ఆయన మండిపడ్డారు. ఆరోగ్య వ్యవస్థను ప్రైవేటీకరణ చేయకూడదని, ప్రజలకు ప్రాథమిక హక్కుగా అందాల్సిన వైద్యాన్ని వ్యాపారంగా మార్చవద్దని హితవు పలికారు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, మెడికల్ కాలేజీల కోసం నేరుగా నిధులు తీసుకురావాలి తప్ప ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం సరైనది కాదని సూచించారు. మరోవైపు రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యంపై కూడా ఆయన స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా, రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతున్నాయని, హత్యలు, దోపిడీలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిలిపివేసి, ప్రభుత్వమే వాటిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను, సామాన్యులకు ఉచిత వైద్యాన్ని దూరం చేసే ఏ నిర్ణయాన్నైనా సీపీఐ తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తామని నారాయణ హెచ్చరించారు.

# ఉపాధి హామీ పథకంపై కేంద్రం కుట్ర

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, ఈ కుట్రలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కూడా భాగస్వామ్యం ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలకు అండగా ఉండే ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచేలా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలపై చంద్రబాబు ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. పేద ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, కేంద్రంతో సఖ్యతగా ఉండి కూడా రాష్ట్ర ప్రయోజనాలను, పేద ప్రజల హక్కులను కాపాడటంలో ఆయన విఫలమవుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంపై తీసుకుంటున్న ఇటువంటి అనాలోచిత నిర్ణయాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొత్స ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస పాలన సాగుతోందని, పరిపాలన పూర్తిగా గాడి తప్పిందని ఆయన ధ్వజమెత్తారు. వ్యవస్థలపై పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని, కూటమి ప్రభుత్వం కేవలం ప్రచారానికే పరిమితమైందని బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు.



# పార్టీయే సుప్రీం.. పనితీరు బాగోకపోతే కౌన్సెలింగ్ తప్పదు



## సచివాలయం అద్దె ఇల్లు.. పార్టీయే సొంత ఇల్లు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయిన తరుణంలో, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రాంతీయ సమన్వయకర్తలతో దాదాపు రెండున్నర గంటల పాటు సుదీర్ఘంగా భేటీ అయిన ఆయన, ఎమ్మెల్యేల పనితీరుపై సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రజల్లో పట్టు కోల్పోయిన లేదా పనితీరు ఆశించిన స్థాయిలో లేని ఎమ్మెల్యేలకు పార్టీ తరపున ప్రత్యేకంగా 'కౌన్సెలింగ్' ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నేతలకు దిశానిర్దేశం చేస్తూ లోకేశ్ ఒక ఆసక్తికరమైన పోలికను చెప్పారు. "సచివాలయం అనేది మనకు అద్దె ఇల్లు లాంటిది.. అధికారం ఉన్నప్పుడే అక్కడ ఉంటాం. కానీ పార్టీ అనేది మన సొంత ఇల్లు, అది శాశ్వతం" అని పేర్కొన్నారు. ఎంతటి పెద్ద నాయకుడైనా పార్టీ లైన్‌కు లోబడి ఉండాలని, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వంలో ఉన్నామనే గర్వం లేకుండా, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండాలని హితవు పలికారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల భర్తీపై లోకేశ్ స్పష్టత ఇచ్చారు. దేవాలయ కమిటీలు, మార్కెట్ యార్డులు, పీఏసీఎస్ అధ్యక్ష పదవులను ఈ నెలాఖరుకల్లా భర్తీ చేయాలని సూచించారు. ముఖ్యంగా, గత ఐదేళ్ల ప్రతిపక్ష కాలంలో పార్టీ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన వారికే పదవుల్లో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్తగా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని పదవుల కోసం సిఫార్సు చేస్తే నిర్దాక్షిణ్యంగా తిరస్కరించాలని సమన్వయకర్తలకు దిశానిర్దేశం చేశారు. గడిచిన రెండు నెలల్లో ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడిందని సంతృప్తి వ్యక్తం చేసిన లోకేశ్, ప్రజల నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలన్నారు. పింఛన్ల పంపిణీ, స్వచ్ఛాంధ్ర వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు స్వయంగా పాల్గొని ప్రజలకు చేరువ కావాలని సూచించారు. అలాగే, ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయాల నిర్మాణానికి స్థలాల గుర్తింపు ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, కార్యకర్తల బీమా చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# వైసీపీ హయాంలోనే పూర్తి ఆర్థిక సాయం

## తోట్లవల్లూరులో మంత్రి నాదెండ్లకు షాక్ !

**ఉయ్యూరు (ఏడీఎన్ఎన్) :**

కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో ఇటీవల నిర్వహించిన రైతు ముఖాముఖీ సభలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఊహించని షాక్ తగిలింది. ఈ కార్యక్రమంలో స్థానిక రైతు,మాజీ ఎంపీటీసీ భర్త తోట సాయి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఎకరాకు పూర్తిస్థాయిలో ఆర్థిక సహాయం అందేదని, కానీ ప్రస్తుతం అమలులో ఉన్న విధానం వల్ల ,మొత్తం భూమికి కాకుండా కేవలం కొంత భాగానికే నిధులు జమ అవుతున్నాయని మంత్రి నాదెండ్ల దృష్టికి తీసుకెళ్లారు..అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అన్నదాత సుఖీభవ' పథకం అమలుపై ,రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయం సక్రమంగా చేరడం లేదని, గత ప్రభుత్వ హయాంలో నిధుల పంపిణీలో స్పష్టత, వేగం ఉండేవని తోట సాయి పేర్కొన్నారు. తమకు అందాల్సిన ఆర్థిక సాయం విషయంలో ప్రస్తుత ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో రైతులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం కలగడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఒకే సర్వే నంబర్ పరిధిలో ఉన్న భూమికే ఈ వివక్ష ఎందుకని, ప్రభుత్వం రైతులకు ఇచ్చే సాయంలో కోత విధిస్తోందని రైతులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భూమి విస్తీర్ణానికి అనుగుణంగా అందుతున్న 'అన్నదాత సుఖీభవ' పథకంపై రైతులు తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులతో సానుకూలంగా మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చే ప్రయత్నం చేసినప్పటికీ, తోట సాయి చేసిన విమర్శలు సభలో చర్చనీయాంశమయ్యాయి. సంక్షేమ పథకాల పంపిణీలో ఉన్న సాంకేతిక లోపాలు, పంపిణీ వ్యవస్థలో చోటుచేసుకున్న జాప్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సంఘటన స్పష్టం చేసింది.





గత ప్రభుత్వ పాలనతో పోల్చుతూ రైతులు బహిరంగంగానే తమ అసంతృప్తిని తెలియజేయడం అధికార పార్టీ వర్గాల్లో కొంత కలకలం సృష్టించింది.

# అనంతపురం జిల్లాలో ఘరానా మోసం

## 43 మంది రైతులను ముంచి రైతు పరార్!

**అనంతపురం (ఏడీఎన్ఎన్) :**

నమ్మిన తోటి రైతులనే నట్టేట ముంచి, లక్షలాది రూపాయల అప్పులతో ఒక రైతు పరారైన ఘటన అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలంలోని ధర్గాహొన్నూరు గ్రామంలో వెలుగుచూసింది. వ్యవసాయం సాగు చేస్తూ, అందరికీ సుపరిచితుడైన మనోహర్ అనే వ్యక్తి సుమారు 43 మంది రైతులు , వ్యవసాయ కూలీల వద్ద నుండి రూ. 40.85 లక్షల వరకు అప్పుగా తీసుకుని ఇప్పుడు కనిపించకుండా పోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ధర్గాహొన్నూరు గ్రామానికి చెందిన మనోహర్ గత కొన్నేళ్లుగా స్థానికంగా వ్యవసాయం చేస్తూ ఉండేవారు.



తోటి రైతులతో ఉన్న పరిచయాలను ఆసరాగా చేసుకుని, వ్యవసాయ పెట్టుబడి కోసమంటూ నమ్మబలికి పలువురు రైతులు, రెక్కాడితే గానీ డొక్కాడని కూలీల దగ్గర నుండి భారీగా అప్పులు చేశాడు . అయితే, వ్యవసాయంలో నష్టాలు వచ్చాయనే సాకుతో తనకు ఉన్న ఇల్లు , నాలుగు ఎకరాల పొలాన్ని కూడా రహస్యంగా అమ్మేశాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితులు తమ సొమ్ము తిరిగి ఇవ్వాలని మనోహర్‌ను నిలదీశారు.అయితే తను అప్పు తీర్చలేనని తేల్చి చెప్పిన మనోహర్, కోర్టులో ఐపీ దాఖలు చేసి బాధితులకు నోటీసులు పంపారు. దీంతో ఆగ్రహించిన బాధిత రైతులు పోలీస్ స్టేషన్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో పోలీసుల సమక్షంలో స్పందించిన మనోహర్, త్వరలోనే అప్పులు తీరుస్తానని అందరినీ నమ్మబలికారు. కానీ, ఆ తర్వాత ఎవరికీ చెప్పకుండా ఊరి నుండి పరారయ్యారు. నమ్మి అప్పులిస్తే ఇప్పుడు మొహం చాటేసి పారిపోవడంతో 43 మంది బాధితులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. అప్పులు తెచ్చి మరీ మనోహర్‌కు ఇచ్చామని, ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని, పరారైన మనోహర్‌ను పట్టుకుని తమ సొమ్ము రప్పించాలని రైతులు అధికారులను కోరుతున్నారు.



# దోమల డ్రోన్ల హోరు.. కాగితాల్లో నివారణ జోరు

## రూ. 3 కోట్ల బడ్జెట్ ఉన్నా ఫలితం శూన్యం!

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

నగరంలో దోమల నివారణ కోసం కార్పొరేషన్ కోట్ల రూపాయల బడ్జెట్‌ను కుమ్మరిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం దోమల స్వైరవిహారం కొనసాగుతోంది. నగరంలోని 64 డివిజన్లను ఆరు మలేరియా డివిజన్లుగా విభజించి, కేవలం దోమల నివారణకే రూ.3 కోట్ల భారీ బడ్జెట్‌ను అధికారులు కేటాయించారు. కానీ, ఈ నిధులు,యంత్రాలు, సిబ్బంది అంతా రికార్డులకే పరిమితమవుతున్నాయని, ప్రజలు మాత్రం డెంగీ, మలేరియా, బోధకాల వ్యాధుల భయంతో వణికిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దోమల నివారణకు అవసరమైన వీఐటీ లిక్విడ్, థెమోఫోకస్ వంటి ఖరీదైన రసాయనాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి కొనుగోలు చేస్తున్నట్లు రికార్డులు చూపిస్తున్నాయి. ఇందుకోసం 324 మంది కార్మికులు, 128 కొత్త ఫాగింగ్ యంత్రాలు సిద్ధంగా ఉన్నా, కాలనీల్లో స్ప్రేయింగ్ లేదా ఫాగింగ్ జాడ కనిపించడం లేదు. ఎక్కడైనా మొక్కుబడిగా పనులు చేసి, ఫోటోలు దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని కార్పొరేటర్లే కౌన్సిల్ సమావేశంలో ముక్తకంఠంతో నిలదీయడం గమనార్హం. దోమల నివారణలో వైఫల్యం కారణంగా నగరంలో బోధకాల వ్యాధి వేగంగా విస్తరిస్తోంది. మురుగు నీటిలో పెరిగే క్యూలెక్స్ దోమల వల్ల గత వారం రోజుల్లోనే నగరంలో ఆరుగురు ఈ వ్యాధి బారిన పడ్డారు. గతంలో రాత్రిపూట మాత్రమే కుట్టే దోమలు, ఇప్పుడు పగటిపూట కూడా దాడి చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల్లో మురుగు పేరుకుపోవడం, యంత్రాలను డిపోలకే పరిమితం చేయడం వల్ల లార్వాలు వృద్ధి చెంది దోమల సంఖ్య అసాధారణంగా పెరుగుతోంది. సాధారణంగా ప్రతి విషయంలో విమర్శలు చేసుకునే టీడీపీ, వైసీపీ కార్పొరేటర్లు, దోమల సమస్యపై మాత్రం ఏకతాటిపైకి వచ్చారు. నగరంలో దోమల సమస్య భరించలేనంతగా ఉందని, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని కౌన్సిల్ సమావేశంలో ధ్వజమెత్తారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విమర్శలపై కమిషనర్ ధ్యాన్ చంద్ర ఆదేశాల మేరకు నిరంతరాయంగా ఫాగింగ్, స్ప్రేయింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆధునిక సాంకేతికతతో కూడిన దోమల సెన్సార్లు, ఎలివేషన్ యంత్రాలను కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు.

# మీ ప్రేమే నా బలం...

**మొదటిపేజీ తరువాయి...**

ముఖ్యంగా ఎక్స్ లో '#HappyBirthdayYSJagan','#HBDYSJagan', '#JaganAnna' వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ప్రపంచవ్యాప్తంగా టాప్ ట్రెండింగ్‌లో నిలిచాయి. రాజకీయ విభాగంలో ఈ ట్రెండింగ్ గ్లోబల్ స్థాయిలో అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. అభిమానులు ఆయన పాలనలోని సంక్షేమ పథకాలను, పేదల పట్ల ఆయనకున్న దార్శనికతను ప్రశంసిస్తూ ప్రత్యేక ఎడిటింగ్ వీడియోలు, ఫోటోలతో నెట్టింట సందడి చేశాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహిస్తున్నాయి. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలు, అన్నదానాలు, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. రాజమండ్రిలో గోదావరి నది మధ్యలో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జగన్ పుట్టినరోజు సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ పోస్ట్‌లు చేశారు.



# మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం..

## నలుగురు నిందితుల అరెస్ట్

**మంగళగిరి (ఏడీఎన్ఎన్) :**

మంగళగిరి పట్టణంలో పదమూడేళ్ల మైనర్ బాలికపై జరిగిన సామూహిక అత్యాచార ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ అమానుషానికి పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 18వ తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో మంగళగిరి టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న బాలికతో నిందితులు మాటలు కలిపారు. తర్వాత తమ వద్ద ఉన్న టీవీఎస్ కింగ్ ఆటో (AP39 UX 4295)లో ఎక్కించుకుని, ఎవరూ లేని నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లారు. అక్కడ బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలిక భయంతో గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని ఆమెను రక్షించారు. ఇంటికి చేరుకున్న బాలిక తనపై జరిగిన దారుణాన్ని తల్లికి వివరించడంతో ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది. ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. డీఎస్పీ మురళీకృష్ణ సారథ్యంలో, సీఐ వీరాస్వామి పర్యవేక్షణలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం మంగళగిరి మండలంలోని డాన్ బాస్కో స్కూల్ సమీపంలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను పోలీసులు మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ నుండి కోర్టు వరకు నడిపించుకుంటూ తీసుకువెళ్లారు. వారిని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా, కోర్టు వారికి 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మహిళలు , చిన్నారులపై ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, బాధితురాలికి న్యాయం జరిగేలా వేగంగా విచారణ పూర్తి చేస్తామని పోలీసులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



## మేడారం జాతరకు రాష్ట్రపతికి ఆహ్వానం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి, వచ్చే ఏడాది జరగనున్న మేడారం మహా జాతరకు రావాలని అధికారికంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి సమ్మక్క తల్లి చీర, కంకణం, కండువా బంగారాన్ని (బెల్లం) సమర్పించి, జాతర విశిష్టతను, సమ్మక్క సారలమ్మల పోరాట పటిమను మంత్రి సీతక్క వివరించారు. ఈ వివరాలు ఆసక్తిగా విన్న రాష్ట్రపతి, జాతరకు వచ్చేందుకు ఖచ్చితంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. 2026 జనవరి 28 నుండి 31 వరకు జరగనున్న ఈ మహా జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించగా, ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి దీనికి సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సారి భక్తుల తాకిడి భారీగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



## ఫామ్‌హౌజ్‌లో చలి పెరిగి కేసీఆర్ బయటికొచ్చారు

### కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ వ్యంగ్యాస్త్రాలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ పునరాగమనంపై కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లో చలి పెరగడం వల్లే కేసీఆర్ బయటకు వచ్చారని ఎద్దేవా చేస్తూ, ప్రతిపక్ష పాత్ర పోషించడంలో ఆయన విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణ సమాజం కేసీఆర్ కుటుంబానికి ఎంతో ఇచ్చిందని, కానీ ఆయన మాత్రం బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌజ్‌కే పరిమితమయ్యారని మండిపడ్డారు. మరోవైపు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కేసీఆర్ ప్రజా జీవితంలోకి రావడం సంతోషమేనని, అయితే నదీ జలాల సమస్యలకు కేసీఆర్, హరీశ్ రావుల తప్పిదాలే కారణమని ఆరోపించారు. వృథా ప్రాజెక్టుల పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శిస్తూ, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుందని, ఈ గెలుపు జోరులో బీఆర్ఎస్ అసలు ఎక్కడుందని ఆయన ప్రశ్నించారు.



## కేసీఆర్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలో వన్ టైం పాస్‌వర్డ్ లాంటి రాజకీయాలు ఇకపై సాగవని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఎద్దేవా చేశారు. కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంపై స్పందించిన ఆయన, కొన్ని నెలల విరామం తర్వాత కేసీఆర్ బయటకు వచ్చినంత మాత్రాన రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న 'హేట్ స్పీచ్' బిల్లుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కర్ణాటక తరహాలో ఈ బిల్లును ప్రవేశ పెట్టి బీజేపీ నాయకులను, కార్యకర్తలను వేధించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. కేవలం హిందువులను విమర్శించే వారిని కాపాడటానికి, హిందూ ధర్మం గురించి మాట్లాడే వారి గొంతు నొక్కడానికే ఈ కుట్ర జరుగుతోందని రామచందర్ రావు మండిపడ్డారు.

## కోడలి కోసం కొడుకును చంపేశాడు

**మొదటిపేజీ తరువాయి....**

మొదట అంజయ్యకు మంత్రగాడి ద్వారా మందు పెట్టి చంపాలని భావించినప్పటికీ, ఒకవేళ అతను అనారోగ్యం పాలైతే తామే సేవ చేయాల్సి వస్తుందని ఆ ఆలోచనను విరమించుకున్నారు. ఆ తర్వాత లచ్చయ్య మధ్యవర్తి అయిన కొలిపాక రవి ద్వారా రూ. 3 లక్షలకు హత్య ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇందులో భాగంగా రూ. 1.25 లక్షలను అడ్వాన్స్ గా చెల్లించాడు. సుపారీ తీసుకున్న కోటేశ్వర్, అబ్రార్ అనే వ్యక్తులు గత నెల రోజులుగా అంజయ్యతో స్నేహం నటించి, ఈనెల 2న అతడిని ఊరి శివారులోని కెనాల్ వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించారు. అంజయ్య మత్తులో ఉన్న సమయంలో గొంతు నులిమి హత్య చేసి, మృతదేహాన్ని కాలువలో పడేశారు. అంజయ్య కనిపించడం లేదని నమ్మబలికిన తండ్రి, భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఈనెల 5న మృతదేహం లభ్యమైంది. అయితే పోలీసులు సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టగా అసలు విషయం బయటపడింది. హత్య చేసిన నిందితులు మిగిలిన రూ. 1.75 లక్షల సుపారీ డబ్బు తీసుకోవడానికి లచ్చయ్య ఇంటికి వచ్చిన సమయంలో పోలీసులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించడంతో.. తండ్రి లచ్చయ్య, అంజయ్య భార్య మరియు మిగిలిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# వీబీ జీ రామ్ జీ వద్దు.. గాంధీజీ ముద్దు



ఉపాధి హామీ పేరు మార్పుపై కాంగ్రెస్ ర్యాలీలు


**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం 'వీబీ జీ రామ్ జీ'గా మార్చడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు ఆదివారం తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున నిరసన ర్యాలీలు చేపట్టాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గాంధీ విగ్రహాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కేంద్ర వైఖరిని ఎండగట్టారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో జరిగిన నిరసనలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దేశం కోసం సర్వం త్యాగం చేసిన గాంధీజీ పేరును పథకం నుండి తొలగించడం దారుణమని మండిపడ్డారు. గతంలో సోనియా గాంధీ పేదల వలసలను చూసి చలించి ఈ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తు చేస్తూ, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలనే ఊడగొడుతోందని విమర్శించారు. 'వీబీ జీ రామ్ జీ వద్దు.. గాంధీజీ ముద్దు' అంటూ నినాదాలు చేసిన ఆయన, కేంద్రం కులం, మతం పేరిట రాజకీయాలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తోందని ఆరోపించారు. నాగర్‌కర్నూల్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, సిరిసిల్లలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఈ నిరసనల్లో పాల్గొని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

# 'ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళా' ప్రారంభం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

శిల్పారామం ప్రాంగణంలో 'ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళా'ను రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ కళా నైపుణ్యంతో కూడిన చేతి వృత్తులు అంతరించకుండా ఉండటానికి ఇలాంటి మేళాలు ఎంతో దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న హ్యాండ్లూమ్





అవార్డు గ్రహీతలు, చేనేత కంపెనీలు మరియు సహకార సంఘాలకు చెందిన 100కు పైగా స్టాల్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే ఈ ప్రదర్శన 2026, జనవరి 5వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ క్రాఫ్ట్ మేళాను సందర్శించి, చేతివృత్తుల కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు.

# విజన్ డాక్యుమెంట్ కాదు.. విభజన హామీల లెక్క చెప్పండి

### సోనియా గాంధీకి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను సోనియా గాంధీ అభినందించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. విజన్ డాక్యుమెంట్‌ను అభినందించే ముందు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో తుక్కుగూడ సభలో స్వయంగా ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఎంతవరకు అమలు అయ్యాయో ఎప్పుడైనా తెలుసుకున్నారా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా గ్యారెంటీలను గాలికొదిలేసి, ఇప్పుడు కొత్తగా విజన్ డాక్యుమెంట్ పేరిట తెలంగాణ ప్రజలను మళ్లీ వంచించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 420 హామీలను మూసీ నదిలో కలిపేశారా లేక గాంధీ భవన్‌లో పాతరేశారా అని నిలదీశారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు, మహిళలకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కొత్త ఊహలతో ప్రజలను మోసం చేయాలని చూస్తే.. ఆనాడు కాంగ్రెస్ చూపిన 'అభయహస్తం' ప్రజల ఆగ్రహం వల్ల మీ పాలిట 'భస్మాసుర హస్తం'గా మారుతుందని హెచ్చరించారు. అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెడితే భవిష్యత్తులో తెలంగాణ సమాజం తగిన గుణపాఠం చెబుతుందని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.



## అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట

**మొదటిపేజీ తరువాయి...**

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో అవాస్తవాలు చెప్పడం పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్‌కు తగదని ఉత్తమ్ అన్నారు. రూ.లక్షల కోట్లు అప్పులు తెచ్చినా.. ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేదని ఆయన గుర్తుచేశారు. కృష్ణా జలాలు కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థంగా ముందుకెళ్తోందని, కృష్ణా జలాల విషయంలో పాలమూరు, నల్గొండ జిల్లాలకు అన్యాయం చేసింది కేసీఆరేనని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు . రాష్ట్ర ఏర్పాటుకు ముందున్న పెండింగ్ ప్రాజెక్టులను కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదు? తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిన కేసీఆర్.. రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు . కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోవడానికి కేసీఆర్ కారణమని కూలిపోయిన ప్రాజెక్టులు కట్టి ఇప్పుడు ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్నారని ఉత్తమ్ ప్రశ్నించారు . కాళేశ్వరం నిర్మాణ తీరును నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, సుప్రీంకోర్టు జడ్జి కూడా తప్పుబట్టారని , కమీషన్ల కోసమే ఆ ప్రాజెక్టు అంచనాలు పెంచారని మంత్రి ఉత్తమ్ విమర్శనాస్త్రాలు సంధించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను మోసం చేసిన కేసీఆర్.. ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని, ఆయన మాటలు వింటుంటే 'దయ్యాలు వేదాలు వల్లించినట్లే' ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. 2014 కంటే ముందు కేసీఆర్ సీఎం కాకముందే కృష్ణా నదీ జలాలు అక్రమంగా ఏపీ రోజుకు 47వేల క్యూసెక్కులు అక్రమంగా తరలించుకుపోతే.. కేసీఆర్ హయాంలో 1,11,400 క్యూసెక్కులకు పెరిగిందని మంత్రి ఆరోపించారు. కేసీఆర్ అసమర్థత వల్ల ప్రతీరోజూ 9.6 టీఎంసీలకు చేరుకుందన్నారు. జగన్, కేసీఆర్ కుమ్మక్కై తెలంగాణ ద్రోహం చేశారన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు కేసీఆర్ దోహదపడ్డారని.. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఆ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులను ఆపించామని చెప్పారు. శ్రీశైలం బాటమ్ నుంచి రోజూ 3 టీఎంసీలను తరలించుకుపోయే ప్లాన్ జగన్ చేశారని తెలిపారు. ఉమ్మడి ఏపీలో 2004-2014 వరకు 727 టీఎంసీల నీటిని అక్రమంగా శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా తరలించుకుపోతే.. కేసీఆర్ పదేళ్ల కాలంలో 1,442 టీఎంసీలు ఏపీ తరలించుకుపోయిందన్నారు. కృష్ణా నదీ జలాల్లో మోసం చేసింది బీఆర్ఎస్ పార్టీ అని ఆరోపించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా తాము పోరాడుతున్నామని.. పోలవరంబనకచర్ల మీద పోరాడింది తాము అని చెప్పారు. కేంద్రంతో, సుప్రీంకోర్టుతో పోరాడుతున్నామని.. పోలవరం-నల్లమలసాగర్ మీద రిట్ పిటిషన్ వేశామని తెలిపారు. రంగారెడ్డి జిల్లాకు నీరిచ్చే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు పది వేల కోట్లు ఖర్చు పెట్టిన తరువాత ఎందుకు మార్చారు? ఇప్పుడు రంగారెడ్డి మీద ఎందుకు ప్రేమ చూపిస్తున్నారు? అని ప్రశ్నించారు. రూ.38వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును ఎందుకు క్యాన్సిల్ చేశారని.. ఎవరు దద్దమ్మలో ప్రజలే నిర్ణయిస్తారని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట లక్ష కోట్లు వృథా చేయకుంటే.. రూ.38వేల కోట్లతో ప్రాణహిత చేవెళ్ల పూర్తిచేసుంటే రూ.62వేల కోట్లు మిగిలేవన్నారు. ఆ మిగిలిన డబ్బులతో పాలమూరురంగారెడ్డి, కోయిలసాగర్, నెట్టెంపాడు, బీమా, ఎస్ఎల్‌బీసీ, డిండి, దేవాదుల ఇతర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు పూర్తయ్యేవని.. వీటన్నింటికీ కలిపి రూ.4,500 కోట్లు మాత్రమే అయ్యేవని తెలిపారు. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో 16 లక్షల ఎకరాల ఆయకట్టు వచ్చేదన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, నాగార్జునసాగర్, దేవరకొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమాను సైతం ఏడిదిన్నర రెండేళ్లలో వీటన్నింటినీ పూర్తిచేస్తామని, 16 లక్షల ఎకరాలకు నీరిస్తామని హామీ ఇచ్చారు. ఇరిగేషన్ కోసం బీఆర్ఎస్ చేసిన అప్పు రూ.96,108 కోట్లు అని.. 11 శాతం వడ్డీతో తీసుకొచ్చారని మంత్రి ఆరోపించారు. ఏటా 10వేల కోట్లు వడ్డీ అవుతుందన్నారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి రూ.88వేల కోట్లు ఇరిగేషన్ ప్రాజెక్టుల మీద అప్పు ఉన్నదని.. ఇప్పటివరకు తాము రెండేండ్లలో 49,317 కోట్లు వడ్డీగా చెల్లించామని చెప్పారు. తాము చెల్లిస్తూ వస్తున్నా ఇంకా రూ.56వేల కోట్ల అప్పు మిగిలి ఉన్నదన్నారు. ఆ లోన్లను రీ స్ట్రక్చర్ చేసి 7 శాతానికి తీసుకొచ్చామని.. 11 శాతానికి అప్పులు తెస్తే.. వాటికి ఏటా రూ.16వేల కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. ప్రజలు కేసీఆర్ మోసపూరిత మాటలను నమ్మవద్దని సూచించారు. రేవంత్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి చిత్తశుద్ధితో ముందుకు పోతున్నామని స్పష్టం చేశారు. ఉద్యమిస్తా, సభలు పెడుతానంటే జనం ఛీ కొడుతారని హెచ్చరించారు.



# డాక్టర్లు దైవ సమానులు

### వృత్తిని వ్యాపారం చేయొద్దన్నా కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి పునర్జన్మనిచ్చేది డాక్టర్లేనని, అందుకే వారిని దైవంగా కొలుస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, కాబోయే డాక్టర్లు ఫార్మా కంపెనీలు, డయాగ్నస్టిక్ సెంటర్ల వలలో పడి ప్రజలకు అన్యాయం చేయవద్దని కోరారు. వైద్య విజ్ఞానంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని, లేనిపక్షంలో రోగుల పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుందని హెచ్చరించారు. ప్రతిమ మెడికల్ కాలేజీ ఉత్తర తెలంగాణకు వరప్రసాదమని, ముఖ్యంగా 'తల్లి బిడ్డ సంక్షేమ పథకం' ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. వైద్య విద్యార్థుల జీవితం కంటికి కన్పించని శత్రువుతో యుద్ధం వంటిదని, ఐదేళ్ల పాటు కష్టపడి చదివితేనే ప్రాణాలు కాపాడే గొప్ప అవకాశం దక్కుతుందని చెప్పారు. గతంలో తనకు గుండెపోటు వచ్చినప్పుడు డాక్టర్లే 12 సార్లు షాక్‌లు ఇచ్చి కాపాడారని తన వ్యక్తిగత అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. దేశంలో వైద్య సౌకర్యాల కొరతపై ఆందోళన వ్యక్తం చేస్తూ, డబ్ల్యూహెచ్ఓ (WHO) నిబంధనల ప్రకారం బెడ్ల సంఖ్య పెరగాలని, ముఖ్యంగా డాక్టర్లు గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పీజీ సీట్ల కొరత, అధిక ఫీజుల సమస్యపై చర్చించి విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చివరగా, తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేస్తూ.. కష్టపడి నిజాయితీగా పనిచేస్తే ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

## నేను వస్తా...

**మొదటిపేజీ తరువాయి....**

కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడిందని, ఈ జలదోపిడీపై న్యాయపోరాటం చేసేందుకు త్వరలోనే కేటీఆర్, హరీశ్ రావు ఢిల్లీకి వెళ్తారని ప్రకటించారు. వచ్చే ఏడాది జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా గత ఎన్నికల్లో పార్టీకి తక్కువ ఫలితాలు వచ్చిన మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలను టార్గెట్ చేస్తూ భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తొలుత మండల, నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి, ఆపై జిల్లా స్థాయిలో ప్రజాక్షేత్రంలోకి వెళ్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు సంస్థాగత బలోపేతంపై కేసీఆర్ కీలక ఆదేశాలు ఇచ్చారు. గర్వంతో ఎగిరిపడుతున్న కాంగ్రెస్ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతున్నారని, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చర్చా క్రమంలో ఆయన పార్టీని పాత పేరైన 'టీఆర్ఎస్' అని ప్రస్తావించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. తెలంగాణకు బీజేపీ శనిలా మారిందని, చంద్రబాబు మాటలు విని గతంలోనూ ఇబ్బంది పెట్టిందన్నారు. ఇప్పుడు కూడా చంద్రబాబు మాట వినే డీపీఆర్ వెనక్కి పంపిందని ఆరోపించారు. బచావత్ ట్రైబ్యునల్ 45 టీఎంసీలు కేటాయిస్తే ఈ ప్రభుత్వం ఆపుతోందన్నారు. దీనిపై త్వరలో భారీ బహిరంగ సభలు పెడుతామని, తాను స్వయంగా వస్తానని తెలిపారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా.. నిద్రపోతోందా? అని కేసీఆర్ ప్రశ్నించారు. ఎంతసేపూ భూములు అమ్ముకుందామనే యావలోనే ఉంటే ఎలా? రాష్ట్రానికి వచ్చే నీళ్లను కూడా కాపాడలేని ప్రభుత్వం.. ఇదేమి దద్దమ్మ ప్రభుత్వం? అని నిలదీశారు. జంటనగరాల్లో పట్టపగలే హత్యలు జరుగుతున్నా అడిగే దిక్కులేదన్నారు. పచ్చి అబద్ధాలు, వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి, అబ్రాసు పాటలు పాడి అధికారంలోకి వచ్చారని అన్నారు. మేము అధికారంలో ఉన్నప్పుడు అహంకార వైఖరి ప్రదర్శించలేదని కేసీఆర్ అన్నారు . కాంగ్రెస్ ఒక్క కొత్త పాలసీ కూడా తేలేదు. తీసుకొచ్చిన పాలసీ.. రియల్ ఎస్టేట్ కోసమేనని , రాష్ట్రంలో ప్రజల ఆస్తుల విలువ పూర్తిగా తగ్గిందన్నారు . ఒకప్పుడు యూరియా ఇంటికి, చేను వద్దకు వచ్చేదని , ఇప్పుడు యూరియా కోసం కుటుంబమంతా లైన్‌లో నిలబడే పరిస్థితి వచ్చింది'' అని కేసీఆర్ విమర్శించారు.





## హైడ్రా కమిషనర్ గన్‌మెన్ ఆత్మహత్యయత్నం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణ చైతన్య, ఆదివారం ఉదయం హయత్‌నగర్‌లోని తన నివాసంలో గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం కామినేని ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. గత రెండేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కు అలవాటు పడిన చైతన్య, భారీగా అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని, తన జీతం మొత్తం అప్పులకే సరిపోతుండటంతో మనస్తాపానికి గురై ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలిసింది. ఈ ఘటనపై స్పందించిన కమిషనర్ రంగనాథ్ ఆసుపత్రిని సందర్శించి, వైద్యులతో మాట్లాడారని, బుల్లెట్ తల పక్క నుంచి వెళ్లడం వల్ల ప్రస్తుతం సర్జరీ జరుగుతోందని పేర్కొన్నారు.



## గద్వాల గడ్డకు న్యాయం ఎప్పుడు చేస్తారు?

### విద్య, వైద్య రంగాలపై కవిత ఆందోళన

**జోగులాంబ గద్వాల జిల్లా (ఏడీఎన్ఎన్) :**

జోగులాంబ గద్వాల జిల్లాలో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగి తెలుసుకున్నారు. 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా గద్వాల పట్టణంలోని దౌలత్ చాయ్ హోటల్ వద్ద ప్రజలతో ఆదివారం ముచ్చటించిన ఆమె, జిల్లా ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై గళమెత్తారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా జిల్లాలో అక్షరాస్యత ఆశించిన స్థాయిలో లేకపోవడం, కనీసం ఒక్క ఇంజనీరింగ్ కళాశాల కూడా లేకపోవడం పాలకుల వైఫల్యమేనని విమర్శించారు. వైద్య సౌకర్యాల కొరత కారణంగా ప్రజలు అత్యవసర చికిత్స కోసం కర్నూలుకు వెళ్లాల్సి వస్తోందని, అక్కడ 'ఆరోగ్యశ్రీ' వర్తించక పేదలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు ఆసుపత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు అందేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాఘవేంద్ర కాలనీలో చేనేత కార్మికులతో భేటీ అయిన కవిత, నేతన్నలకు ఇస్తామన్న రూ. 24 వేల ఆర్థిక సాయం మరియు రుణమాఫీ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. గద్వాల చేనేత బ్రాండ్‌ను కాపాడాల్సిన ప్రభుత్వం, 50 ఎకరాల్లో చేనేత పార్క్ నిర్మిస్తామన్న హామీని తుంగలో తొక్కిందని మండిపడ్డారు. నాణ్యత లేని యంత్రాలను సరఫరా చేసి కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేయడంపై విచారణ జరపాలని కోరారు. ఇక అలంపూర్ నుంచి గద్వాల వరకు రహదారులు నరకప్రాయంగా మారాయని, దీనికి ఇసుక మాఫియా అక్రమ రవాణాయే కారణమని ప్రజలు వాపోతున్నారని తెలిపారు. ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలని, వారి సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ జాగృతి నిరంతరం పోరాడుతుందని కవిత స్పష్టం చేశారు.



## అనుమానం పెనుభూతమై తండ్రే కాలయముడయ్యాడు

**మెదక్ జిల్లా (ఏడీఎన్ఎన్) :**

మెదక్ జిల్లాలో సభ్యసమాజం తలదించుకునే దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. అనుమానం పెనుభూతమై ఒక తండ్రి తన మూడేళ్ల కన్న కొడుకును అత్యంత అమానుషంగా హతమార్చాడు. ఈ విషాద ఘటన మెదక్ మండలం పెద్దబాయి తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దబాయి తండాకు చెందిన భాస్కర్‌కు ఆరేళ్ల క్రితం తిమ్మక్కపల్లి తండాకు చెందిన మహిళతో వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్త వేధింపులు భరించలేక, భార్య తన కుమారుడిని భర్త వద్దే వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. బాలుడు తన వద్దే ఉన్న క్రమంలో.. కుమారుడిపై అనుమానం పెంచుకున్న భాస్కర్, తనకు పుట్టలేదన్న ఆగ్రహంతో తాడుతో బాలుడి గొంతు బిగించి ప్రాణం తీశాడు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న మెదక్ రూరల్ పోలీసులు, బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిందితుడు భాస్కర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పసికందు అని కూడా చూడకుండా కన్నతండ్రే ఈ దారుణానికి ఒడిగట్టడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## రాశి ఫలాలు

**22-12-2025 సోమవారం**

**మేషం:**
చేపట్టే పనుల్లో శ్రమ ఫలిస్తుంది. వ్యాపార యోగం అనుకూలంగా ఉంది. ఉద్యోగంలో ఎప్పటి పనులు అప్పుడే పూర్తిచేసుకోవాలి. ఆర్థిక లాభాలు అనుకూలంగా ఉన్నాయి.

**వృషభం:**
చేపట్టిన పనులలో కొన్ని ఆటంకాలు ఎదురైనా వాటిని అధిగమించే శక్తి మీకు ఉంది. భవిష్యత్ ప్రణాళికలు వేస్తారు. కొన్నిసార్లు మనోస్థితి మారుతూ ఉండవచ్చు, శాంతంగా ఉండాలి.

**మిథునం:**
చేపట్టే పనిలో ఉత్సాహంగా ముందుకు సాగాలి. ఎన్ని ఆటంకాలు ఎదురైనా వాటిని అదిగించే ప్రయత్నం చేస్తారు. మీ కీర్తి, ప్రతిష్ఠలు పెరుగుతాయి. ముఖ్య కార్యంలో బంధుమిత్రులను కలుపుకొని పోవడం మేలు.

**కర్కాటకం:**
చేపట్టే పనుల్లో శుభం చేకూరుతుంది. ఆత్మీయుల సహాయ సహకారాలు మేలుచేస్తాయి. శత్రువులు మిత్రులవుతారు. ముఖ్యమైన కొనుగోళ్లు చేస్తారు.

**సింహం:**
శారీరక శ్రమ పెరగుతుంది. బంధువులతో వాదులాటలకు దిగకపోవడమే మంచిది. అనవసర ధనవ్యయం జరిగే సూచనలు ఉన్నాయి.

**కన్య:**
చేపట్టిన పనుల్లో శ్రమ పెరుగుతుంది. కుటుంబ సభ్యుల సలహాలతో ముందుకు సాగడం మంచిది. శారీరక శ్రమ కాస్త పెరుగుతుంది. బంధుమిత్రులతో విభేదాలు రావచ్చు.

**తుల:**
శుభ భవిష్యత్తు ఉంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాల్లో గొప్ప ఫలితాలున్నాయి. ఒక శుభవార్త మీ మనోధైర్యాన్ని పెంచుతుంది.

**వృశ్చికం:**
చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురవుతాయి. శారీరక శ్రమ కాస్త పెరుగుతుంది. కొన్ని పరిస్థితులు నిరుత్సాహపరుస్తాయి. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకండి.

**ధనస్సు:**
చేపట్టిన పనులలో విజయసిద్ధి ఉంది. ఉద్యోగ వ్యాపారాల్లో తోటి వారిని కలుపుకొని పోవడం వల్ల పనులు త్వరగా పూర్తవుతాయి. మానసికంగా ధృఢంగా ఉంటారు.

**మకరం:**
మిశ్రమ కాలం. పనులకు ఆటంకాలు కలుగకుండా చూసుకోవాలి. మనోబలం తగ్గకుండా చూసుకోవాలి. ఓర్పు చాలా అవసరం. అనవసర భయాందోళనలను దరిచేరనీయకండి.

**కుంభం:**
మంచి ఫలితాలున్నాయి. విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. శుభకార్యక్రమాల్లో పాల్గొంటారు. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు.

**మీనం:**
మంచిపనులు చేస్తారు. వృత్తి, ఉద్యోగాల్లో అనుకూలత కలదు. మీ కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. కీలక వ్యవహారాల్లో వెనకడుగు వేయకండి. ప్రణాళికలకు అనుగుణంగా అడుగు ముందుకు వేయండి. స్థిర నిర్ణయాలు విజయాన్నిస్తాయి.



## రిటైర్ అయినా వదిలిపెట్టం

**నెల్లూరు (ఏడీఎన్ఎన్):**
నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గ ఇరిగేషన్ అధికారుల తీరుపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మండిపడ్డారు. ప్రస్తుత ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అండ చూసుకుని ఇరిగేషన్ ఎస్ఈ దేశీనాయక్, మేనేజర్ గంగాధర్ రెడ్డి వంటి అధికారులు విచ్చలవిడి అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు చట్టానికి లోబడి పనిచేయకుండా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారని విమర్శించారు. తాము తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పు చేసిన ప్రతి అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ విడిచిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగులు సర్వీసులో ఉన్నా లేదా పదవీ విరమణ చేసినా సరే, వారు చేసిన అవినీతికి సమాధానం చెప్పాల్సిందేనని కాకాణి వార్నింగ్ ఇచ్చారు.

"వదిలిపెట్టే ప్రసక్తే లేదు, ప్రతి ఒక్కరి లెక్కలు సరి చేయిస్తాం. అవసరమైతే అవినీతి అధికారుల ఆస్తులన్నీ అమ్మించి మరీ ప్రజా ధనాన్ని తిరిగి కక్కిస్తాం" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అధికారుల అవినీతిపై తమ వద్ద పూర్తి సమాచారం ఉందని, సరైన సమయంలో చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కాకాణి వ్యాఖ్యలపై తెలుగుదేశం పార్టీ నేతలు మరియు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వర్గీయులు ధీటుగా స్పందించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కాకాణి గోవర్ధన్ రెడ్డి కనుసన్నల్లోనే ఇరిగేషన్ శాఖలో భారీ కుంభకోణం జరిగిందని వారు ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు చేయకుండానే, కేవలం కాగితాలపై పనులు జరిగినట్లు చూపించి సుమారు రూ. 150 కోట్ల మేర బిల్లులు డ్రా చేశారని సోమిరెడ్డి ఆధారాలతో సహా నిరూపించారని వారు గుర్తు చేశారు. తాము చేసిన అవినీతికి సంబంధించిన పక్కా ఆధారాలు బయటపడటంతో, వాటిని కప్పిపుచ్చుకోవడానికే కాకాణి అధికారులపై విరుచుకుపడుతున్నారని టీడీపీ నేతలు విమర్శించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో కాకాణి చేసిన ఆర్థిక అక్రమాలపై విచారణ వేగవంతం అవుతున్నందున, అధికారులను భయభ్రాంతులకు గురిచేసి దర్యాప్తును అడ్డుకోవాలని చూస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో నెల్లూరు జిల్లాలో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది.

## ఆరోగ్యకరమైన సంతానం కోసం పంచసూత్రాలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



వివాహం చేసుకున్న దంపతులు తల్లిదండ్రులు అవ్వాలని కోరుకోవడం సహజమే. ఆరోగ్యమైన సంతానం కోసం కొన్ని పంచ సూత్రాలు పాటించాల్సిందేనని వైద్యులు చెప్తున్నారు. తెలివైన, ఆరోగ్యవంతమైన పిల్లల కోసం కొన్ని రూల్స్ పాటిస్తే మంచిది.

- సమీప బంధువుల సంబంధాలు, ముఖ్యంగా మేనరికాలు చేసుకుంటే పుట్టే పిల్లలకి సమస్యలు, తెలివి తక్కువ పిల్లలు, జన్యుపరమైన సమస్యలు, అవయవలోపాలు వచ్చే అవకాశం 3 రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, అలాంటి సంబంధాలు చేసుకునే ముందు పుట్టబోయే సంతానం ఆరోగ్యం గురించి ఆలోచించాలి.
- సరైన వయసుకే పిల్లల్ని కనడం మంచిది. మరీ ఆలస్యం కాకుండా చూసుకోవాలి. ఆడవారు 35 సంవత్సరాల తర్వాత గర్భం దాల్చినా మగవారు 40 సంవత్సరాల తర్వాత పిల్లల్ని కనాలనుకున్నా కూడా తెలివైన సంతానం లభించకపోవచ్చు. దంపతులలో ఎగ్, స్పెర్మ్ క్వాలిటీ తగ్గుతుంది. దీంతో అనారోగ్యమైన పిల్లలు పుడతారు. అంతేకాకుండా, పిల్లల తెలివితేటలపై ఆ ఎఫెక్ట్ పడుతుంది.
- పిల్లల్ని కనాలనుకున్నప్పుడు అలా ఉన్న సమస్యలకి ట్రీట్‌మెంట్ తీసుకుని ఆ తర్వాత పిల్లల్ని కనే ప్రయత్నం చేయాలి. రక్తహీనత, థైరాయిడ్, డయాబెటిస్, బరువు ఎక్కువగా ఉండడం లాంటి సమస్యలు ఉన్నవారు ముందుగా వాటికి ట్రీట్‌మెంట్ తీసుకుని సమస్యల్ని తగ్గించుకుని ఆ తర్వాత పిల్లల్ని కంటే పుట్టే పిల్లలు కూడా ఆరోగ్యంగా, తెలివిగా పుడతారు.
- పిల్లల్ని కనాలనుకున్నప్పుడు సిగరెట్స్, ఆల్కహాల్ వంటి అలవాట్లు ఉంటే వాటిని ముందుగా దూరం చేసుకున్నాకే పిల్లల్ని ప్లాన్ చేయండని చెబుతున్నారు డాక్టర్లు. ఎందుకంటే, ఇలాంటి అలవాట్లు పిల్లల ఆరోగ్యాన్ని, తెలివితేటలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి.
- ప్రెగ్నెన్సీ నిలిచిందని తెలిసాక కూడా సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. గర్భిణిగా ఉన్న సమయంలో రెగ్యులర్‌గా డాక్టర్‌ని సంప్రదించాలి. టైమ్‌కి స్కానింగ్ చేయాలి. ఐరన్, ఫోలిక్ యాసిడ్ రెగ్యులర్‌గా వాడాలి. ఇలా చేస్తేనే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా, తెలివితో పుడతారు. కాబట్టి, ఈ విషయాన్ని మరువొద్దు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే పిల్లలు ఆరోగ్యంగా, తెలివిగా పుడతారు.

అలాగే రక్తహీనత, థైరాయిడ్, డయాబెటిస్, బరువు ఎక్కువగా ఉండడం లాంటి సమస్యలు ఉన్నవారు ముందుగా వాటికి ట్రీట్‌మెంట్ తీసుకుని సమస్యల్ని తగ్గించుకుని ఆ తర్వాత పిల్లల్ని కంటే పుట్టే పిల్లలు కూడా ఆరోగ్యంగా, తెలివిగా పుడతారు.

## నిజమైన ఆనంద రహస్యం తెలిసింది

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



ప్రపంచంలో చాలామంది తమను డబ్బు లేదా కీర్తి వల్లే ఆనందం లభిస్తుందని భావించారు. కానీ హార్వర్డ్ శాస్త్రవేత్తలు ఇది నిజం కాదంటున్నారు. వారు కొన్ని బృందాలపై సుదీర్ఘ అధ్యయనం చేశారు. నిజమైన ఆనందం కోసం 1938లో పరిశోధన మొదలుపెట్టారు. ఇది 85 ఏళ్ల పాటు సాగి జరిగి కీలక విషయాలను వెల్లడించింది. ఈ పరిశోధన 1938లో హార్వర్డ్ విద్యార్థులు.. బోస్టన్‌లోని నిరుపేద కుటుంబాలకు చెందిన మొత్తం 724 మంది పురుషులతో ప్రారంభమైంది. దశాబ్దాల కాలంలో వారి వివాహాలు, ఉద్యోగాలు, అనారోగ్యాలు, విజయాలు, వైఫల్యాలను పరిశోధకులు నిశితంగా గమనించారు. ప్రస్తుతం వారి వారసులు కలిపి మొత్తం 1,300 మందిపై ఇంకా ఈ అధ్యయనం కొనసాగుతోంది. దీనిలో తేలిందేంటంటే...

- ఆనందానికి, ఆరోగ్యానికి మూలం సంపద కాదు.. మనకు ఇతరులతో ఉన్న సంబంధాలే. మంచి సంబంధాలు మనల్ని సంతోషంగా ఉంచడమే కాకుండా మన మెదడును, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎంత డబ్బున్నా ఒంటరి వ్యక్తులు ఆనందంగా లేరని ఈ అధ్యయనం తెలియజేసింది.
- చిన్నతనంలో లభించే ప్రేమ, భద్రత మనిషి వ్యక్తిత్వాన్ని, భవిష్యత్తు బంధాలను బలంగా మలుస్తాయి.
- మన కష్టసుఖాల్లో తోడుండే నమ్మకమైన వ్యక్తులు ఎంతమంది ఉన్నారనేదే ముఖ్యం. చక్కటి అనుబంధాలే మనకు రక్షణ కవచాలు.
- సరైన వ్యాయామం, సమతుల్య ఆహారం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందం లభిస్తుంది.
- ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటాం.. సమస్యల నుంచి ఎంత త్వరగా కోలుకుంటాం అనే దానిపైనే మన ఆనందం ఆధారపడి ఉంటుంది.
- చేసే పనిలో సంతృప్తి, రిటైర్మెంట్ తర్వాత కూడా ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండటం మనిషిని ఉత్సాహంగా ఉంచుతుంది.

డబ్బు అవసరమే కానీ అది కేవలం సౌకర్యాలను మాత్రమే ఇవ్వగలదు. నిజమైన ఆనందం మనం మన కుటుంబంతో, స్నేహితులతో పంచుకునే ప్రేమలో ఉంది. అని ఈ అధ్యయనం తెలియజేస్తోంది.

## సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్య అరెస్ట్

- **14 రోజుల రిమాండ్ ... చంచల్‌గూడ జైలుకు తరలింపు**

**నాంపల్లి (ఏడీఎన్ఎన్):**



మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్యను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. తాజాగా ఆయన్ను నాంపల్లిలోని ఎన్ఐఏ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. దీంతో అధికారులు ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇటీవల మరణించిన మావోయిస్టు నేత కాతా రామచంద్రారెడ్డి అంత్యక్రియలకు హాజరైన ఇన్నయ్య, అక్కడ మావోయిస్టులకు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను ప్రేరేపించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై ఉపా చట్టం కింద కేసు నమోదు చేశారు. గతంలో మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత ఛత్తీస్‌గఢ్ వెళ్లిన ఆయన, హిడ్మా తల్లిని కలిసి కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీరును తీవ్రంగా విమర్శించడంతో ఎన్ఐఏ ఆయనపై దృష్టి సారించింది. ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసిన ఎన్ఐఏ, తాజాగా మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న ఆధారాలతో ఆయన్ను అదుపులోకి తీసుకుంది. అరెస్టును ఖండించిన పూర్వ విప్లవ విద్యార్థి వేదిక భారత్ బచావో ప్రధాన కార్యదర్శి, సామాజిక కార్యకర్త గాదె ఇన్నారెడ్డిపై ఎన్ఐఏ అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడాన్ని పూర్వ విప్లవ విద్యార్థి వేదిక కన్వీనర్ సాంబమూర్తి తీవ్రంగా ఖండించారు. మావోయిస్టు నేత కట్టా రామచంద్రారెడ్డి అంత్యక్రియల సందర్భంగా ఇన్నయ్య చేసిన ప్రసంగాన్ని సాకుగా చూపి, ఆయనపై 'ఉపా' వంటి క్రూరమైన చట్టాలను ప్రయోగించడం అప్రజాస్వామికమని విమర్శించారు. రామచంద్రారెడ్డిని పోలీసులు పట్టుకుని హత్య చేశారనే అనుమానాలను వ్యక్తం చేసినందుకే, ప్రశ్నించే గొంతులను నొక్కేయాలనే కుట్రతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ అరెస్టుకు పాల్పడిందని ఆరోపించారు. ముఖ్యంగా ఇన్నయ్య నిర్వహిస్తున్న 'మన ఇల్లు' అనాథాశ్రమంలోకి భారీగా పోలీసులు ప్రవేశించి, అక్కడి పిల్లలను మరియు గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం అమానుషమని మండిపడ్డారు. ఇది భావప్రకటనా స్వేచ్ఛను కాలరాయడమేనని పేర్కొన్న సాంబమూర్తి, ఇన్నయ్యను వెంటనే విడుదల చేయాలని మరియు ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కిషన్ రెడ్డి లేఖకు విలువే లేదు

- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై జగ్గారెడ్డి ఫైర్**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**




కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాయడంపై కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సోనియా గాంధీని ప్రశ్నించే నైతిక హక్కు బీజేపీ నేతలకు లేదని, కిషన్ రెడ్డి రాసిన లేఖకు అసలు విలువ లేదని కొట్టిపారేశారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల క్రితం ఇచ్చిన హామీలైన నల్లధనం తిరిగి తీసుకురావడం, ప్రతి పేదవాడి ఖాతాలో 15 లక్షలు వేయడం, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించడం వంటివి ఏమయ్యాయని ఆయన నిలదీశారు. మోదీ ఇచ్చిన హామీల వైఫల్యంపై కిషన్ రెడ్డి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 13 హామీల్లో 10 హామీలను అమలు చేసిందని, మహిళలకు రూ. 2500 ఇచ్చే పథకం మరియు వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల సాయం త్వరలోనే అందుతాయని స్పష్టం చేశారు. అలాగే ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని, భూమి లేని పేదలకు ప్రభుత్వం భూమి కొని ఇస్తుందని తెలిపారు. మోదీ హామీల వైఫల్యాలపై చర్చకు రావాలని కిషన్ రెడ్డికి జగ్గారెడ్డి ఈ సందర్భంగా సవాల్ విసిరారు.

## కేటీఆర్‌ది ఐరన్ లెగ్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**



కేటీఆర్‌ది 'ఐరన్ లెగ్' అని, ఆయన వల్లే బీఆర్ఎస్ ఎన్నికల్లో ఓడిపోవడానికి కారణమని కేటీఆర్ సొంత కుటుంబ సభ్యులే అనుకుంటున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చమత్కరించారు. సీఎం రేవంత్ రెడ్డితో ఫుట్‌బాల్ ఆడాలని తహతహలాడుతున్న కేటీఆర్‌ను రాజకీయాల్లో ఇప్పటికే రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేదని, స్వయంకృషితో జెడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. కానీ కేటీఆర్ మాత్రం తన తండ్రి అండతో రాజకీయాల్లోకి వచ్చి, సిరిసిల్లలో స్వల్ప మెజారిటీతో గెలిచారని విమర్శించారు. . రేవంత్ రెడ్డి గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతం చేయడంతో కేటీఆర్‌లో ఫ్రస్ట్రేషన్ పెరిగిందని, 8 లక్షల కోట్ల అప్పులు చేసిన బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదని మండిపడ్డారు. మరోవైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై కూడా చామల విరుచుకుపడ్డారు. పంచాయతీ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని మోదీ నుంచి చివాట్లు తిన్న కిషన్ రెడ్డి, తన ఉనికి కాపాడుకోవడానికే సోనియా గాంధీకి లేఖ రాశారని ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ అవినీతిపై కిషన్ రెడ్డి ఎందుకు లేఖలు రాయలేదని, కేంద్ర సంస్థల ద్వారా వారి దోపిడీని ఎందుకు అడ్డుకోలేదని నిలదీశారు. ఇప్పటికైనా విమర్శలు ఆపి తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.




## గుడ్డు తింటే క్యాన్సర్, అనుమానాలపై స్పష్టీకరణ

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
కోడిగుడ్డు తింటే క్యాన్సర్ వస్తుందంటూ సోషల్‌మీడియాలో కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం జరుగుతోంది.దీంతో కొంతమంది భయంతో వాటిని కొనేందుకు ముందుకురావట్లేదు. ఈ నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI) తాజాగా స్పందించింది. గుడ్డులో ఎలాంటి కాన్సర్ కారకాలు లేవని స్పష్టం చేసింది. గుడ్డు గురించి చెడుగా సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని అవన్నీ అవాస్తవాలంటూ కొట్టిపారేసింది. భారత్‌లో విక్రయించే గుడ్లలో నైట్రోఫ్యూరాన్ మెటబాలైట్స్ ను గుర్తించినట్లు, కొన్నిరోజులుగా పలు పోస్టులు వెలుగులోకి వచ్చాయి. 2011లో తీసుకొచ్చిన ఆహార భద్రత నిబంధనల ప్రకారం.. పౌల్ట్రీ, ఎగ్ ప్రొడక్షన్ జరిగే అన్ని దశల్లో నైట్రోఫ్యూరాన్ల వాడకాన్ని, పూర్తిగా నిషేధించినట్లు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వెల్లడించారు. భారతదేశంలో నియంత్రణా ప్రమాణాలు అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఉన్నాయని పేర్కొంది. దీంతో కోడిగుడ్లపై వస్తున్న వార్తలకు చెక్ పెట్టినట్లయ్యింది.



## మేడారం మహాజాతర 2026 పోస్టర్ విడుదల

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**
మేడారం మహాజాతర2026 అధికారిక పోస్టర్‌ను ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ , ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు ఈ జాతర అత్యంత వైభవంగా జరగనుంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భారీ స్థాయిలో ఏర్పాట్లు ప్రారంభించింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సీఎం సూచించారు.



## జగన్ పుట్టినరోజున వైసీపీ సేవాపథం

**నరసరావుపేట (ఏడీఎన్ఎన్):**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 53వ పుట్టినరోజు వేడుకలను పల్నాడు జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం సభ్యులు పాల్గొన్నారు.ఆస్పత్రి లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి , వారికి పండ్లు , బ్రెడ్లను అందజేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా సోషల్ మీడియా సెక్రెటరి కరీముల్లా మాట్లాడుతూ.. జగన్ మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని, ఆయన పుట్టినరోజును కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా ఇటువంటి సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. పేదల ఆరోగ్యం కోసం జగన్ ప్రవేశపెట్టిన పథకాలు ఎందరికో ప్రాణదానం చేశాయని కరీముల్లా గుర్తు చేశారు.ఈ కార్యక్రమ నిర్వహణలో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సెక్రెటరీ కరీముల్లా, బాబ్జి తదితరులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు .

## మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి లాభాల పంట

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**



మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 255 కోట్ల ఉచిత ప్రయాణాలు చేయడం తెలంగాణ మహిళా సాధికారతకు నిదర్శనమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు . డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రజా భవన్‌లో ఆర్టీసీ , బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.మహిళా ప్రయాణికుల కోసం ప్రత్యేక కార్డుల పంపిణీకి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ తో ఒప్పందం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బకాయిలైన పీఎఫ్ మరియు సీసీఎస్ నిధులను భారీగా తగ్గించి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. అలాగే, పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్ నగరాలకు సుమారు 2900 ఎలక్ట్రిక్ బస్సులు త్వరలో రానున్నాయని, వీటికి అవసరమైన చార్జింగ్ స్టేషన్లను వేగంగా ఏర్పాటు చేయాలని సూచించారు. మరోవైపు విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ 100 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేయడంతో పాటు, గురుకులాల మెస్ మరియు కాస్మొటిక్ చార్జీల కోసం రూ.152 కోట్లు విడుదల చేసినట్లు భట్టి వెల్లడించారు. నాయి బ్రాహ్మణ, రజక వృత్తుల వారికి ఉచిత విద్యుత్ బిల్లులను క్రమం తప్పకుండా చెల్లించాలని అధికారులను ఆదేశిస్తూ, ప్రజా ప్రభుత్వం సమానత్వం అభ్యున్నతి దిశగా సాగుతోందని స్పష్టం చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో రంగం లోకి సజ్జనార్



- **ప్రభాకర్‌రావును స్వయంగా విచారించనున్న సీపీ**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**
ఫోన్ల అక్రమ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావును హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్వయంగా విచారించబోతుండటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సోమవారం ఆయన సిట్ కార్యాలయానికి వెళ్లి ప్రభాకర్‌రావును నేరుగా ప్రశ్నించనున్నట్లు సమాచారం. ఈ కేసు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఏసీపీ, డీసీపీ లేదా జాయింట్ సీపీ స్థాయి అధికారులు మాత్రమే నిందితులను విచారించగా, ఏకంగా కమిషనర్ స్థాయి అధికారి స్వయంగా రంగంలోకి దిగడం ఇదే తొలిసారి. శనివారం మధురానగర్‌లో జరిగిన సైబర్ అవగాహన సదస్సులో పాల్గొన్న సీపీ సజ్జనార్, ట్యాపింగ్ కేసు దర్యాప్తు కొనసాగుతోందని మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణ జరుగుతోందని, విచారణ సౌలభ్యం కోసం సిట్ కార్యాలయాన్ని మార్చే యోచనలో ఉన్నామని ఆయన తెలిపారు. ఇప్పటికే శనివారం ప్రభాకర్‌రావును సిట్ అధికారులు ప్రశ్నించగా, సోమవారం సీపీ చేపట్టబోయే విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



## ఆసియా కప్ ఫైనల్‌లో
# భారత్ ఓటమి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అండర్19 ఆసియా కప్ 2025లో అప్రతిహత విజయాలతో ఫైనల్‌కు చేరిన భారత యువ జట్టు, కీలకమైన తుది పోరులో పాకిస్థాన్ చేతిలో 191 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 347 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ సమీర్ మిన్హాస్ (172) వీరోచిత శతకంతో భారత బౌలర్లపై విరుచుకుపడగా, అహ్మద్ హుస్సేన్ (56) అర్ధ సెంచరీతో రాణించాడు. తర్వాత 348 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్ ఇండియా 26.2 ఓవర్లలో కేవలం 156 పరుగులకే కుప్పకూలింది. ఒక దశలో 120 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడగా, పదో స్థానంలో వచ్చిన దీపేశ్ దేవేంద్రన్ (36) టాప్ స్కోరర్‌గా నిలిచి పోరాడటంతో స్కోరు 150 దాటింది. పాక్ బౌలర్ అలీ రజా 4 వికెట్లతో భారత వెన్ను విరిచాడు. బౌలింగ్‌లో మూడు వికెట్లు, బ్యాటింగ్‌లో 36 పరుగులు చేసిన దీపేశ్ ఒక్కడే మెరిసినప్పటికీ, మిగిలిన వారు విఫలం కావడంతో భారత్‌కు రన్నరప్ స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.



## ప్రపంచ కుబేరుడి
# అరుదైన రికార్డు

❖ **700 బిలియన్ డాలర్ల రికార్డు బద్ధలు!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టెస్లా సీఈఓ ఎలన్ మస్క్ ప్రపంచ ఆర్థిక చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. ప్రపంచంలోనే 700 బిలియన్ డాలర్లకు పైగా సంపద కలిగిన తొలి వ్యక్తిగా ఆయన అవతరించారు. డెలావేర్ సుప్రీంకోర్టు వెలువరించిన ఒక కీలక తీర్పు మస్క్ సంపదను అమాంతం పెంచడమే కాకుండా, ఆయనను తిరుగులేని ఆర్థిక శక్తిగా నిలబెట్టింది. భారతీయ కరెన్సీలో మస్క్ ప్రస్తుత సంపద విలువ దాదాపు రూ. 62.70 లక్షల కోట్లు కావడం విశేషం.

2018లో టెస్లా కంపెనీ మస్క్ కోసం ప్రకటించిన 55 బిలియన్ డాలర్ల భారీ వేతన ప్యాకేజీపై గత కొంతకాలంగా న్యాయపోరాటం సాగుతోంది. టెస్లా వృద్ధిలో మస్క్ కృషిని గుర్తిస్తూ బోర్డు ఈ ప్యాకేజీని ప్రకటించగా, ఒక వాటాదారు దీనిపై కోర్టును ఆశ్రయించారు. నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ 2024లో కింది కోర్టు ఈ ప్యాకేజీని రద్దు చేసింది. అయితే, తాజాగా డెలావేర్ సుప్రీంకోర్టు ఈ ప్యాకేజీని పునరుద్ధరిస్తూ తీర్పునివ్వడంతో మస్క్ ఖాతాలో భారీగా సంపద వచ్చి చేరింది. టెస్లా స్టాక్ ఆప్షన్ల పునరుద్ధరణ తర్వాత ఫోర్బ్స్ బిలియనీర్ల సూచీ ఎలన్ మస్క్ సంపదను 749 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. కోర్టు తీర్పు ఫలితంగా మస్క్ నికర ఆస్తికి అదనంగా 139 బిలియన్ డాలర్లు తోడయ్యాయి. దీంతో కొద్దిరోజుల క్రితమే 600 బిలియన్ డాలర్ల రికార్డును అందుకున్న మస్క్, వారం తిరగకముందే 700 బిలియన్ డాలర్ల మార్కును కూడా అధిగమించి ప్రపంచాన్ని విస్మయానికి గురిచేశారు. టెస్లా, స్పేస్ఎక్స్, ఎక్స్ వంటి దిగ్గజ సంస్థల అధిపతిగా ఉన్న మస్క్, ఈ స్థాయి సంపదను సొంతం చేసుకోవడం అంతర్జాతీయ వ్యాపార వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కంపెనీ లక్ష్యాలను చేరుకోవడంలో ఆయన చూపిన అసాధారణ ప్రతిభే ఈ భారీ ప్యాకేజీకి దక్కడానికి కారణమని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




## జనవరి 1 నుంచి
# వాహన ధరల మోత

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

కొత్త ఏడాది ప్రారంభం నుంచి కారు లేదా బైక్ కొనుగోలు చేయాలనుకునే వారికి షాక్ తగలనుంది. ప్రముఖ కార్ల తయారీ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ తో పాటు లగ్జరీ కార్ల దిగ్గజాలు మెర్సిడెస్ బెంజ్, బీఎమ్‌డబ్ల్యూ తమ వాహన ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఈ ధరల పెంపు జనవరి 1, 2026 నుంచి అమల్లోకి రానుంది. ముడిసరుకు ధరలు పెరగడం, ఉత్పత్తి వ్యయాలు భారం కావడంతో వాహన ధరలను పెంచక తప్పడం లేదని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ ఇండియా వెల్లడించింది. వాహన మోడల్ మరియు వేరియంట్‌ను బట్టి ఈ పెంపు 2 శాతం వరకు ఉండవచ్చని కంపెనీ స్పష్టం చేసింది. కేవలం సాధారణ కార్లే కాకుండా, లగ్జరీ కార్ల ధరలు కూడా భారీగా పెరగనున్నాయి. మెర్సిడెస్ బెంజ్ ఇండియా, బీఎమ్‌డబ్ల్యూ ఇప్పటికే తమ ధరల పెంపును ధ్రువీకరించాయి. ఇదే బాటలో బీఎండబ్ల్యూ మోటోరాడ్ సైతం తమ ప్రీమియం బైక్‌ల ధరలను ఏకంగా 6 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్ హర్‌దీప్ సింగ్ బ్రార్ తెలిపిన వివరాల ప్రకారం, అంతర్జాతీయ మార్కెట్లో డాలరు, యూరోలతో పోలిస్తే రూపాయి విలువ గణనీయంగా పడిపోవడం, ముడి పదార్థాల ధరల పెరుగుదల , రవాణా వ్యయాలు భారంగా మారడం ఈ ధరల పెంపునకు ప్రధాన కారణాలు. ప్రస్తుతం బీఎండబ్ల్యూ విక్రయించే జీ 310 ఆర్ఆర్, సీఈ 02 వంటి మేడ్ ఇన్ ఇండియా బైక్‌లతో పాటు ఎఫ్ 900 జీఎస్ వంటి దిగుమతి చేసుకున్న ప్రీమియం బైక్‌ల ధరలు రూ. 2.81 లక్షల నుంచి రూ. 48.63 లక్షల మధ్య ఉన్నాయి. తాజా పెంపుతో వీటి ధరలు మరింత ప్రియం కానున్నాయి. ఈ నేపథ్యంలో, కొత్త ఏడాదిలో వాహనం ఇంటికి తెచ్చుకోవాలనుకునే వారు ఈ నెలాఖరులోపు బుక్ చేసుకోవడమే లాభదాయకమని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

# బీసీసీఐ బిగ్ ప్లాన్,గిల్‌పై వేటు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**






టీ20 వరల్డ్ కప్ ఆడబోయే భారత జట్టులో క్రికెటర్ శుభ్‌మన్‌గిల్‌కు చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నీలో 15 మంది సభ్యుల జట్టులో అతనికి స్థానం దక్కలేదు. టీ20 ఫార్మట్‌లో వైస్ కేప్టెన్‌గా అతనికి ఇటీవలే పదోన్నతి లభించినప్పటికీ, ఇప్పుడు ఏకంగా జట్టులో చోటు కోల్పోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పేలవమైన ప్రదర్శన కారణంగానే బీసీసీఐ అతన్ని టీ20 ఇంటర్నేషనల్స్ జట్టు నుండి తొలగించింది. ప్రస్తుతం టీ20 ఇంటర్నేషనల్స్ ఆడబోయే జట్టులో ఈ ఒక్కటి తప్ప పెద్దగా మార్పులు చేర్పులేవీ చోటు చేసుకోలేదు. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ తమ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. టాప్ ఆర్డర్‌లో తిలక్‌వర్మ, లోయర్ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగే ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే ఈ జట్టులో కొనసాగుతున్నారు. మరో ఆల్ రౌండర్ అక్షర్ పటేల్‌కు ప్రమోషన్ లభించింది. శుభ్‌మన్ గిల్ స్థానంలో వైస్ కెప్టెన్సీ అతనికి దక్కింది. గిల్ ఒక్కడే కాదు.. మరో ఇద్దరు టీ20 స్పెషలిస్ట్ స్టార్ బ్యాటర్లకు కూడా జట్టులో చోటు దక్కలేదు. డాషింగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, వీరిద్దరికీ టీ20 వరల్డ్ కప్ ఆడే అవకాశం లభించలేదు. యశస్వి జైస్వాల్ స్థానంలో సంజు శాంసన్ జట్టులో బెర్త్ సంపాదించాడు. వికెట్ కీపింగ్ చేయగలగడం, ఓపెనర్‌గా ఆడే సామర్థ్యం ఉండటం అతనికి ప్లస్ పాయింట్ అయింది. అంతేకాకుండా టీ20 ఫార్మట్‌కు తగ్గట్టుగా దూకుడుగా ఆడగలడు. మరో బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ ఫామ్‌లో కూడా సెలెక్టర్లు పక్కన పెట్టారు. మొన్నటికి మొన్న దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో గైక్వాడ్ టాప్ లేపాడు. సెంచరీతో దుమ్ములేపి ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. అటు ఐపీఎల్‌లోనూ తడాఖా చూపుతున్నాడు. మోస్ట్ సక్సెస్‌ఫుల్ టీమ్ చెన్నై సూపర్ కింగ్స్ కు కేప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అయినప్పటికీ అతని పేరును పరిగణనలోకి తీసుకోకుండా, జట్టు కూర్పు దెబ్బతింటుందని సెలెక్టర్లు వెల్లడించారు.

# 'సూర్య ది బ్యాటర్' మళ్ళీ వస్తాడు

❖ **ఫామ్‌పై సూర్యకుమార్ యాదవ్ భావోద్వేగ వ్యాఖ్యలు**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**




టీమిండియా టీ20 జట్టు సారథిగా అద్భుతమైన రికార్డులు సృష్టిస్తున్న సూర్యకుమార్ యాదవ్, వ్యక్తిగత బ్యాటింగ్‌లో మాత్రం కెరీర్‌లోనే అత్యంత గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తన ఫామ్‌పై చాలా నిజాయితీగా స్పందించారు. "ప్రస్తుతం నా బ్యాటింగ్‌లో పరుగుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఇది ప్రతి ఆటగాడి కెరీర్‌లో వచ్చే సహజమైన దశ. అయితే నేను ఫామ్ కోల్పోలేదు, కేవలం పరుగులు మాత్రమే రావడం లేదు . ఎక్కడ తప్పు జరుగుతుందో నాకు తెలుసు, దాన్ని ఎలా అధిగమించాలో కూడా నాకు స్పష్టమైన అవగాహన ఉంది. ఇది ఒక చిన్న అడ్డంకి మాత్రమే, దాన్ని తప్పకుండా దాటుతాను" అని సూర్య ధీమా వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా తన పాత బ్యాటింగ్ వీడియోలను చూస్తూ లోపాలను సరిదిద్దుకుంటున్నానని, నెట్స్ లో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నానని ఆయన వెల్లడించారు. 2025లో సూర్యకుమార్ యాదవ్ గణాంకాలు పరిశీలిస్తే ఆయన ఫామ్ ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఈ ఏడాది ఆడిన 21 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లలో సూర్య కేవలం 218 పరుగులు మాత్రమే చేయగా, ఆయన సగటు కేవలం 13.62గా ఉంది. ముఖ్యంగా దక్షిణాఫ్రికాతో జరిగిన హోమ్ సిరీస్‌లో నాలుగు మ్యాచ్‌ల్లో కలిపి కేవలం 34 పరుగులే చేయడం గమనార్హం. 2025 ఏడాది మొత్తంలో ఆయన ఒక్క హాఫ్ సెంచరీ కూడా సాధించలేకపోయారు. గతంలో నంబర్ 1 టీ20 బ్యాటర్‌గా ఒక వెలుగు వెలిగిన సూర్య, కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత బ్యాటింగ్‌లో పట్టు కోల్పోయినట్లు కనిపిస్తున్నారు. ప్రపంచకప్ లక్ష్యంగా పునరాగమనం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సొంతగడ్డపై జరగనున్న టీ20 ప్రపంచకప్ 2026కు భారత జట్టును నడిపించడం తనకు దక్కిన గొప్ప గౌరవమని, అదే సమయంలో అది పెద్ద బాధ్యత అని సూర్య పేర్కొన్నారు. "ప్రపంచ కప్‌కు ముందు మాకు న్యూజిలాండ్‌తో సిరీస్ ఉంది. ఆ సమయానికి మీరు పాత సూర్యను చూస్తారు. జట్టులోని యువ ఆటగాళ్లు తిలక్ వర్మ వంటి వారు అద్భుతంగా రాణిస్తుండటం కెప్టెన్‌గా నాకు చాలా సంతోషాన్నిస్తోంది" అని చెప్పారు. 2026 ప్రపంచకప్‌లో సూర్యకుమార్ నంబర్ 4 స్థానంలో బ్యాటింగ్‌కు రానున్నట్లు సమాచారం. తన మార్క్ '360 డిగ్రీల' ఆటతో మళ్ళీ ఫ్యాన్స్ ను అలరిస్తానని, వచ్చే మెగా టోర్నీ నాటికి పూర్తి ఫామ్‌లోకి వస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆసీస్ దే యాషెస్ టెస్ట్ సిరీస్








**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రతిష్ఠాత్మక యాషెస్ టెస్ట్ సిరీస్‌లో ఆస్ట్రేలియా జట్టు తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కిందటి నెల 21న ప్రారంభమైన సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా ఆదివారం జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్‌పై 82 పరుగుల తేడాతో విజయం సాధించి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. ఈ విజయంతో యాషెస్ ట్రోఫీని ఆస్ట్రేలియా తన వద్దే నిలబెట్టుకుంది. 435 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ జట్టు 352 పరుగులకు ఆలౌట్ అయింది; జాక్ క్రాలీ (85), జేమీ స్మిత్ (60) పోరాడినప్పటికీ ఫలితం లేకపోయింది. సిరీస్ అంతటా ట్రావిస్ హెడ్ వరుస సెంచరీలతో చెలరేగగా, మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో, అలెక్స్ కేరీ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించారు. ఇప్పటికే సిరీస్ కోల్పోయిన ఇంగ్లాండ్ కనీసం మిగిలిన రెండు టెస్టుల్లోనైనా గెలిచి పరువు నిలబెట్టుకోవాలని చూస్తుండగా, డిసెంబర్ 26న మెల్‌బోర్న్ వేదికగా ప్రారంభమయ్యే 'బాక్సింగ్ డే' టెస్టులో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా ఆసీస్ సిద్ధమవుతోంది.

# రికార్డు సృష్టిస్తున్న ఫాస్ట్ ట్యాగ్ వార్షిక పాస్!


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**




నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఫాస్ట్ ట్యాగ్ యాన్యువల్ పాస్' ( కు దేశవ్యాప్తంగా అదిరిపోయే రెస్పాన్స్ లభిస్తోంది. 2025 ఆగస్టు 15న ఈ పథకాన్ని ప్రారంభించిన మొదటి రోజే సాయంత్రం 7 గంటల వరకు సుమారు 1.4 లక్షల మంది వినియోగదారులు వార్షిక పాస్‌ను కొనుగోలు చేసి యాక్టివేట్ చేసుకున్నారు. తొలిరోజే టోల్ ప్లాజాల వద్ద ఈ పాస్ ద్వారా 1.39 లక్షల లావాదేవీలు విజయవంతంగా జరిగాయి. ఈ పథకం కింద వాహనదారులు తమ ప్రస్తుత ఫాస్ట్ ట్యాగ్‌కు ఒకేసారి రూ. 3,000 రీచార్జ్ చేసుకుంటే, అది 200 ట్రిప్పులు లేదా ఒక ఏడాది గడువు వరకు వర్తిస్తుంది. సాధారణంగా తరచూ ప్రయాణించే వారికి టోల్ రూపంలో ఏడాదికి రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు ఖర్చవుతుండగా, ఈ వార్షిక పాస్ ద్వారా ఆ ఖర్చు కేవలం రూ. 3,000కే పరిమితం కావడం విశేషం. ఈ వార్షిక పాస్ కేవలం వ్యక్తిగత (నాన్‌కమర్షియల్) కార్లు, జీపులు మరియు వ్యాన్లకు మాత్రమే వర్తిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 1,150 జాతీయ రహదారులు , ఎక్స్‌ప్రెస్‌వేల టోల్ ప్లాజాల వద్ద దీనిని ఉపయోగించుకోవచ్చు. అయితే, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని టోల్ రోడ్లకు ఇది వర్తించదు. వాహనదారులు కొత్తగా ఫాస్ట్ ట్యాగ్ కొనాల్సిన అవసరం లేకుండా, ప్రస్తుతం ఉన్న ట్యాగ్‌నే 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్ లేదా ఎన్‌హెచ్ఏఐ వెబ్‌సైట్ ద్వారా రీచార్జ్ చేసుకుని యాక్టివేట్ చేసుకోవచ్చు. ప్రతిసారి టోల్ దగ్గర బ్యాలెన్స్ చెక్ చేసుకోవాల్సిన అవసరం లేకపోవడం, రీచార్జ్ చేసే శ్రమ తగ్గడం మరియు భారీగా నగదు ఆదా అవుతుండటంతో వాహనదారులు ఈ పాస్ పట్ల మొగ్గు చూపుతున్నారు. కేవలం రెండు నెలల కాలంలోనే ఈ పాస్ వినియోగదారుల సంఖ్య 25 లక్షలు దాటడం దీని ప్రాధాన్యతను చాటుతోంది. ప్రస్తుతం 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్ కూడా ఈ పాస్ సేవల కారణంగా టాప్ రేటింగ్‌తో దూసుకుపోతోంది. ప్రయాణ ఖర్చులను తగ్గించుకోవాలనుకునే వారికి ఈ వార్షిక పాస్ ఒక వరంలా మారింది.

# బంపరాఫర్, ఐఫోన్ 15 ఎంతంటే..?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



ఐఫోన్ వాడాలనే కోరిక చాలామందికి ఉంటుంది. కానీ దాని ధర చూసి వెనకడుగు వేస్తుంటారు. అలాంటి వారికి క్రోమా తీపి కబురు అందించింది. 2025 డిసెంబర్ సేల్ సందర్భంగా.. ఐఫోన్ 15పై ఊహించని రీతిలో భారీ తగ్గింపును ప్రకటించింది. అంతేకాదు బ్యాంక్ ఆఫర్లు, ఎక్స్చేంజ్ బోనస్‌లు అన్నీ కలిపితే ఈ ఫోన్ ధర సగానికి పైగా తగ్గిపోవడం విశేషం.ఆపిల్ ఐఫోన్ 15 ప్రారంభ ధర రూ. 79,900 కాగా.. ప్రస్తుతం క్రోమాలో నేరుగా రూ. 57,990కే అందుబాటులో ఉంది. అయితే మీరు స్మార్ట్ గా ప్లాన్ చేస్తే ఈ ధరను మరింత తగ్గించవచ్చు. మీ పాత ఫోన్‌ను ఎక్స్చేంజ్ చేయడం ద్వారా రూ. 14వేల వరకు తగ్గింపు రాయితీని పొందవచ్చు. ట్రేడ్‌ఇన్ వాల్యూపై అదనంగా రూ. 4,500 బోనస్ లభించనుంది. ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులపై భారీ క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఉన్నాయి. ఈ ఆఫర్లన్నీ కలిపితే ఐఫోన్ 15 కేవలం రూ. 36,490కే మీ చేతికి వచ్చే అవకాశం ఉంది. అంటే బడ్జెట్ ఫోన్ ధరకు ప్రీమియం ఐఫోన్ అన్నమాట. ఐఫోన్ 15 కేవలం బ్రాండ్ కోసం మాత్రమే కాదు, ఇందులో ఉన్న ఫీచర్లు కూడా అద్భుతంగా ఉన్నాయి.గతంలో ప్రో మోడల్స్ కు మాత్రమే పరిమితమైన డైనమిక్ ఐలాండ్ ఫీచర్ ఇప్పుడు ఇందులో పొందుపరిచారు. నోటిఫికేషన్లు, అలెర్ట్స్ చాలా స్టైలిష్‌గా కనిపిస్తాయి. ఇందులో 48మెగాపిక్సెల్ మెయిన్ కెమెరా ఉంది. తక్కువ వెలుతురులోనూ అద్భుతమైన ఫోటోలు, ప్రొఫెషనల్ పోర్ట్రెయిట్‌లు తీసుకోవచ్చు.గేమింగ్ అయినా, మల్టీ టాస్కింగ్ అయినా ఏ16 బయోనిక్ చిప్ అత్యంత వేగవంతమైన పనితీరును అందిస్తుంది. ఐఫోన్ చరిత్రలో మొదటిసారిగా యూఎస్‌బీ టైప్‌సీ పోర్ట్ ఇవ్వడం వల్ల ఛార్జింగ్, డేటా ట్రాన్స్ ఫర్ మరింత సులభం కానుంది. 6.1 అంగుళాల సూపర్ రెటినా XDR డిస్‌ప్లే కళ్ళకు ఎంతో రిచ్ అనుభూతినిస్తుంది. ఈ ఆఫర్ కేవలం జనవరి 4 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నట్లు కంపెనీ పేర్కొంది. మరి ఆలస్యం చేయకుండా స్టాక్ ముగిసేలోపే క్రోమా స్టోర్లు, వెబ్‌సైట్‌లో సెర్చ్ చేసి ఈ డీల్‌ను సొంతం చేసుకోండి.




## శ్రీలంకపై భారత మహిళల జట్టు
# ఘనవిజయం..

**సూపర్ జెమీమా ఇన్నింగ్స్**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

విశాఖపట్నం వేదికగా జరిగిన ఐదు టీ20ల సిరీస్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై 8 వికెట్ల తేడాతో టీమ్ ఇండియా ఆదివారం ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసింది. తర్వాత 122 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, మరో 32 బంతులు మిగిలి ఉండగానే కేవలం 14.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. భారత బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ (69 నాటౌట్) మెరుపు అర్ధ సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించగా, ఓపెనర్ స్మృతి మంధాన (25), కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (15 నాటౌట్) రాణించారు. ఓపెనర్ షెఫాలీ వర్మ (9) త్వరగానే అవుట్ అయినప్పటికీ, జెమీమా బౌండరీలతో విరుచుకుపడి జట్టును గెలుపు తీరాలకు చేర్చింది. ఈ విజయంతో సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

## ఆ ఓటమి
# నన్ను కుంగదీసింది..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



ఐసీసీ 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో ఎదురైన పరాజయం తన జీవితంలో అత్యంత కఠినమైన సమయమని భారత క్రికెట్ దిగ్గజం రోహిత్ శర్మ వ్యాఖ్యానించారు. తాజాగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్ అనంతరం తాను అనుభవించిన మానసిక వేదనను గుర్తు చేసుకున్నారు. వరుస విజయాలతో దూసుకుపోయిన భారత్, చివరి మెట్టుపై బోల్తా పడటం అప్పట్లో కోట్లాది మంది అభిమానులతో పాటు ఆటగాళ్లను కూడా తీవ్ర నిరాశకు గురిచేసిన విషయం తెలిసిందే. "ఆ రోజు ఏం జరిగిందో మేం నమ్మలేకపోయాం. 2022లో కెప్టెన్సీ చేపట్టిన నాటి నుంచి వన్డే వరల్డ్ కప్ గెలవడమే నా ఏకైక లక్ష్యంగా ఎంతో కష్టపడ్డాను. కానీ ఫైనల్‌లో ఓడిపోయాక నేను పూర్తిగా కుంగిపోయాను. ఆ సమయంలో నా శరీరంలో కనీసం శక్తి కూడా లేనట్లు అనిపించింది" అని రోహిత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఓటమి బాధ నుంచి బయటపడి, తిరిగి సాధారణ స్థితికి రావడానికి తనకు దాదాపు రెండు నెలల సమయం పట్టిందని ఆయన వెల్లడించారు. అయితే ఆ పరాజయం తనకు ఒక పెద్ద పాఠాన్ని నేర్పిందని రోహిత్ పేర్కొన్నారు. "నిరాశను ఎలా ఎదుర్కోవాలో, తిరిగి కొత్తగా ఎలా ఆరంభించాలో ఆ సమయం నాకు నేర్పింది. ఆ బాధను దిగమింగుకుని నా దృష్టిని టీ20 ప్రపంచకప్ 2024 వైపు మళ్లించాను. ఇప్పుడు ఈ విషయాలు చెప్పడం సులభంగానే అనిపించవచ్చు కానీ, అప్పట్లో నేను ఎదుర్కొన్న పరిస్థితి చాలా కఠినమైనది" అని వివరించారు. వన్డే వరల్డ్ కప్ చేజారినప్పటికీ, రోహిత్ శర్మ పట్టుదల వీడలేదు. 2024 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టును అజేయంగా నడిపించి, ప్రపంచ విజేతగా నిలిపి తన కలను నెరవేర్చుకున్నారు. వన్డే వరల్డ్ కప్ ఓటమి ఇచ్చిన గాయానికి టీ20 వరల్డ్ కప్ విజయం ఒక గొప్ప మందులా పనిచేసిందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## సెబీ సరికొత్త
# టెక్ మంత్రం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

స్టాక్ ఎక్స్చేంజీల పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు ఇన్వెస్టర్ల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సెబీ నిర్ణయించింది. మార్కెట్ పర్యవేక్షణను పటిష్టం చేసేందుకు ఒక ప్రత్యేక 'వర్కింగ్ గ్రూప్'ను ఏర్పాటు చేయనున్నట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన కమోడిటీ, క్యాపిటల్ పార్టిసిపెంట్స్ అసోసియేషన్ 11వ అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. రాబోయే 5 నుంచి 10 ఏళ్లలో స్టాక్ ఎక్స్చేంజ్ టెక్నాలజీ ఏ విధంగా రూపాంతరం చెందాలి? అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న ఉత్తమ ప్రమాణాలను మన మార్కెట్లు ఎలా అందుకోవాలి? అనే అంశాలపై ఈ కమిటీ ప్రధానంగా దృష్టి పెడుతుందని పాండే వివరించారు. ముఖ్యంగా మార్కెట్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు కొత్త విధానాలను ఈ వర్కింగ్ గ్రూప్ సిఫార్సు చేయనుంది. ఎక్స్చేంజీలలో తలెత్తే సాంకేతిక లోపాలను సెబీ అత్యంత తీవ్రంగా పరిగణిస్తుందని చైర్మన్ హెచ్చరించారు. "సాంకేతికత పరంగా మనం అత్యంత పటిష్టంగా ఉండాలి. ఎక్కడ చిన్న లోపం తలెత్తినా అది ఇన్వెస్టర్ల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. అందుకే మార్కెట్ స్థిరత్వం కోసం ప్రతి లోపాన్ని లోతుగా విశ్లేషిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. కేవలం స్టాక్ మార్కెట్లే కాకుండా, నాన్‌అగ్రి కమోడిటీ డెరివేటివ్స్ విభాగంలోనూ సంస్కరణలు తీసుకురావాలని సెబీ యోచిస్తోంది. వీటిని సమీక్షించేందుకు కూడా మరో వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తున్నామని, దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేస్తామని పాండే స్పష్టం చేశారు. మార్కెట్‌లో లిక్విడిటీని పెంచేందుకు బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల భాగస్వామ్యంపై ఆర్‌బీఐ , ఐఆర్‌డీఏఐ తో కూడా సెబీ సంప్రదింపులు జరుపుతోందని ఆయన వెల్లడించారు.


సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
22.12.2025
www.manasarkar.com

## మోహన్ లాల్ 'వృషభ'

# ట్రైలర్ వచ్చేసింది!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**
మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ "వృషభ". ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకొస్తోంది. ఈ నెల 25 "వృషభ" సినిమా గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ ద్వారా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ చిత్రాన్ని కన్నెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బ్యానర్లపై శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మిస్తున్నారు. విమల్ లహోటి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న "వృషభ" సినిమాను దర్శకుడు నందకిషోర్ మలయాళం, తెలుగులో రూపొందించారు. తాజాగా "వృషభ" సినిమా ట్రైలర్ ను రిలీజ్ చేశారు. సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఉన్న ఈ ట్రైలర్ ఇన్ స్టంట్ గా మూవీ లవర్స్ ను ఆకట్టుకుంటోంది. "వృషభ" సినిమా ట్రైలర్ ఎలా ఉందో చూస్తే బిజినెస్ మ్యాన్ ఆఫ్ ది సెంచరీగా పేరు తెచ్చుకుని వ్యాపార రంగంలో ఖ్యాతి సంపాదిస్తాడు ఆదిదేవ వర్మ (మోహన్ లాల్). ఈ లెజెండరీ బిజినెస్ మ్యాన్ కు శత్రువులు ఎక్కువే. కెరీర్ లో తిరుగులేని ఆదిదేవ వర్మ మానసికంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటాడు. అతనికి తన గత జన్మ జ్ఞాపకాలు గుర్తుకువస్తుంటాయి. ఆ జ్ఞాపకాల్లో రాజా విజయేంద్ర వృషభ (మోహన్ లాల్) అసమాన యోధుడిగా తన సామ్రాజ్యాన్ని, ప్రజల్ని కాపాడుకుంటూ ఉంటాడు. ఆదిదేవ వర్మ కొడుకు (సమర్జిత్ లంకేష్) సైకియాట్రిస్టులతో సంప్రదింపులు చేస్తూ, శత్రు దాడుల నుంచి తండ్రిని కాపాడుకుంటూ ఉంటాడు. ఆదిదేవ వర్మను వెంటాడుతున్నవి పునర్జన్మ జ్ఞాపకాలేనా, ఆ జ్ఞాపకాల్లోని రాజా విజయేంద్ర వృషభ గొప్పతనం ఏంటి, ఈ గతాన్ని, ఈ వర్తమానాన్ని కలుపుతూ కథ ఎలాంటి మలుపులతో సాగింది అనేది ట్రైలర్ లో ఆసక్తి కలిగించింది. హై టెక్నికల్ వ్యాల్యూస్, స్టార్ కాస్టింగ్ తో విజువల్ వండర్ గా "వృషభ" సినిమా ఉండబోతున్నట్లు ట్రైలర్ ప్రామిస్ చేస్తోంది.






## మళ్ళీ కెరీర్ పైనే

# దృష్టి!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**
స్వతహాగా మలయాళీ అయినప్పటికీ తెలుగులో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న పూర్ణ.. ఈ మధ్య కాలంలో డ్యాన్స్ షోలకు జడ్జిగా, సహాయ నటిగా కనిపిస్తూ మళ్ళీ బిజీ అయిపోయింది. మూడేళ్ల క్రితం దుబాయికి చెందిన షనిద్ ఆసిఫ్ అనే బిజినెస్‌మ్యాన్‌ని పెళ్లి చేసుకుంది. కొడుకు పుట్టడంతో కొన్నాళ్ల పాటు గ్యాప్ తీసుకుంది. 'గుంటూరు కారం'లో కుర్చీ మడతపెట్టి పాటతో నటిగా రీఎంట్రీ ఇచ్చింది. తాజాగా బాలకృష్ణ 'అఖండ 2'లోనూ మెరిసింది. పూర్ణ అసలు పేరు షమ్నా కాసిం. చిన్నప్పుడే క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకుంది. అలా మలయాళంలో సూపర్ డ్యాన్సర్ అనే పోటీలో పాల్గొని గుర్తింపు తెచ్చుకుంది. తర్వాత నటి అయిపోవడంతో మళ్లీ స్టేజీ పెర్ఫార్మెన్స్ లు ఇచ్చే అవకాశం రాలేదు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత కెరీర్ పైనే దృష్టి సారించింది. అలాగే ఇటీవల స్టేజీపై నృత్య ప్రదర్శన చేసిన తర్వాత భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయింది. భర్త గురించి చెబుతూ పూర్ణ ఎమోషనల్ అయిపోయింది. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. మళ్ళీ సినిమాల్లో నచ్చిన పాత్రలు చేస్తూ బిజీబిజీగా మారాలనుకుంటోంది.

## ది స్క్రిప్ట్ క్రాఫ్ట్ ఇంటర్నేషనల్

# షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ప్రారంభం



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**
ప్రతిభ గల రచయితలను ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందిన 'ది స్క్రిప్ట్ క్రాఫ్ట్' వెబ్ సైట్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ను నిర్వహిస్తోంది. ఈ ఫిలిం ఫెస్టివల్ ను రెబల్ స్టార్ ప్రభాస్ ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఏ ఫిలింమేకర్ అయినా ఈ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ లో పాల్గొనవచ్చు. 2 నిమిషాలకు మించిన నిడివి గల లఘు చిత్రాలను ఏ జానర్ లో అయినా పంపించవచ్చు. 90 రోజుల పాటు ఈ కాంటెస్ట్ జరగనుంది. ది స్క్రిప్ట్ క్రాఫ్ట్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ను ప్రారంభించిన అనంతరం స్పెషల్ వీడియో ద్వారా తన విశెస్ అందించారు రెబల్ స్టార్ ప్రభాస్. ఈ కార్యక్రమం గురించి దర్శకులు సందీప్ రెడ్డి వంగా, నాగ్ అశ్విన్, హను రాఘవపూడి తమ స్పందన తెలియజేశారు. ప్రభాస్ మాట్లాడుతూ.. ది స్క్రిప్ట్ క్రాఫ్ట్ నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ఎంతోమంది న్యూ ఫిలింమేకర్స్ కెరీర్స్ కు పునాదిలా మారబోతోంది. వెండితెరపై ప్రతి గొంతు వినిపించాలి, ప్రతి ఒక్కరి కల నిజం కావాలి, కొత్త కథల్ని చెప్పాలనుకుంటున్న ప్రతిభావంతులకు ది స్క్రిప్ట్ క్రాఫ్ట్ ఆహ్వానం అందిస్తోంది. అని అన్నారు. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ .. ఫిలింమేకింగ్ ప్రాసెస్ లో షార్ట్ ఫిలింస్ చేయడం మొదటి అడుగు. మీరు క్రియేటివ్ గా రాసుకునే స్క్రిప్ట్, దాన్ని అంతే పర్ఫెక్ట్ గా తెరకెక్కించడం, రెండూ భిన్నమైనవి. సినిమా రంగంలోకి రావాలనుకునే ఔత్సాహిక ఫిలింమేకర్స్ కు ది స్క్రిప్ట్ క్రాఫ్ట్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ఒక మంచి వేదికగా చెప్పుకోవచ్చు.

# 'గుర్రం పాపిరెడ్డి' విజయోత్సవం

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**
నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన సినిమా "గుర్రం పాపిరెడ్డి". ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందించారు. రీసెంట్ గా థియేట్రికల్ రిలీజ్ కు వచ్చిన "గుర్రం పాపిరెడ్డి" సినిమా కంప్లీట్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో...

ప్రొడ్యూసర్ వేణు సద్ది మాట్లాడుతూ ఇది సక్సెస్ మీట్ కన్నా మీ అందరికీ థ్యాంక్స్ చెప్పే మీట్ అనుకుంటున్నా. "గుర్రం పాపిరెడ్డి" సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్. మీలాగే నాకూ ఈ సినిమా బాగా నచ్చింది. మా మూవీలోని ప్రతి ఒక్కరు మంచి ఎఫర్ట్స్ పెట్టి సినిమాను హిట్ చేశారు. అన్నారు. ప్రొడ్యూసర్ అమర్ బురా మాట్లాడుతూ నేను ఈ సినిమా చేయడానికి సపోర్ట్ గా నిలిచిన వారు వేణు, సంధ్య, జయకాంత్. వారు లేకుంటే "గుర్రం పాపిరెడ్డి" సినిమా మీ ముందుకు వచ్చేది కాదు. ఇది థ్యాంక్స్ మీట్ గానే భావిస్తున్నాం. సక్సెస్ మీట్ లో డీటెయిల్డ్ గా మాట్లాడుతా. మా సినిమాలో ఫరియా, నరేష్, రాజ్ కుమార్, వంశీ కామెడీకి ప్రేక్షకులు బాగా నవ్వుతున్నారు. అలాగే మా సినిమాలోని ప్రొడక్షన్ వ్యాల్యూస్ గురించి చెబుతున్నారు. మ్యూజిక్, ఆర్ట్ వర్క్, విజువల్స్..ఇలా అన్నీ క్వాలిటీగా ఉన్నాయనే ఫీడ్ బ్యాక్ వస్తోంది. నా కాస్ట్ అండ్ క్రూ అందరికీ థ్యాంక్స్ చెబుతున్నా.



అన్నారు. ప్రొడ్యూసర్ జయకాంత్ (బాబీ) మాట్లాడుతూ మా "గుర్రం పాపిరెడ్డి" సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందనతో పాటు రివ్యూస్ పాజిటివ్ గా వస్తున్నాయి. పెయిడ్ ప్రీమియర్స్ కు రెస్పాన్స్ చాలా బాగుంది. మేము అనుకున్న దానికంటే ఎక్కువ మంది పెయిడ్ ప్రీమియర్స్ కు వచ్చారు. థియేటర్స్ హౌస్ ఫుల్స్ అవుతున్నాయి. మీరు ఇంకొంత సపోర్ట్ చేసి మా సినిమాను పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నా. టికెట్స్ కావాలనుకునే వారికి మా ప్రొడక్షన్ నుంచి నేను అరెంజ్ చేస్తాను. అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ కృష్ణ సౌరభ్ మాట్లాడుతూ మా సినిమాకు నిన్నటి నుంచి వస్తున్న రెస్పాన్స్ ఈ వారం మొత్తం మీ దగ్గర నుంచి కంటిన్యూ కావాలని కోరుకుంటున్నా. యాక్టర్ వంశీధర్ కోసిగి మాట్లాడుతూ "గుర్రం పాపిరెడ్డి" సినిమా ఫ్రెష్ కంటెంట్ తో వచ్చింది. ఇలాంటి కొత్త తరహా చిత్రాలని ఆదరిస్తే మరిన్ని మంచి మూవీస్ వస్తాయి. థియేటర్ లో సినిమా చూస్తూ నేనూ సర్ ప్రైజ్ గా ఫీలయ్యా. ఒక చిన్న సినిమా ఇంత మంచి ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో రావడం అరుదు. సినిమా కోసం ఏది అడిగినా ప్రొడ్యూసర్స్ ఇచ్చారని మా డైరెక్టర్ మురళీ గారు చెబుతుంటేవారు.

## 'ధురంధర్' డిజిటల్

## హక్కులపై దుమారం!



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**
ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న సినిమా 'ధురంధర్'. పేరుకి ఇది హిందీ సినిమా అయినప్పటికీ, దక్షిణాదిలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అద్భుతమైన ఆదరణ పొందుతోంది. థియేటర్లలో విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్ రావడంతో కలెక్షన్లు ఊహించిన దానికంటే చాలా వేగంగా పెరిగాయి. చూసిన ప్రేక్షకుల్లో ఎక్కువ మంది సినిమా బాగా నచ్చిందని చెబుతుండగా, మరికొందరు మాత్రం "ఓటీటీలోకి వచ్చిన తర్వాత చూద్దాం" అన్న ధోరణిలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే 'ధురంధర్' డిజిటల్ హక్కులపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో రణ్‌వీర్ సింగ్ కీలక పాత్రలో నటించగా, అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించారు. 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆదిత్య ధర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రిలీజ్‌కు ముందు వరకు సినిమాపై ఓ మోస్తరు అంచనాలే ఉన్నప్పటికీ, థియేటర్లలోకి వచ్చిన తర్వాత మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

## హారర్ థ్రిల్లర్స్‌లో

**నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి**

# 'ఈషా' కొత్తగా ఉంటుంది

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**
ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి సూపర్‌హిట్ కల్ట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వయం తాజాగా 'ఈషా' పేరుతో ఓ హారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరాబోతున్నారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని ఈనెలా 25న చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల రాజు వెడ్స్ రాంబాయి చిత్రంతో సూపర్‌హిట్ కొట్టిన అఖిల్‌రాజ్‌తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది తెలిసిందే.. కాగా ఈ నెల 25న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో నిర్మాతలు వంశీ నందిపాటి, బన్నీవాస్ ప్రత్యేకంగా మాట్లాడారు.. ఆ విశేషాలివి...

**వరుసగా మీ ఇద్దరూ రెండు బ్లాక్‌బస్టర్‌లు అందుకున్నారు.. ఇది మూడో సినిమా కూడా కంటెంట్ నమ్మకంతో చేస్తున్నారా? అబ్లిగేషన్‌తో చేస్తున్నారా?**

**బన్నీవాస్ :** ఇది అబ్లీగేషన్ కాదు. ఒకవేళ తీసుకున్నా ఇది కంటెంట్ నచ్చితేనే మాత్రమే తీసుకున్నాం. సినిమా నచ్చకపోతే వెంటనే వాళ్లకు వేరే ప్రత్యామ్నాయ మార్గం చెబుతాం. ఈసినిమా కంటెంట్ మీద నమ్మంతోనే అసోసియేట్ అయ్యాం.

**ఈసారి 'ఈషా'లాంటి హారర్ జోనర్‌లోకి వెళ్లారు ఎందుకని?**

**వంశీ నందిపాటి:** సినిమా బాగుంది. మొదటి పది



నిమిషాల్లోనే మీకు మేము ఈ సినిమా ఎందుకు తీసుకున్నామో.. అందరికి అర్థమవుతుంది. సినిమా ఆద్యంతం ఎంతో ఆసక్తిగా భయంగా ఉంటుంది. హారర్ అండ్ థ్రిల్లర్ ఈ సినిమా ఇది. చివరి 15 నిమిషాలు, సినిమా చాలా కొత్తగా ఉంటుంది.

**మీనుంచి సినిమా అనగానే అందరిలో ఎక్స్‌పెక్టేషన్స్ ఉంటాయి. ఈ సినిమా ఆ అంచనాలను అందుకుంటుందా?**

**బన్నీ వాస్:** నా సొంత సినిమాల్లో ఫెయిల్ అయినా డిస్ట్రిబ్యూషన్స్ లో ఫెయిల్ కాలేదు. ఈ సినిమా విషయంలో ఫెయిల్ కాను అనే నమ్మకం ఉంది. ఇది ఆడియన్స్ ఎక్స్ పెక్టేషన్స్ కు తప్పకుండా రీచ్ అవుతుంది. మిత్రమండలి ఫెయిల్ అయినా ప్రేక్షకుల తీర్పును అంగీకరించి మరుసటి రోజే ఆ సినిమా గురించి మరిచిపోయాను. నేను వంశీ కలిసి చేసిన ఏ సినిమా కూడా ఫెయిల్‌కాదనే నమ్మకం ఉంది. ఈషా కూడా ఫస్ట్‌కాపీ చూసి తీసుకున్నాం. తప్పకుండా ఈ సినిమా మా నమ్మకాన్ని నిలబెడుతుంది.

**లిటిల్‌హార్ట్స్ , రాజు వెడ్స్ రాంబాయి సినిమాల తరహాలోనే ఇది కూడా ఉంటుందా?**

**వంశీ నందిపాటి :** లిటిల్‌హార్ట్స్, రాజువెడ్స్ రాంబాయితో కంపేర్ చేయకూడాదు.దానితో పోల్చకూడదు. ఈ రెండు సినిమాల విషయంలో ఏది అనుకున్నామో అదే జరిగింది. ఈషా విషయంలో కూడా మేము అనుకున్నది జరుగుతుంది. తొలిపదిహేను నిమిషాలు అదిరిపోతుంది. పతాక సన్నివేశాలు స్టనింగ్‌గా ఉంటాయి.

**2026 మీ ప్లానింగ్ ఎలా ఉంది?**

బన్నీవాస్ ఈ మధ్య చిన్నసినిమాల పబ్లిసిటి చాలా ఇన్నోవేటింగ్‌గాచేస్తున్నారు.కంటెంట్ బాగుంటే సినిమాలు ఆడుతున్నాయి. 2026లో నా సినిమాలు మూడు ఫిబ్రవరిలో అనౌన్స్ చేస్తాను. గీతా ఆర్ట్స్ లో ఓ సినిమా, బన్నీవాస్ వర్క్స్ లో కూడా రెండు సినిమాలు ఉంటాయి.

**హార్ట్ వీక్ ఉన్నవాళ్లు, ఈ సినిమా చూడకూడదు అన్నారు.. ఇలాంటి హారర్ సినిమాలకు ప్రత్యేకమైన లిమిటెడ్ ఆడియన్స్ ఉంటారు కదా?**

**వంశీ నంది పాటి:** ఇది కేవలం హారర్ సినిమానే కాదు అందరికి వర్కవుట్ అవుతుంది. దీనికి ప్రత్యేకమైన ఆడియన్స్ ఉంటారు. ఈ సినిమా లాస్ట్ 20 నిమిషాలు హారర్ సినిమాలా ఉండదు.ఓ మంచి విషయం చెప్పారని ఫీల్ అవుతారు.

**లిటిల్‌హార్ట్స్ , రాజు వెడ్స్ రాంబాయి ఈ సినిమాలను మీరు ముందుకు తీసుకెళ్లిన విధానం అందర్ని ఇంప్రెస్ చేస్తుంది అసలు మీ ప్లానింగ్ ఏమిటి?**

వంశీ నందిపాటి మేము మోర్ దెన్ డిస్ట్రిబ్యూటర్స్ చేసే వర్క్ చేస్తున్నాం. ఎడిట్ రూమ్ దగ్గర్నుంచీ మేము అనుకున్న మార్పులు చేసి..సినిమాను ఓ ప్లానింగ్ ప్రకారం విడుదల చేస్తున్నాం. ఆర్‌ఆర్‌తో పాటు మ్యూజిక్‌లో కూడా ఇన్‌వాల్వ్ అవుతాం.. సినిమాను మార్కెటింగ్ చేసి..నాన్‌థియేట్రికల్‌ను కూడా క్లోజ్ చేసి.. సినిమాలను విడుదల చేస్తున్నాం మాదొక కొత్త ట్రెండ్.. ఫిల్మ్‌ను ఓ స్ట్రాటజీ ప్రకారం విడుదల చేస్తున్నాం.

-ఎం.డి అబ్దుల్



## లవ్, ఎమోషన్ డ్రామా

# 'దండోరా' ట్రైలర్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**
వైవిధ్యమైన చిత్రం కలర్ ఫొటో, బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందించిన తాజా చిత్రం 'దండోరా'. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ సినిమాను మురళీకాంత్ తెరకెక్కించారు. ఈ చిత్రం డిసెంబర్ 25న భారీ ఎత్తున విడుదల కాబోతోంది. వైవిధ్యమై ప్రమోషనల్ స్ట్రాటజీతో 'దండోరా' సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. సినిమా రిలీజ్‌కు ముందే బిజినెస్‌ను పూర్తి చేసుకోవటం విశేషం. చిత్రాన్ని నైజాంలో మైత్రీ మూవీస్ సంస్థ రిలీజ్ చేస్తుంటే.. ఆంధ్ర, సీడెడ్, కర్ణాటక ఏరియాల్లో ప్రైమ్ షో రిలీజ్ చేస్తోంది. ఓవర్సీస్‌లో 200కు పైగా థియేటర్స్‌లో సినిమాను అథర్వణ భద్రకాళి పిక్చర్స్ గ్రాండ్ రిలీజ్ చేస్తోంది. ఓవర్సీస్‌లో అయితే డిసెంబర్ 23నే ప్రీమియర్స్ పడుతున్నాయి. మంచి అంచనాలతో క్రిస్మస్ సందర్భంగా విడుదలవుతోన్న 'దండోరా' సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సాంకేతికంగా మనిషి రోజు రోజుకీ ఎంతో ఎదుగుతున్నాడు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు మంచి చదువులు చదువుకుని అమెరికాకు వెళ్తున్నారు.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**